పద్నాలుగు వందల
నలభై రెండు నిమిషాలు
రూ॥100/- పేజీలు:96

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

కవిత తిరిగి క్రియాశీలమవడం వెనుక..!

మయన్మార్‌లో ఆంగ్ సాన్ సూకీ మినహా 5,864 మంది ఖైదీలకు క్షమాభిక్ష

శిక్షపడిన దేశ నేతగా వైట్‌హౌస్‌లోకి

లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 197 | ఆదివారం | 05-01-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా



- పథకం కింద ఏడాదికి 12వేల ఆర్థికసాయం
- వ్యవసాయయోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా
- ప్రతీ ఎకరాకు రూ.12వేలకు పెంపు
- జనవరి 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు
- పాలమూరు-రంగారెడ్డికి సూదిని జైపాల్‌రెడ్డి పేరు ; సింగూరుకు రాజనర్సింహ్మా పేరు పెట్టాలని మంత్రివర్గం నిర్ణయం
- కొత్తగూడెం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదముద్ర
- క్యాబినేట్ నిర్ణయాలను వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/ హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయానికి యోగ్యమైన భూములన్నింటికీ ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా పథకం కింద ఏటా ఎకరాకు రూ.12 వేలు ఇవ్వాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. అలాగే భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు 'ఇందిరమ్మఆత్మీయ భరోసా' పథకం పేరుతో ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయం తీసుకుంది. కొత్త రేషన్ కార్డులను జనవరి 26వ తేదీ నుంచి జారీచేసేందుకు ఆమోదముద్ర వేసింది. ఈ కార్యక్రమాలన్నీ జనవరి 26వ తేదీ నుంచి అమలు జరుగుతాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శనివారం జరిగింది. కొత్తగూడెం మున్సిపాలిటిని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు కేబినేట్ ఆమోద ముద్ర వేసింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని, సింగూరు ప్రాజెక్టుకు మంత్రి దామోదర రాజనర్సింహ్మా తండ్రి, దివంగత మంత్రి రాజనర్సింహ్మా పేరు పెట్టాలని తెలంగాణ మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. జూరాల నుంచి కృష్ణా జలాలను మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా మరింత ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఉన్న మార్గాలు, ప్రత్యేమ్నాయాలను పరిశీలించేందుకు టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించాలని మంత్రివర్గ నిర్ణయం తీసుకుంది. ఎక్కడ నీటి లభ్యత ఉంది? ఎక్కడ నుంచి ఎంత నీటిని తీసుకునే వీలుంది? ఎక్కడెక్కడ రిజర్వాయర్లు నిర్మించాలి?

తరువాయి 2లో



పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు.

భారత అణుశాస్త్రవేత్త

## ఆర్.చిదంబరం కన్నుమూత



**న్యూఢిల్లీ :** ప్రముఖ అణుశాస్త్రవేత్త రాజగోపాల చిదంబరం (88) శనివారం ఉదయం కన్నుమూశారు. ముంబయిలోని జస్‌లోక్ ఆస్పత్రిలో శనివారం వేకువజామున 3 గంటల 20 నిమిషాలకు రాజగోపాల చిదంబరం తుదిశ్వాస విడిచారని అణు ఇంధన శాఖ వెల్లడించింది. రాజగోపాల చిదంబరం చెన్నైలో జన్మించారు. మద్రాస్ యూనివర్సిటీలో బిఎస్‌సి పూర్తి చేశారు. 1962లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి పిహెచ్‌డి సాధించారు. 1974లో జరిపిన పోఖ్రాన్1, 1998లో నిర్వహించిన పోఖ్రాన్ 2 అణు పరీక్షల్లో

తరువాయి 2లో

## హైడ్రా నేరుగా ఫిర్యాదుల స్వీకరణ

ప్రతి సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలని నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్



చెరువులు పరిరక్షణ, పునరుద్ధరణ, నాలాలు, ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు అండగా నిలబడి సహాయ సహకారాలు అందించేందుకు ఉద్దేశించిన హైడ్రా ఇప్పుడు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించడానికి సిద్ధమైంది. ప్రతి సోమవారం రోజు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని హైడ్రా నిర్ణయించింది. చెరువులు, ప్రభుత్వ స్థలాలు,నాలాలు, పార్కులు ఇలా ప్రజావసరాలకు

తరువాయి 2లో

పోలవరం ప్రభావంపై

## అధ్యయనం

నెల రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలి : సిఎం

ప్రజాపక్షం/ హైదరాబాద్

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణపై పడే ప్రభావం పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ పై పడే ప్రభావానికి సంబంధించి ఐఐటి హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయించి నెల రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని నీటిపారుదల శాఖ అధికారులను సిఎం ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో సిఎ రేవంత్ రెడ్డి అధ్యక్షతన నీటి పారుదల శాఖ సమావేశం జరిగింది. ఈసమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట ప్రభుత్వ సలహాదారు(నీటి పారుదల శాఖ) ఆదిత్యానాథ్ దాస్,తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పోలవరం నిర్మాణంతో భద్రాచలం దేవాలయానికి ఏర్పడే ముప్పుపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఐఐటి హైదరాబాద్ బృందంతో సమన్వయం కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. 2022 లో 27 లక్షల క్యూసెక్ ల వరద నీరు వచ్చినప్పుడు భద్రాచలం ముంపునకు గురైనట్లు నీటిపారుదల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదేవిధంగాఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని సైతం అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవలే ఎపి ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సైతం ఇచ్చినట్లు వివరించిన అధికారులు జలాల ఆధారంగా నిర్మిస్తున్న ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని సిఎంకు తెలిపారు. దీంతో ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలను తెలపాలని అధికారులకు

తరువాయి 2లో

దేశమంతా ఎంఎస్‌పి చట్టబద్ధతకు

## అన్ని రాష్ట్రాల్లోనూ పోరాడండి

- ఇది పంజాబీ రైతుల పోరాటం మాత్రమే కాదు
- కేంద్రానికి సందేశాలు పంపాలని డల్లేవాల్ పిలుపు
- 40వ రోజుకు చేరిన ఆమరణ దీక్ష



**చండీగఢ్ :** దేశం అంతటా రైతులకు కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) చట్టబద్ధతను అమలు చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వృద్ధ రైతు నాయకుడు జగజిత్ సింగ్ డల్లేవాల్ పిలుపు ఇచ్చారు. ''మద్దతు ధరల చట్టబద్ధతకోసం ఇది ఒక్క పంజాబీ రైతులు మాత్రమే చేస్తున్న పోరాటం కాదు, దేశమంతటా ఉన్న రైతు సంఘాలన్నీ తమ తమ రాష్ట్రాలలో పోరాటాలు చేయడం ద్వారా ఎంఎస్‌పి చట్టబద్ధత అమలు చేయాలని ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దేశవ్యాప్తంగా రైతు సంఘాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి ఈ మేరకు సందేశాలు పంపించాలని డల్లేవాల్ పిలుపు ఇచ్చారు. 70 ఏళ్ళ వయసుగల వృద్ధ రైతు నాయకుడు డల్లేవాల్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష శనివారంనాటికి 40వ రోజుకు చేరుకుంది. ఇప్పటివరకూ ఆయన ఎలాంటి వైద్య చికిత్సలూ తీసుకోవడానికి ఇష్టపడలేదు. వైద్య చికిత్సను ఆయన తిరస్కరిస్తున్నారు. సుదీర్ఘ ఆమరణ నిరాహార దీక్ష కారణంగా ఆయన ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించింది. రెండు రైతు వేదికల పిలుపుతో ప్రస్తుత పోరాటం కొనసాగుతున్నది. ఆమరణదీక్ష సందర్భంగా ఖనౌరీలోని ''కిసాన్ మహాపంచాయత్'' లో వేదికపై 11 నిమిషాలసేపు డల్లేవాల్ ప్రసంగించారు. రైతులకంటే తన ప్రాణాలు ఎంతమాత్రం ముఖ్యం కాదని ఆయన అన్నారు. ఆయనను స్ట్రెచర్‌మీద పడుకోపెట్టి వేదికపైకి తీసుకువచ్చారు. వేదికమీద ఏర్పాటు చేసిన పరుపుమీద పడుకునే ఆయన రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలో ఏడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, వాళ్ళ కుటుంబాలు ఎన్ని బాధలు పడుతున్నాయో కూడా తనకు తెలుసునని మహాపంచాయత్‌లో డల్లేవాల్ చెప్పారు. మనం నిర్దేశించుకున్న, ప్రారంభించిన ఈ లక్ష్యం ఎంత కీలకమైనదో, ఎంత తీవ్రమైనదో నాకు తెలుసునని, ఐతే ఏ ఒక్కరో ఇక్కడ కూర్చుని ఏమీ చేయలేరన్న విషయం కూడా తనకు తెలుసుననీ, ఆ విషయం తాను అర్థం చేసుకున్నాననీ డల్లేవాల్ అన్నారు. ''నాకు తెలుసు, నేను అర్థం చేసుకున్నాను, అధ్యయనం చేశాను, ఇది కష్టమైన పనే, అలా అని లక్ష్యసాధనలో ఉన్న కష్టాన్ని, తీవ్రతను చూస్తూ కూర్చుంటే మనం ఏమీ చేయలేం, అలాంటప్పుడు కార్యసాధన ఎలా? ఎంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారో చూడండి, మనకు ఎంతో నష్టం జరిగింది'' అని డల్లేవాల్ అన్నారు. రాజకీయేతర వేదిక అయిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)కు డల్లేవాల్ సమన్వయ కర్తగా వ్యవహరిస్తున్నారు. దీక్ష ప్రారంభించాక, కొద్ది రోజులుగా డల్లేవాల్ చిన్న చిన్న వీడియో సందేశాల ద్వారా రైతులను ఉద్దేశించి ప్రసంగాలు చేశారు. నిరాహార దీక్ష ప్రారంభించిన చాలా రోజుల తర్వాత మొదటిసారి ఆయన శనివారంనాడు కిసాన్ మహాపంచాయత్‌కు హాజరై వేదికపైనుండి ప్రత్యక్షంగా రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. 2024 నవంబరు 26వ తేదీన డల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన నాయకత్వం వహించిన రైతు సంఘం బికెయు (ఏక్తా సిధుపూర్) మొదట్లో

తరువాయి 2లో



## ప్రజా ఉద్యమాలకు 'పాటే' ప్రాణం

వందేళ్ళ ఎర్ర జెండా పాట ఆవిష్కరించిన సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి

ప్రజా ఉద్యమాల నిత్యం గొంతుక సిపిఐ 100 సంవత్సరాల సంబురాల సందర్భంగా గాయని శ్యామల స్వీయ రచన గానంతో రూపొందించిన వందేళ్ళ ఎర్రజెండా పాట ఆడియో వీడియోలను సిపిఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సిపిఐ జాతీయ సమితి సభ్యులు, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం సిఆర్ ఫౌండేషన్ కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, మహబూబ్ నగర్‌కు చెందిన సింగర్ శ్యామల స్వీయ రచనతో గానంతో ఆమె పాటకు సామాజిక రాజకీయ అంశాలను జోడిస్తూ మార్క్సిజం నూరిపోస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తుందని శ్యామల పాటలు ఊట సెలిమె లాంటివని అన్నారు. పాట ప్రజా ఉద్యమాలకు ఊపిరి నిస్తుందని బ్రిటిష్ ముష్కర పాలన నుండి నేటి తెలంగాణ ఉద్యమం వరకు పాటే ఉద్యమాలకు ప్రాణం పోసిందని అన్నారు. పాట ఎల్లప్పుడూ జనం పక్షాన ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ కొత్త వరవడిలో పరుగులు

తరువాయి 2లో

'ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్' కంపెనీలో

## భారీ విస్ఫోటం

కార్మికుడు మృతి, మరో ముగ్గురికి గాయాలు

క్షతగాత్రులను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఐలయ్య



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట




యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో శనివారం ఉదయం భారీ విస్ఫోటం సంభవింవింది. ఈ ప్రమాదంలో కంపెనీలో పనిచేస్తున్న జనగామ జిల్లా, బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన మార్క కనకయ్య(54) అనే కార్మికుడు మృతి చెందడం కలకలం రేపింది. యాదగిరిగుట్ట మండలం రామాజిపేటకు చెందిన మొగిలిపాక ప్రకాశ్‌కు తీవ్ర గాయాలు కాగా హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. నరసింహ, అశోక్ అనే ఇద్దరు కార్మికులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. పేలుడు ధాటికి 35 మంది కార్మికులు భయాందోళనకు గురికాగా భువనగిరిలోని కస్తూరి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఉదయం 9.45 గంటల ప్రాంతంలో పిఆర్‌డిసి బిల్డింగ్3లో పెల్లెట్ ఫార్ములా

తరువాయి 2లో

'హెచ్ ఎంపివి' పట్ల

## అప్రమత్తం

రాష్ట్రంలో కేసులేమీ లేవు

ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్

ప్రజాపక్షం/హైదరాబాద్

చైనాలో విజృంభిస్తున్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్ ఎం పి వి) పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. చైనాలో విజృంభిస్తోన్న హెచ్‌ఎంపివి వైరస్ తరహా కేసులు ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో నమోదుకాలేదని ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ వెల్లడించారు. ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు 'ఫ్లూ' లక్షణాలకు

తరువాయి 12లో

## ఎప్పటికప్పుడు ఉద్యోగ ఖాళీల భర్తీ

'ఫైర్' డ్రైవర్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్



ఖాళీగా ఉన్న ప్రభుత్వోద్యోగాలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి డి.శ్రీధర్ బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా వట్టి నాగులపల్లిలోని 'టిజి ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్'లో శనివారం జరిగిన 196 మంది డ్రైవర్ ఆపరేటర్ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'గత పదేళ్లుగా నిలిచిపోయిన ఉద్యోగాల భర్తీని సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం తిరిగి పట్టాలెక్కించింది. భర్తీ ప్రక్రియలో ఏర్పడిన న్యాయపరమైన ఇబ్బందులను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ నియామక పత్రాలను అందజేస్తున్నాం. ఈ విషయంలో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంది. హోంశాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడంపై సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు' అని పేర్కొన్నారు. 'అగ్నిమాపక శాఖా సిబ్బంది సేవలు అభినందనీయం. ముఖ్యంగా ఖమ్మంలో వరదలు తలెత్తినప్పుడు వీరు కీలకంగా వ్యవహరించారు. ఎక్కడ విపత్తు తలెత్తినా మేమున్నామంటూ రంగంలోకి దిగి ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారు. అన్నగా.. పెద్దన్నగా నిలుస్తున్నారు' అని ప్రశంసించారు. 'ఏడాది వ్యవధిలోనే అగ్నిమాపక శాఖకు సంబంధించిన విభాగాల్లో 878 మందిని రిక్రూట్ చేశాం. రాబోయే రోజుల్లో ఈ శాఖను మరింత బలోపేతం చేస్తాం. అగ్నిమాపక శాఖ సిబ్బందిపై గురుతర బాధ్యత ఉంది. విపత్తులు తలెత్తినప్పుడు ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ముందుండాలి' అని సూచించారు. '4 నెలల కఠోర శిక్షణను

తరువాయి 12లో

నిషేధిత ప్రాంతంలో

## దర్జాగా చేపల పెంపకం

- 'ఎల్లంపల్లి' ప్రాజెక్టు జలాశయం వద్ద కోట్లాది రూపాయల వ్యాపారం
- కలెక్టర్ సీరియస్... క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశం



ప్రజాపక్షం/అంతర్గాం



పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాశయం వద్ద అక్రమంగా చేపల పెంపకం వ్యాపారం జోరుగా సాగుతోంది. దశాబ్దకాలంగా దర్జాగా నిషేధిత ప్రాంతమైన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాశయం వద్ద ఫ్లడ్ రిజర్వాయర్ లెవల్(ఎఫ్‌ఆర్ఎల్) స్థలంలో అక్రమంగా చేపల చెరువులు ఏర్పాటు చేసి కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్న విషయం ఇటీవల వెలుగులోకి రావడంతో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. అక్రమ చేపల చెరువులు ఏర్పాటు చేసిన వారితో పాటు వారికి సహకరించిన సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిపై

తరువాయి 12లో

# మయన్మార్‌లో ఆంగ్ సాన్ సూకీ మినహా 5,864 మంది ఖైదీలకు క్షమాభిక్ష

180 మంది విదేశీ ఖైదీలకూ విముక్తి

ఈ ఏడాదిలోనే ఎన్నికలు?



**నైఫిడో :** మయన్మార్ (ఒకనాటి బర్మా) 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా 5,864 మంది ఖైదీలకు సైనిక పాలక ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించింది. ఐతే ప్రపంచ ప్రముఖ రాజకీయ ఖైదీ, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, మయన్మార్ ప్రతిపక్ష నేత ఆంగన్ సాన్ సూకీ మినహా మెజారిటీ ఖైదీలకు మాత్రం జైలు నుండి విముక్తి లభించింది. వీరిలో థాయ్‌లాండ్, ఇండోనేసియాలకు చెందిన 180 మంది విదేశీ ఖైదీలు కూడా ఉన్నారు. విడుదలైనవారిలో దక్షిణ కచిన్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఖెత్ ఆంగ్ సహా కొద్దిమంది రాజకీయ ఖైదీలు కూడా ఉన్నారు. మయన్మార్ సైనిక ప్రభుత్వ ప్రధానాధిపతి సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హ్లెయింగ్ సారథ్యానగల సైనిక ప్రభుత్వం ఈ క్షమాభిక్ష ప్రకటించిందని ప్రభుత్వ అధీనంలోని ఎంఆర్‌టివీ శనివారంనాడు ప్రకటించింది. 1948 జనవరి 4వ తేదీ తెల్లవారుజామున బ్రిటన్ నుండి ఆనాటి బర్మాకు స్వాతంత్ర్యం సిద్ధించింది. అందువల్ల నాలుగోతేదీ నుండే ఖైదీలను విడుదల చేసే ప్రక్రియ ప్రారంభించారు.అదేవిధంగా జీవితకాల శిక్ష అనుభవిస్తున్న అనేకమంది ఖైదీల శిక్షను కూడా తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. మిలిటరీ ప్రభుత్వం తరపున అధికార ప్రతినిధి మేజర్ జనరల్ జా మిన్ తున్ పాత్రికేయులకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రజల్లో అశాంతి సృష్టించి, తప్పుడు వార్తలు ప్రచారం చేసిన 600 మందికి సెక్షన్ 505 ఎ కింద శిక్షలు విధించామనీ, 144 మందికి 15 ఏళ్ళ శిక్ష విధించామని కూడా ప్రకటించారు.అదేవిధంగా ఈ ఏడాదిలోనే పార్లమెంటుకు ఎన్నికలు జరుగుతాయని కూడా జుంటా పాలక ప్రభుత్వం ప్రకటించింది. చాలాకాలంగా జుంటా ఎన్నికల జపం చేస్తున్నది. దేశంలో ప్రజాతిరుగుబాటు శృతిమించడంతో తాజాగా ఈ ప్రకటనను తెరమీదకు తీసుకువచ్చారు. అదేవిధంగా జైళ్ళు కిక్కిరిసిపోవడం, పరిస్థితులు విషమించడం వంటి అనేక కారణాలు ఈ ఖైదీల విడుదలకు దోహదం చేశాయి. కాగా సైన్యం కరోనా సమయంలో అధికారాన్ని స్వాధీనం చేసుకున్నప్పుడు లక్షలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా వందలమందిని సైనికులు కాల్చి చంపగా, వేలాదిమందిని అరెస్టు చేశారు. ఎఎపిపి (అసోసియేషన్ ఫర్ పొలిటికల్ ప్రిజనర్స్) నివేదిక ప్రకారం ఈరోజుకీ ఇంకా 28,096 మంది రాజకీయ ఆరోపణలపై మయన్మార్ జైళ్ళల్లో ఖైదీలుగా మగ్గుతున్నారు.ఆగ్నేయ ఆసియాలో వాయువ్యప్రాంత దేశం మయన్మార్‌లో 2021లో రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చివేసి సైనికపాలకులు మరోసారి దేశాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆనాటి నుండీ జుంటా పాలక సైన్యంపై ప్రజాస్వామ్య తిరుగుబాటు దళాలు దేశవ్యాప్తంగా ఉద్ధృతమైన గెరిల్లా పోరాటాలు చేస్తున్నాయి. క్రమంగా దేశంలో అంతర్గత కల్లోలం తీవ్రరూపం దాల్చింది. ఆ దేశంలో సమస్యలు పరిష్కరించేందుకు చైనా ప్రభుత్వం చొరవ చూపించింది. ఇటీవల జుంటా సైనికపాలకుడు చైనాలో పర్యటించి వచ్చారు కూడా. శనివారంనాడు మయన్మార్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 5,864 ఖైదీలకు క్షమాభిక్ష పెడుతున్నట్లు ప్రకటన చేశారు. ఇలా క్షమాభిక్షకు అర్హులైనవారిలో అక్కడి జైళ్ళల్లో మగ్గుతున్న 180 మంది విదేశీ ఖైదీలు కూడా ఉన్నారు. నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీపార్టీ నాయకురాలు సూకీని మాత్రం విడుదల చేయలేదు. 1990లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 485 పార్లమెంటు స్థానాలకుగాను 382 స్థానాలు గెలుచుకున్నప్పటికీ ఆమె సైనిక నియంతల కర్కశత్వానికి బలయ్యారు. ఎన్నికలు సజావుగా జరగలేదని, తమ పార్టీకి తగిన అవకాశాలు ఇవ్వలేదన్న వంకలతో సైనిక నాయకులు తిరగబడి దేశాధికారం స్వాధీనం చేసుకుని ఆమెను జైల్లోనే నిర్బంధించారు. రాజకీయ దురుద్దేశంతో, ఆమె దేశాన్ని పాలించకూడదనే ఉద్దేశాలతో తప్పుడు కేసులు బనాయించి ఆమెను జీవితకాల ఖైదీగా మార్చారు. 79 ఏళ్ళ వయసుగల సూకీపై 14 క్రిమినల్ కేసులు వివిధ సెక్షన్లకింద బనాయించి 27 సంవత్సరాలు జైలుశిక్ష విధించారు.

# తలలు పట్టుక్కూర్చున్న కొరియా అధికారులు

యోల్ ఇంటిముందు ఘర్షణ వాతావరణం



**సియోల్ :** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అరెస్టు చేసేందుకు దర్యాప్తు అధికారులు విఫలయత్నం చేశారు. తాజాగా శనివారంనాడు మరోసారి ప్రయత్నం చేశారు. తదుపరి ఏం చర్యలు తీసుకోవాలా? అని తలలు పట్టుకుని కూర్చున్నారు. అరెస్టయ్యేందుకు యోల్ నిరాకరిస్తున్నారు. ఆయన సహకరించడంలేదు. మరోవైపు యోల్‌ను అరెస్టు చేయనీయకుండా వేలాదిమంది ఆయన మద్దతుదారులు ఆయన నివాసం వద్ద కాపలా ఉన్నారు. దేశవ్యాప్తంగా యోల్ అనుకూల వ్యతిరేక ప్రదర్శనలు ఆగకుండా కొనసాగుతూనే ఉన్నాయి. రెండు రోజులుగా యోల్‌ను అరెస్టు చేసేందుకు దర్యాప్తు అధికారులు ప్రయత్నాలు చేస్తుంటే వేలాదిమంది ప్రజలు వారిని అడ్డుకుంటున్నారు. ఇదిలా ఉండగా యోల్ నివాసం వద్ద ఆయన అనుకూల, వ్యతిరేక శక్తుల మధ్య ఘర్షణలు కూడా జరిగాయి. ఎలాగైనా యోల్‌ను అరెస్టు చేసి విచారణ బల్ల దగ్గరకు తీసుకురావాలని, ఆయనను సుదీర్ఘ సమయం కూర్చోబెట్టి ప్రశ్నలవర్షం కురిపించాలని దర్యాప్తు అధికారులు చాలా పట్టుదలగా ఉన్నారు. కానీ ఆ ప్రయత్నాలు నెరవేరకపోవడంతో దేశంలో తీవ్ర అశాంతి నెలకున్నది. గడచిన నెలరోజులుగా దక్షిణ కొరియాదేశం ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించింది. అంతర్జాతీయ వార్తల్లో రోజూ పతాకశీర్షికలలో కనిపిస్తున్నది. ఒక్క డిసెంబరునెలలోనే అనేక ఘటనలు దక్షిణ కొరియాను కుదిపివేశాయి. ముగ్గురు అధ్యక్షపదవి పీఠంపై మారారు. ఇంకోవైపు ఘోర విమాన ప్రమాదంలో 179 మంది మరణించిన ఘటన కూడా ఆ దేశాన్ని కలచివేసింది. ప్రస్తుతం దేశ తాత్కాలిక అధ్యక్షుడుగా ఉన్న మోక్ కూడా యోల్ అరెస్టు ప్రతిష్టంభన గురించి ఇంతవరకూ పెదవి విప్పలేదు. యోల్ పీపుల్స్ పవర్ పార్టీకి చెందినవారే మోక్ కూడా. ఈనెల ఆరో తేదీ లోపు యోల్‌ను అరెస్టు చేయాల్సి ఉంది. ఈ గడువుతేదీని మరింత పొడిస్తారని అంచనావేస్తున్నారు.




# ప్రపంచ వృద్ధురాలు మృతి



**అషియా :** ప్రపంచంలో అందరి కంటే వృద్ధురాలుగా రికార్డు సాధించిన జపాన్ మహిళ తన 116వ ఏట కన్నుమూశారు. ప్రపంచంలో అందరికంటే ఎక్కువకాలం సజీవంగా ఉన్న వృద్ధురాలుగా ఇటూకా 2023లో గిన్నిస్ వరల్డ్ రికార్డు అవార్డును అందుకున్నారు. 1908 మే 8వ తేదీన ఒసాకాలో జన్మించిన స్పెయిన్‌కు చెందిన అమెరికా మహిళ మారియా బ్రాన్‌యాన్స్ గత ఏడాది తన 117వ ఏట మరణించిన తర్వాత సెంట్రల్ జపాన్ అషియాకు చెందిన మహిళ ఇటూకా ప్రపంచ వృద్ధమహిళగా గౌరవం అందుకున్నారు. గిన్నిస్ రికార్డు పురస్కారం అందుకున్నారు. డిసెంబరు 29వ తేదీన ఇటూకా (116) మరణించారని జపాన్ వృద్ధుల విధాన నిర్ణాయక కార్యాలయం ఇన్‌ఛార్జి యోషిట్సుగు నగటా శనివారంనాడు ప్రకటించారు. ప్రపంచ సూపర్ సెంటినరియన్ ర్యాంకింగ్ లిస్టులో మీరు ఉన్నారని చెప్పినప్పుడు చాలా సింపుల్‌గా ఆమె థ్యాంక్యూ అని మాత్రమే అన్నారు. జపాన్‌కు చెందిన ఇటూకా తన జీవితకాలంలో అనేక అద్భుతాలు సృష్టించారు. 10,062 అడుగులు ఎత్తైన మౌంట్ ఆన్‌టేక్‌ను ఇటూకా రెండుసార్లు అధిరోహించి రికార్డు సృష్టించారు. రెండో ప్రపంచయుద్ధకాలంలో తన భర్త టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీని ఆమే నిర్వహించేవారు. 20వ ఏటనే వివాహం చేసుకున్న ఇటూకా నలుగురు బిడ్డల తల్లి. ఇప్పుడు ఇటూకా మరణించడంతో బ్రెజిల్‌కు చెందిన సన్యాసిని ఇనాహ్ కనబర్రో లుకాస్ ప్రపంచంలో సజీవంగా ఉన్న అతివృద్ధురాలుగా తెరమీదకు వచ్చారు. ప్రస్తుతం మరణించిన ఇటూకా కంటే వయసులో లుకాస్ 16 రోజులు చిన్నవారు.



# హిల్లరీ సహా 14 మందికి ప్రెసిడెన్సియల్ మెడల్స్



**వాషింగ్టన్ :** హిల్లరీ క్లింటన్ సహా 14 మందికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ శనివారం నాడు ప్రతిష్టాత్మకమైన అధ్యక్ష పతకాలను అందజేశారు. అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసిన తొలి మహిళ,అమెరికా ఎగువసభ సెనేట్‌కు ఎన్నికైన తొలి మహిళ, స్టేట్ మాజీ సెక్రటరీగా హిల్లరీ క్లింటన్ ఖ్యాతిగాంచారు. ప్రజలకు సేవ చేయడంలో హిల్లరీ క్లింటన్ రికార్డు సృష్టించారు. 120కి పైగా దేశబూలలో ఆమె ఫౌండేసన్ ద్వారా సేవలు చేశారు. ప్రజాస్వామ్యం, మానవహక్కులు, సామాజిక న్యాయాభివృద్ధికోసం ఆమె పాటుపడ్డారు. ఆమెతోపాలు మాజీ రక్షణమంత్రి, మరణించిన ఆస్టన్ కార్టర్, ఫ్యాషన్ డిజైనర్ రాల్ఫ్ లారెన్, ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ లియోనెల్ మెస్సీ, వివాదాస్పద ఇన్వెస్టర్ జార్జ్ సోరస్ తదితరులు కూడా ఈ అధ్యక్ష పతకాలు అందుకున్నవారిలో ఉన్నారు. అమెరికా పురోగతికి, విలువలు, దేశ భద్రతకోసం పాటుపడినవారికి ఈ అధ్యక్ష పతకాలు ఇస్తారు.

# శిక్షపడిన దేశ నేతగా వైట్‌హౌస్‌లోకి ట్రంప్?

శృంగార తార కేసులో 10న తీర్పు



**వాషింగ్టన్ :** డోనాల్డ్ ట్రంప్ ఎన్ని తప్పులు చేసినప్పటికీ ఆయనకు శిక్షలు పడే అవకాశం లేదని ఇప్పటివరకూ అందరూ భావించారు. కానీ అందతా అబద్ధమని న్యూయార్క్ కోర్టు తేల్చి చెప్పేసింది. ట్రంప్ జీవితం తెరచిన పుస్తకం. ఆయన ఎన్ని తప్పులు చేసినప్పటికీ ప్రజలు క్షమించి ఆయనే కావాలని కోరుకుని అఖండ మెజారిటీని కట్టబెట్టారు. అమెరికా సుప్రీంకోర్టు కూడా ట్రంప్ పదవీకాలం పూర్తయ్యేవరకూ ఆయనకు శిక్షలు పడే అవకాశం లేదని చెప్పింది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఎన్నికలఖర్చులకోసం సేకరించిన విరాళాల్లోంచి డబ్బుతీసి శృంగార తార స్టార్మీ డేనియల్ ఇచ్చి ఆమె నోరు మూయించారన్న కేసులో ట్రంప్‌కు ప్రమాణ స్వీకారంలోపే శిక్ష పడనున్నది. ఈనెల 10వ తేదీన అంటే మళ్ళీ రాబోయే శుక్రవారంనాడే ఆయనకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెబుతారు. కానీ ఆయన శిక్ష మాత్రం అనుభవించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే భారీ మెజారిటీతో దేశాధ్యక్షుడుగా గెలిచారు గనుక ఘనంగా మేళతాళాలతో ఆయన జనవరి 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేసి వైట్‌హౌస్‌లోకి యథేచ్ఛగా అడుగుపెట్టి దేశాన్ని పాలించవచ్చునని కూడా న్యాయమూర్తి ఆయనకు ముందుగానే అనుమతి కూడా ఇచ్చేశారు. కానీ శిక్షమాత్రం విధిస్తారంతే. ఒకవేళ ఆయన పదవి పోగొట్టుకున్నా, పదవీకాలం తర్వాతగానీ ఆ శిక్ష అనుభవించాల్సి రావచ్చు! అందుకే ఇప్పుడు అందరూ జనవరి పదోతేదీన ఏం జరుగుతుందా? అని ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు.

## అమెరికాలోని అల్లుడిపై కేసు ఎలా విచారించాలి?

పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

**హైదరాబాద్:** తన కుమార్తెను వేధిస్తున్న తన అల్లుడైన డాక్టర్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులకు ఆదేశాలివ్వాలని కోరుతూ హైదరాబాద్, ఎస్సార్ నగర్‌కు చెందిన 84 ఏళ్ల వృద్ధుడు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారణ చేపట్టేందుకు హైకోర్టు నిరాకరించింది. విదేశంలో ఉన్న భార్యభర్తల మధ్య వివాదంపై పిటిషన్‌ను ఏవిధంగా దాఖలు చేస్తారనే సందేహాన్ని న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి లేవనెత్తారు. అల్లుడు, కుమార్తె అమెరికాలో నివాసం ఉంటున్నప్పుడు అక్కడ తన కుమార్తెను అల్లుడు వేధిస్తున్నాడని చెప్పి ఇక్కడ పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదుకు ఆస్కారం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. దీనిపై వివరణ ఇవ్వాలని పిటిషనర్‌ను ఆదేశించించారు. విచారణను 8కి వాయిదా వేశారు.

## పాటే ప్రాణం (మొదటి పేజీ తరువాయి)

పెట్టించాలని అన్నారు. శ్యామల పార్టీ వందేళ్ళ ఆవిర్భావం వేడుకల జయప్రదం కోసం అనేకవేయ ప్రయాసల కోర్చి పాటను రూపొందించడం అభినందనీయమని అన్నారు. శ్యామలకు పాట రాయడం ఆమెనే పాడడం గొప్ప అంశమని అన్నారు.ఆమె చేతి ఆమె గొంతు ద్వారా మరిన్ని విప్లవ గేయాలు సాంృతిక కార్యక్రమాలు వెలువడాలని అభిలాషించారు. పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. పల్ల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ: శ్యామల పార్టీ పట్ల నిబద్ధత కలిగి ఎల్లప్పుడు తనదైన శైలిలో పార్టీ గేయాలు అమరవీరుల స్మృతి గీతాలు, సామాజిక చైతన్య పాటలు అందిస్తుందని అన్నారు. శ్యామల ఎంఫిల్ లో గోల్డ్ మెడలిస్టుగా రాణించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జాతీయ నేత సురవరం విజయలక్ష్మి, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె విజయరాములు ,మహబూబ్నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్,కందాల రామకృష్ణ ,తెలంగాణ ఉద్యమకారుడు ఆర్ ఎన్.శంకర్ శేర్లింగంపల్లి సిపిఐ నేతలు రామకృష్ణ చందు యాదవ్ సుధాకర్ శివ నారాయణ కొండల్ గో కళాకారులు గోపి సుధాకర్ సురేష్ పద్మావతి రామచందర్ నాగేశ్వరి స్రవంతి లయ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుమూత (మొదటి పేజీ తరువాయి)

కీలకంగా పనిచేశారు. అలాగే బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) డైరెక్టర్‌గానూ పనిచేశారు. అణుశక్తి కమిషన్‌కు ఛైర్మన్‌గానూ రాజగోపాల చిదంబరం సేవలు అందించారు. అణుశక్తి విభాగం కార్యదర్శిగా, భారత ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా పనిచేశారు. అణ్వాయుధాల రూపకల్పనలో రాజగోపాల చిదంబరం ముఖ్యపాత్ర పోషించారు. ఈ క్రమంలో దేశానికి ఆయన చేసిన సేవలకుగానూ కేంద్ర ప్రభుత్వం 1975లో పద్మశ్రీ, 1999లో పద్మవిభూషణ్ పురస్కారాలను ప్రదానం చేసింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు నుంచి విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డు (1991)ను అందుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ వందో జయంతి సందర్భంగా ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఇచ్చిన ఇంటర్నేషనల్ విజిటింగ్ ఫెలోషిప్ (1992) అవార్డును తీసుకున్నారు. భౌతిక శాస్త్రవేత్త సివి రామన్ వందో జయంతి సందర్భంగా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ఇచ్చిన రామన్ బర్త్ సెంటెనరీ అవార్డు (1995)ను అందుకున్నారు. లోకమాన్య తిలక్ అవార్డు (1998), వీర్ సావర్కర్ అవార్డు (1999), దాదాభాయ్ నౌరోజీ మిలీనియం అవార్డు (1999)ను సాధించారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ మేఘనాథ్ సాహా మెడల్ (2002)ను రాజగోపాల చిదంబరంకు ఇచ్చింది. అలాగే శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి నేషనల్ ఎమినెన్స్ అవార్డు (2003)లో చిదంబరంకు దక్కింది. హోమీ బాబా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు (2006), ఇంజినీరింగ్ లైఫ్ టైమ్ కంట్రిబ్యూషన్ అవార్డు (2009), సివి రామన్ మెడల్ (2013), కౌన్సిల్ ఆఫ్ పవర్ యుటిలిటీస్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు (2014) దక్కింది.

## ఆత్మీయ భరోసా (మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడున్న ప్రాజెక్టులకు మరింత నీటిని తీసుకునే సాధ్యాసాధ్యాలపై కమిటీ అధ్యయనం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ తాగునీటికి తరలించే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్2, ఫేజ్3 కి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో 15 టిఎంసీలకు ప్రతిపాదించిన ఈ పథకాన్ని భవిష్యత్ అవసరాల దృష్ట్యా 20 టిఎంసిలకు పెంచేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దాదాపు 4 గంటల పాటు జరిగిన మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను అనంతరం మంత్రివర్గ సహచరులతో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. వ్యవసాయ యోగ్యం కాని భూములు మైనింగ్, కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రహదారులు, నివాస, పారిశ్రామిక, వాణిజ్యఅవసరాలకు ఉపయోగించే భూములు, నాలా కన్వర్టెడ్ భూములు, వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం సేకరించిన భూములకు రైతు భరోసా వర్తించబోదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో రాళ్ల రప్పలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు నాలాలకు కూడా రైతు భరోసాను ఇచ్చారని, నిజమైన రైతులకు మేలు చేయాలనేది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ఉద్దేశ్యమని సిఎం స్పష్టం చేశారు. గ్రామ సభల ద్వారా వివరాలను సేకరించి భూములకు రైతు బరోసాను అమలు చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి కొత్త సంవత్సరంలో మంచి జరగాలని, వ్యవసాయాన్ని పండగ చేయాలని రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ ఎకరానికి రైతుభరోసా అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న రూ.10 వేల 'రైతు భరోసా'ను రూ.12 వేలకు పెంచుతున్నట్లు సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల వెసులుబాటును దృష్టిలో ఉంచుకుని రూ.12 వేల వరకు పెంచినట్లు సిఎం తెలిపారు. భూమి లేకపోవడం వ్యవసాయ కూలాలకు శాపంగా మారిందని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు వారికి ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయం తీసుకున్నామని, ఈ పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకంగా పేరు పెట్టినట్లు తెలిపారు. రేషన్ కార్డుల సమస్య పేదలను పట్టి పీడిస్తోందని, ఈ సమస్యను పరిష్కరించడానికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు సిఎం తెలిపారు. రాజ్యాంగం అమలు జరిగి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 26వ తేదీ నుంచి ఈ పథకాలు అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వ ఆదాయం పెంచడం, ప్రజలకు పంచడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విధానమని సిఎం పునరుద్ఘాటించారు. రైతు భరోసాపై ప్రతిపక్షాల నుంచి పత్రికల వరకు అందరూ ప్రభుత్వ నిర్ణయాలుగా పలు రకాలుగా ప్రకటించి గందరగోళాన్ని సృష్టించారని ఆయన పేర్కొన్నారు.

## అధ్యయనం (మొదటి పేజీ తరువాయి)

సిఎం సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డుతో పాటు కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖకు లేఖలు రాయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదేశించారు.

## ఫిర్యాదుల స్వీకరణ (మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశించిన స్థలాలు పరిరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేసే క్రమంలో ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులతో పాటు సలహాలను కూడా స్వీకరించడానికి ఈ కార్యక్రమాన్ని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు, తిరిగి 3.00 గంటల నుంచి 5.30 గంటల వరకూ రాణిగంజ్‌లోని బుద్ధభవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఫిర్యాదుకు సంబంధించిన అన్ని ఆధార పత్రాలతో పాటు పూర్తి వివరాలు తీసుకుని కార్యాయానికి రావాలని హైడ్రా కమిషనర్ సూచించారు. ఏమైనా సందేహాలుంటే 040 29565758, 29560596 ఫోన్ నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

**మాధాపూర్‌లో అక్రమ నిర్మాణాన్ని.. పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని అయ్యప్ప సొసైటీలో 684 గజాలలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని శనివారం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ పరిశీలించారు. జిహెచ్‌ఎంసి నోటీసులు, హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా సెల్లార్, గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు 5 అంతస్తుల భవనాన్ని నిర్మించడంపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు హైడ్రా, రెవెన్యూ, జిహెచ్‌ఎంసి అధికారులతో కలసి అయ్యప్ప సొసైటీలోని వంద ఫీట్ల రోడ్డుకు ఆనుకుని ఉన్న కట్టడాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడికక్కడే జిహెచ్‌ఎంసి చందానగర్ సర్కిల్ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులతో పాటు హైకోర్టు ఉత్తర్వులను కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అక్రమ కట్టడమని హైకోర్టు నిర్ధారించాక కూడా కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకపోవడం, జిహెచ్‌ఎంసి అధికారులు కూల్చివేతకు సంబంధించి షోకాజ్ నోటీసు ఇచ్చినా పట్టించుకోకుండా భవనాన్ని నిర్మించడాన్ని హైడ్రా కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. ఈ అక్రమ భవన నిర్మాణాన్ని కూల్చివేస్తున్నట్టు గత సంవత్సరం ఫిబ్రవరి 14 షోకాజ్ నోటీసులు జిహెచ్ఎంసి జారీ చేసింది. అదేనెల 26న స్పీకింగ్ ఆర్డర్ కూడా ఇచ్చింది. ఆ తర్వాత హైకోర్టు కూడా అక్రమ నిర్మాణమని నిర్ధారించడమే కాకుండా చర్యలు తీసుకోవాలని గత సంవత్సరం ఏప్రిల్ 19న ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం గత సంవత్సరం జూన్ 13వ తేదీన ఇదే భవనం అక్రమమని జిహెచ్‌ఎంసి కొంత భాగాన్ని కూల్చివేసింది. ఇవేవీపట్టించుకోకుండా నిర్మాణాన్ని కొనసాగించారని స్థానిక అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

## భారీ విస్ఫోటం (మొదటి పేజీ తరువాయి)

తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలుడు సంభవించిందని కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. పేలుడు సమయంలో బిల్డింగ్‌లో మొత్తం నలుగురు కార్మికులు విధుల్లో ఉన్నారు. కాగా అప్పటికే భోజన విరామం కావడంతో ఆ బిల్డింగ్‌లో ఉన్న 12 మంది కార్మికులు బయటకు వెళ్లగా భారీ ప్రమాదం తప్పింది. ప్రాణం నష్టం తప్పింది. పూర్తి విచారణ అనంతరం ప్రమాదానికి గల కారణాలు వెల్లడిస్తామని పరిశ్రమ డైరెక్టర్ వెల్లడించారు.

**ఉలిక్కిపడ్డ పెద్ద కందుకూరు...**

ప్రీమియర్ ఎక్స్ ప్లోజీసివ్ కంపెనీ నుంచి భారీ శబ్దాలు రావడంతో సుమారు పది కిలోమీటర్ల విస్తీర్ణంలోని గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కంపెనీలో జరిగిన విస్ఫోటనం శబ్దానికి పెద్ద కందుకూరు గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడి రోడ్ల పైకి వచ్చారు. కంపెనీ నుంచి శబ్దం వచ్చిన విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు వారి కుటుంబ సభ్యులు బంధువుల యోగక్షేమాలు తెలుసుకోవడానికి కంపెనీకి పరుగులు పెట్టారు. భద్రత దృష్ట్యా పెద్ద కందుకూరు గ్రామస్తులను కంపెనీ లోపలికి పోలీసులు అనుమతించలేదు.

**కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

కంపెనీలో జరిగిన విస్ఫోటనం వల్ల కార్మికుడి మృతికి కారణమైన ప్రిమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ తో కలిసి జరిగిన ప్రమాదాన్ని పరిశీలించారు. ప్రమాద సంఘటనకు సంబంధించిన విషయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం సంభవించిన సమయంలో అందులో పనిచేస్తున్న 16మంది కార్మికులు బిల్డింగ్ లోపల ఉంటే భారీ ప్రాణనష్టం జరిగి ఉండేదని, కానీ 12 మంది భోజనం చేయడం కోసం బయటకు వెళ్లడంతో భారీ ప్రాణ నష్టం తప్పిందని కార్మికులు ఎమ్మెల్యేకు వివరించారు. కంపెనీలో భద్రత చర్యలు తీసుకుంటే ప్రమాదం ఎలా సంభవించిందని కంపెనీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ ను ప్రభుత్వ విప్ ఐలయ్య నిలదీశారు. కార్మికుల భద్రత విషయంలో కంపెనీ యజమాన్యం ప్రభుత్వ నిబంధనలను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తునకనిపిస్తున్నందున కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఏసీపీని ప్రభుత్వ విప్ ఐలయ్య ఆదేశించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు కనకయ్య మృతదేహాన్ని భువనగిరి జిల్లా ఆసుపత్రిలో సందర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం సానుభూతి తెలిపారు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షుడు కానుగు బాలరాజు, గ్రామ మాజీ సర్పంచ్ భీమగాని రాములు, నాయకులు ముక్కర్ల మల్లేష్ తదితరులు ఉన్నారు.

**ఇలాంటి ఘటనలు బాధకరం : మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి**

ప్రీమియర్ కంపెనీలో జరిగిన ఘటన బాధకరమని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మండలంలోని పెద్దకందుకూరు ప్రిమియర్ కంపనీని సందర్శించి మాట్లాడారు. మృతి చెందిన కార్మికుడు కనకయ్య, క్షతగాత్రులు కుటుంబాలను ప్రభుత్వంతోపాటు కంపెనీ యజమాన్యం ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్, నాయకులు కసావు శ్రీనివాస్, మిట్ట వెంకటయ్య, గుండ్లపల్లి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## అన్ని రాష్ట్రాల్లోనూ పోరాడండి

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)లో భాగంగా కలిసి ఒడేది. ఢిల్లీ సరిహద్దుల్లో 2020–21లో రైతులు లక్షలాదిమంది నిరసన ప్రదర్శనలు చేశారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం మూడు చట్టాలను వెనక్కు తీసుకుంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కూడా ప్రధానమంత్రి తన సందేశంలో భరోసా ఇచ్చారు. 2022లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంకోసం ఎస్‌కెఎం నాయకుడు బల్బీర్‌సింగ్ రాజేవాల్ 'సంయుక్త సమాజ్ మోర్చా' ఏర్పాటు చేయడంతో డల్లేవాల్ బికెయు రెండుగా చీలిపోయింది. ఆ తర్వాత డల్లేవాల్ భాగసారూప్యతగల రైతు నాయకులతో కలిసి ఎస్‌కెఎం (నాన్–పొలిటికల్)ను ఏర్పాటు చేశారు. ''ఢిల్లీ సరిహద్దులలో ఉద్యమాన్ని విరమించి ఇళ్ళకు తిరిగి వెళుతుంటే, మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిన తర్వాత పంజాబ్ వెనకడుగు వేసింది అని ఇతర రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాల నాయకులు తమను విమర్శించారు. కానీ పంజాబ్ ఏనాడూ ఎవ్వరికీ ద్రోహం చెయ్యలేదు, ఇప్పుడు పంజాబ్ రాష్ట్రం మళ్ళీ పోరాటంలో అగ్రభాగాన నిలిచింది, ఇతర రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాల నాయకులకు నేను ఇప్పుడు విజ్ఞప్తి చేస్తున్నాను, రైతు సంఘాలు తమ తమ రాష్ట్రాలలో కనీస మద్దతు ధర చట్టబద్ధతకోసం బలమైన పోరాటాలు చెయ్యాలి, కేంద్ర ప్రభుత్వానికి సందేశాలు పంపించాలి, ఈ పోరాటం కేవలం పంజాబ్‌కు మాత్రమే పరిమితం కాదు, యావత్ దేశానికీ సంబంధించినది'' అని డల్లేవాల్ అన్నారు.''యావత్ దేశమంతటికీ కనీస మద్దతు ధర కావాలి, ఇప్పుడు నేను చేస్తున్న యుద్ధం నేను చేస్తున్నది కాదు, నా కోసం చేస్తున్న యుద్ధం కాదు, డల్లేవాల్ యుద్ధం చేస్తున్నాడని చెబుతున్నారు, ఇదంతా ఆ దేవుడి సంకల్పం, ఒక వ్యక్తి ద్వారా ఇదంతా చేయించాలని ఆ దేవుడు కోరుకున్నాడు, మనం అందుకు అనుగుణంగా చేస్తున్నాం అంతే, ఈరోజున మీరు పెద్ద సంఖ్యలో ప్రతి గ్రామం నుండీ ట్రాలీలలో ఇక్కడకు వచ్చారు, ఖనౌరీ చేరుకోవాలని ఆకాంక్షించి ఇక్కడకు వచ్చారు, కిసాన్ మోర్చాను బలపరచాలని వచ్చారు'' అని డల్లేవాల్ అన్నారు. ''పోలీసులు మమ్మల్ని ఇక్కడి నుండి ఖాళీ చేయించి బలవంతంగా తీసుకుపోతారని సమాచారం అందుకున్న ఆ రోజు రాత్రి వందలసంఖ్యలో యువకులు పంజాబ్, హర్యానాల నుండి ఖనౌరీకి చేరుకున్నారు, కిసాన్ మోర్చా బాధ్యతలను వారు తీసుకున్నారు, ఇప్పుడు నాకు విశ్వాసం ఉంది, మోర్చా విజయం సాధిస్తుంది, ప్రభుత్వం పెద్ద సంఖ్యలో బలగాలను దించి చాలా పెద్ద ఒత్తిడి తీసుకురావచ్చు, కానీ మోర్చాను మాత్రం వాళ్ళు ఓడించలేరు'' అని డల్లేవాల్ అన్నారు. ''డల్లేవాల్ ప్రాణాలు చాలా ముఖ్యమని సుప్రీంకోర్టు ఈ మధ్య చెప్పింది, ఆనాడే నేను చెప్పాను, గౌరవనీయమైన ఉన్నత న్యాయస్థానమా, నేను కూడా ఒక మనిషినే, సరే, మరి ఆత్మహత్యలు చేసుకున్న ఏడు లక్షల మంది రైతుల కుటుంబాల సంగతి ఏమిటి? భవిష్యత్‌లో ఈ ఆత్మహత్యలను ఎవరు అడ్డుకుంటారు?'' అని డల్లేవాల్ ప్రశ్నించారు. పంజాబ్‌లో అన్ని గ్రామాల నుండీ ఖనౌరీ మహాపంచాయత్‌కు వచ్చిన రైతులు అందరికీ డల్లేవాల్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదిలా ఉండగా డల్లేవాల్ ఏమీ తినడంలేదనీ, ఏమీ తాగడం లేదనీ, మంచినీరు కూడా ముట్టడం లేదనీ రైతు సంఘాల నాయకులు అంతకుముందు చెప్పారు.



సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శ్రీశ్రీ సుదర్శనలక్ష్మీ నారసింహ దివ్యస్వర్ణ విమాన గోపురమహా కుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానించిన మంత్రి కొండా సురేఖ, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, యాదగిరిగుట్ట ఆలయ ఈవో, అర్చకులు. ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు యాదగిరిగుట్టలో జరగనున్న శ్రీశ్రీ సుదర్శన దివ్యవిమానస్వర్ణ గోపుర మహాకుంభాభిషేక కార్యక్రమం.

# మనువాదాన్ని ఓడిద్దాం.. రాజ్యాంగాన్ని గెలిపిద్దాం



మారుపాక అనిల్ కుమార్
9440482429

**సామాజిక న్యాయంకై ఉద్యమిద్దాం**

**నేటి నుంచి హైదరాబాద్‌లో అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఎఐడిఆర్ఎం) జాతీయ రెండవ మహాసభల సందర్భంగా ...**

భారతీయ సమాజంలో మనుషులకు కులం ద్వారానే గుర్తింపు ఉంటుందనేది విస్మరించలేని వాస్తవం. అధికారిక లెక్కల ప్రకారం దేశ జనాభాలో దళితులు సుమారు 22 శాతం మంది ఉన్నారు. అంటే జనాభాలో మెజారిటీ ప్రజలు దళితులే. మరి 'ఎన్నికల ప్రజాస్వామ్యం' ఉన్న దేశంలో మెజారిటీ ప్రజలదే అధికారం ఉండాలి. 'మైనారిటీ అంటే సంఖ్య కాదు.. ప్రజలకున్న హక్కులు, అధికారం స్థాయిని బట్టి సమాజంలో మైనారిటీ స్థాయి నిర్ణయించబడాలి' అన్న బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలు మనం ఒకసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

పదేళ్ళ బిజెపి పరిపాలనలో దళితులపై, మహిళలపైన తీవ్రస్థాయిలో దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలలో 300 రెట్లు దళితులపై దాడులు పెరిగాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ బిజెపి అధికారంలో ఉంది. నలుగురు బ్రాహ్మణ రాజపుత్ యువకులు కూలీ పనికి వెళ్లిన దళిత యువతి మనిషా వాల్మీకిపై నాలుగు గంటల పాటు దారుణంగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె నాలుక కోసి, నడుములు విరిచారు. ఆసుపత్రిలో 14రోజుల తర్వాత చనిపోతే, కనీసం శవాన్ని కూడా ఇవ్వకుండా అవమానీయంగా ప్రవర్తించింది బిజెపి యోగి సర్కార్. గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ఆ రేపిస్టులకు బిజెపి అండగా నిలబడింది. గంగా నదిలో ఓ దళిత మహిళ స్నానం చేసినందుకు ఆమెను నగ్నంగా చితకబాది జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. మణిపూర్‌లో ఇద్దరు ఆదివాసి మహిళలను నగ్నంగా ఊరేగింపు చేసిన ఘటనతో దేశమంతా తలదించుకుంది. అక్కడ ఉంది కూడా బీజేపీ సర్కారే. మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ ఊనా పట్టణంలో ఐదుగురు దళిత యువకులను పశు మాంసం తెస్తున్నారని నెపంతో చెట్టు కట్టేసి కొట్టి కారుకు కట్టేసి ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. 30 ఏళ్ల దళిత యువకుడు సందీప్ రాథోడ్ గుర్రం ఎక్కాడనే నెపంతో గుర్రంపై నుండి కింద పడేసి కొట్టి చంపారు.గత సంవత్సరం నాగపూర్‌లో అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో దళితులు పాల్గొన్నారని సభాస్థలాన్ని పసుపునీళ్లతో శుద్ధి చేశారు.

**పెరిగిన దాడులు, తరిగిన నిధులు**

ఎన్.సి.ఆర్.బి లెక్కల ప్రకారం భారతదేశంలో అతిపెద్ద రాష్ట్రం యూపీలో హత్యలు 4,889, కిడ్నాప్ కేసులు 15,898, లైంగిక దాడులు 4,816. దళితుల పైన దాడులు 10,426 పైగా నమోదయ్యాయి. ఎన్‌డిఏ పాలనలో 2014 సంవత్సరంలో 40,972 సంఘటనలు జరిగితే 2021 సంవత్సరం నాటికి 50,900 దాడులు పెరిగాయి. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పనితీరు ఆమోదయోగ్యంగా లేదు. 2022 మార్చి 24న పార్లమెంట్‌లో సమర్పించిన సమాచారం ప్రకారం తొమ్మిది మంత్రిత్వ శాఖలు, రైల్వేలు, ఆర్థిక, ఆటమిక్ ఎనర్జీ, రక్షణ, గృహ, హోం శాఖలతో సహా కేంద్ర ప్రభుత్వ శాఖలన్నింటిలో మొత్తం 82,022 పోస్టులు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వ్ చేయబడ్డాయి. వాటిలో కేవలం 43 శాతం ఖాళీ పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. నివర్శిటీలు,ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో పరిస్థితి కూడా చాలా ఘోరంగా ఉంది.ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 42శాతం ఖాళీ పోస్టులు భర్తీ చేయడంలో 45 సెంట్రల్ యూనివర్శిటీలు వైఫల్యం చెందాయి. ఇండియన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 80శాతం ఖాళీ పోస్టులను ఇంత వరకు భర్తీ చేయకపోవడంతో అది అధ్వాన్నమైన యదార్థ స్థితిగా నిలిచింది. ఎస్సీ సంక్షేమానికి కేటాయింపుల గణనీయమైన తగ్గింపు, ఖర్చులలో కోతలు విధించడం ద్వారా వివక్షత కొనసాగింపులో మోదీ ప్రభుత్వమే స్వయంగా తోడుగా నిలిచింది. 2014–15, 2019–20 మధ్య ఆర్థిక సంవత్సరాల్లో జనాభా దామాషా ఆధారంగా జరిగిన మొత్తం కేటాయింపుల్లో కేవలం 20.8 శాతం మాత్రమే వారి సంక్షేమానికి ఖర్చు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలు తెలియ జేస్తున్నాయి. ఇది ఎస్సీ వర్గాలకు న్యాయంగా చెల్లించాల్సిన రూ.7.51 లక్షల కోట్లను నిలిపి వేయడంతో సమానం. దీనితో పాటు 2017–18లో ఎస్సీ సబ్ ప్లాన్‌ను రద్దు చేయడం ద్వారా మోదీ ప్రభుత్వం ఎస్సీ అభివృద్ధికి ఉద్దేశించబడిన యంత్రాంగాన్ని ధ్వంసం చేసింది. ఈ మార్పుల ఫలితంగా మోదీ రెండోసారి ప్రధాని పదవి చేపట్టిన 2019–20, 2023–24 మధ్య కాలంలో కేంద్ర ప్రాయోజిత పథకాల కేటాయింపుల మొత్తం నిధుల్లో ఎస్సీలకు కేవలం 10.6శాతం మాత్రమే కేటాయించారు. కేటాయింపుల్లో కూడా కేవలం 3.3శాతం మాత్రమే ఎస్సీల పథకాలకు మళ్ళించారు.కేటాయించిన నిధుల్ని కూడా పూర్తి స్థాయిలో వినియోగించలేదు.

**మారని దళితుల తలరాతలు**

స్వంత భూములున్న 50శాతం దళితులకు సాగునీటి సౌకర్యాలు లేవు. సాధారణ జనాభాలో 33.3శాతం జనాభాతో పోల్చినప్పుడు 65.8శాతం దళితులు పేదరికంలో జీవిస్తున్నారు. ఇది చాలా తీవ్రమైన పరిస్థితి. ఎస్సీలలో అక్షరాస్యతా రేటు కేవలం 66శాతంగానే ఉంది. అంటే జాతీయ సగటు రేటు 73శాతం కంటే కూడా తక్కువగా ఉంది. అసంఘటిత రంగ కార్మికుల్లో దళితులు 84 శాతంగా ఉన్నారు. ఈ గణాంకాలు మోదీ నాయకత్వంలోని మతతత్వ, కార్పొరేట్ ప్రభుత్వం దళితల వ్యతిరేక స్వభావాన్ని తెలియజేస్తుంది. మోడీ హిందూత్వ లేక 'సనాతన ధర్మ' భావజాలంలో సామాజిక న్యాయాన్ని వెతకడం అంటే ఎండమావిలో నీటిని వెతకడం లాంటిదే. పైగా దేశ ప్రజలందరి గుండెకాయ లాంటి భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2025 జనవరి 5,6,7 తేదీలలో హైదరాబాద్‌లో ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో హైదరాబాదులో అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడిఆర్‌యం) జాతీయ ద్వితీయ మహాసభలు జరుగుతున్నాయి. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. దేశవ్యాప్తంగా దళితులను ఆర్థిక, రాజకీయ, సామాజిక, హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం, కులవివక్షత, కులనిర్మూలన కోసం, ఎస్సీ సబ్ ప్లాన్ అమలు చేయాలని, దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలనే డిమాండ్లపై చర్చించనున్నారు. అనంతరం దేశవ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు నిర్వహించేందుకు, భవిష్యత్ కార్యాచరణను మహాసభ దిశానిర్దేశం చేయనుంది.

## సేవా సంస్థలకు సంపూర్ణ సహకారం

విద్య, వైద్య రంగాల్లో ప్రజా ప్రభుత్వం విశేష కృషి

'మహావీర్ ఇంటర్నేషనల్ స్వర్ణోత్సవాల'లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా సేవలు అందిస్తున్న సామాజిక సంస్థలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని సిటాడెల్ కన్వెన్షన్‌లో శనివారం జరిగిన మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాలలో ముఖ్యఅతిథిగా డిప్యూటీ ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సామాజిక పరివర్తన కోసం ఎటువంటి లాభాపేక్ష లేకుండా చిన్నారులు, మహిళల సాధికారికత కోసం, వైద్య సహకారం అవసరమైన వారికి మహావీర్ సంస్థ ఉచితంగా సేవలు అందించడాన్ని అభినందించారు. విద్యార్థులు, మహిళలు, వైద్య రంగాల్లో విశిష్ట కృషి చేస్తుందని తెలిపారు. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, అందులో భాగంగా మొదటి సంవత్సరం రూ.19 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇప్పటికే స్వయం సహాయక సంఘాలకు అందించినట్లు తెలిపారు. ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏడాదికి రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచామన్నారు. పది లక్షల వరకు నిరుపేదలు రూపాయి కూడా చెల్లించకుండా ఉచితంగా వైద్య సహాయం అందిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి కొత్త విద్యుత్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతుందని వివరించారు. మాది పీపుల్స్ ఫ్రెండ్లీ గవర్నమెంట్ అని అన్నారు. కార్యక్రమంలో మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాల నిర్వహణ కమిటీ చీఫ్ కన్వీనర్లు శీల్ జైన్, అజయ్ నహత, చైర్మన్ వినోద్ సంచేటి, కన్వీనర్ సీమ షీల్ కుమార్ జైన్, వైస్ చైర్ పర్సన్ అర్చన నహత ప్రసంగించారు.

## ప్రజావాణిపై బురద చల్లడం మానుకో



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జన ప్రభంజన వేదికలాంటి 'ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం' పైన బిఆర్ఎస్ నాయకులు హరీష్ రావు బురద చల్లడం ఏమాత్రం సబబు కాదని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా సెంటర్‌లో ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్‌తో కలిసి చిన్నారెడ్డి శనివారం మీడియాతో మాట్లాడారు. ప్రజల సమస్యలు వినే ప్రజావాణి కార్యక్రమంపైన విమర్శలు చేయడం హరీష్ రావుకు తగదని హితవు పలికారు. ప్రజల కష్టాలు విని, వారి నుంచి అర్జీలను స్వీకరించి, మేలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమంపై విమర్శలు చేస్తే హరీష్ రావుకు పాపం తగులుతుందని, చిత్తశుద్ధితో పని చేస్తున్న ప్రజావాణి సిబ్బందిపై విమర్శలు చేయడం మానుకోవాలని చిన్నారెడ్డి సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి హరీశ్‌రావు స్వయంగా చూడాలని, అప్పుడు ప్రజావాణి సిబ్బంది, తాము చిత్తశుద్ధితో చేస్తున్న కష్టం తెలుస్తుందని చిన్నారెడ్డి తెలిపారు. ఎంతో ఓర్పు, సహనంతో ప్రజా సమస్యలను విని ,వాటికి పరిష్కారాన్ని చూపుతున్నామన్నారు. 92 సెషన్స్ ద్వారా 92,115 అర్జీలను స్వీకరించి, ఇందులో 63 శాతం సమస్యలను పరిష్కరించామని చిన్నారెడ్డి వివరించారు.

## ముతావలి కమిటీ రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని దారుల్ షిఫాలోని ఇబాదత్ ఖానాకు ముతావలి కమిటీ సభ్యులుగా ఏడుగురిని తెలంగాణ స్టేట్ వక్ఫ్ బోర్డు నియమించడాన్ని హైకోర్టు తప్పు పట్టింది. వక్ఫ్ బోర్డు 2023లో ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని హైకోర్టు తీర్పు చెప్పింది. ఇబాదత్ ఖానాను వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవాలంది. ఈ మేరకు జస్టిస్ నగేష్ భీమపాక ఇటీవల తీర్పు చెప్పారు. ఇబాదత్ ఖానాను వక్ఫ్ బోర్డే నిర్వహించాలని తీర్పులో పేర్కొన్నారు.

## నేటి నుంచి 'ఎఐడిఆర్ఎం' జాతీయ మహాసభలు

'నేడు' ఇందిరా పార్క్ వద్ద భారీ బహిరంగసభ

6న మహాసభలను ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

7వ తేదీన ప్రతినిధుల సభ




**ప్రజా పక్షం/హైదరాబాద్ :** అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఎఐడిఆర్ఎం) 2వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లో ఆదివారం (నేటి) నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జేరుపోతుల కుమార్ తెలిపారు. ఈ నెల 5,6,7 తేదీలలో మూడు రోజుల పాటు జరగనున్న మహాసభల్లో దేశవ్యాప్తంగా దళితులను ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయం కోసం, కుల వివక్ష, కుల నిర్మూలన కోసం, ఎస్.సి సబ్ ప్లాన్ దేశవ్యాప్తంగా అమలు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్లు వారు వెల్లడించారు. శనివారం హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహాసభల వివరాలను ఆరుట్ల రాజ్ కుమార్, జేరుపోతుల కుమారు వెల్లడించారు.

**నేడు ఇందిరా పార్క్ వద్ద భారీ బహిరంగ సభ :**
అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం 2 వ జాతీయ మహాసభల ప్రారంభం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఇందిరా పార్క్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తునట్లు రాజ్ కుమార్, తెలిపారు. ఈ బహిరంగసభ నుద్దేశించి సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం జాతీయ అధ్యక్షులు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి వి.ఎస్. నిర్మల్, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తదితరులు ప్రసంగించనున్నట్లు ఆయన వెల్లడించారు.

**6న మహాసభలను ప్రారంభించనున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క :**
6వ తేదీన హైదరాబాద్, ఖైరతాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఈ మహాసభలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనుండగా సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. 7వ తేదీన ప్రతినిధుల సభ ఉంటుందని, రెండురోజులపాటు జరిగే ఈ మహాసభలలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి దాదాపు 1000 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని ఆరుట్ల రాజ్ కుమార్ వెల్లడించారు. జేరుపోతుల కుమార్ మాట్లాడుతూ ఆదివారం హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## రహదారుల భద్రతపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టండి

రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో రహదారుల భద్రతపై అవగాహన కార్యక్రమాలను కల్పించాలని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పాఠశాలలలో ట్రాఫిక్ అవగాహన పార్కులను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని, రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారి లైసెన్సులను రద్దు చేస్తున్నామని, మరోసారి నిబంధనలను ఉల్లంఘించిన వారికి జైలు శిక్ష పడుతుందన్నారు. ఈ నెల 31 వరకు 'రహదారి భద్రతా మాసోత్సవాలు' జరగనున్న నేపథ్యంలో వివిధ శాఖల సమన్వయంతో జిల్లాల్లో కార్యక్రమాలను చేపట్టేలా హైదరాబాద్‌లోని సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొన్నం శనివారం విడియో కన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రవాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ అధికారులు ,ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రం లో ప్రతి రోజూ రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మరణిస్తున్నారని, దీనిని పూర్తిగా తగ్గించేందుకు అందరూ కలిసి పని చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా అధిక వేగం,మద్యం సేవించి వాహనం నడపడం, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, విశ్రాంతి లేకుండా డ్రైవింగ్ చేయడంలాంటి కారణాలతో 80 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారుల భద్రత అంశంపైన జిల్లాల్లో అవగాహన సదస్సులు, వర్క్ షాప్‌లను నిర్వహించాలి. రహదారి భద్రతా నిబంధనలపై ప్రచార రథాలు, పోస్టర్ క్యాంపెయిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు నివారించడానికి ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించడం, ప్రమాద ప్రదేశాలను గుర్తించి, సైన్ బోర్డులను ఏర్పాటు చేయడం, ముఖ్య రహదారుల్లో రహదారి నిబంధనల పర్యవేక్షించాలన్నారు. రవాణా, ఆర్ అండ్ బి, పోలీస్,పాఠశాల విద్యా శాఖలతో పాటు, నేషనల్ హైవేస్ అథారిటీ, ఇతర సంబంధిత శాఖలతో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాలను నిర్వహించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, రహదారి భద్రతాపై క్విజ్ పోటీలు నిర్వహించాలని, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు ట్రాఫిక్ కూడళ్ళ వద్ద అవగాహన బోర్డులు , ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, రహదారుల భద్రతపై ముగ్గుల పోటీలను నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## హమాలీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** సివిల్ సప్లై హమాలీ కార్మికులు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, హమాలీ కార్మికుల కూలీ రేట్ల పెంపు, ఇతర సంక్షేమ పథకాల వర్తింపు కోసం తక్షణమే ప్రభుత్వం జీవో విడుదల చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై హమాలీ కార్మికులు గత నాలుగు రోజులుగా వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం, కూలీ రేట్ల పెంపు కోసం చేస్తున్న సమ్మె శిబిరాన్ని శనివారం కరీంనగర్‌లో వెంకటరెడ్డి సందర్శించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వం సివిల్ సప్లై కార్పోరేషన్ లిమిటెడ్ వారు హమాలీ కూలీరేట్ల పెంపు, బకాయిల చెల్లింపు కోసం అధికారులు హామీ ఇచ్చి దాదాపుగా సంవత్సరం గడుస్తున్నా నేటికీ అమలు కాకపోవడం దురదృష్టకరమని, స్వయంగా సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ డిఎస్ చౌహాన్ కార్మిక సంఘాలతో గత సంవత్సరం అక్టోబర్‌లో చర్చలు జరిపి హామీ ఇచ్చినా నేటికీ అమలు కాకపోవడం మూలంగా గత్యంతరం లేక హమాలీలు సమ్మె చేస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని, హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెరగకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా నాలుగువేల మంది హమాలీ కార్మికులు, మహిళా కార్మికులు అన్ని పాయింట్లు పని చేస్తున్నారని, వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. కార్మికులు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అధికారులు చేసే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. తక్షణమే సంబంధిత మంత్రి ప్రభుత్వం చొరవ తీసుకుని కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేయాలని వెంకటరెడ్డి ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, తెలంగాణ సివిల్ సప్లైస్ కార్పోరేషన్ హమాలీ యూనియన్ నాయకులు ఎం.అంజయ్య, ఎ.రాజయ్య, శ్రీధర్, ఎ.మల్లయ్య, గొర్రె కనకయ్య, గడ్డి లక్ష్మ య్య, లక్ష్మి , మల్లయ్య, రాజమల్లు హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## పెంచిన సివిల్ సప్లయీస్ హమాలీ రేట్లను తక్షణమే చెల్లించాలి

సిఎం రేవంత్‌రెడ్డికి ఎఐటియుసి బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికుల హమాలీ రేట్ల పెంపు జిఓను విడుదల చేసి బకాయిలు చెల్లించేలా సివిల్ సప్లయీస్ కమిషనర్ ఆదేశించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజు సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం బాల్ రాజు సిఎంకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో 187 మండల స్టాక్ పాయి ంట్ల లో 3600 హమాలీ కార్మికులు 165 మంది మహిళలు (స్వీపర్స్)గా గత 40 సంవత్సరాల నుండి పని చేస్తూ ప్రజా పంపిణీ పథకం ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎగుమతి, దిగుమతి పనులు చేస్తూ స్టాక్ పాయింటు నుండి రేషన్ డీలర్లకు పంపిణీ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ప్రతి 2 రెండేళ్లకోసారి హమాలీ రేట్లు పెంచడంతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఒప్పందం చేసుకోవడంతో పాటు జి.ఓ.సైతం విడుదల చేశారని, ఈ ఒప్పందం ప్రకారం ఇప్పటి వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి జనవరి 1 నుండి హమాలీ రేట్లు పెంచి అమ లు చేశారని తెలిపారు.ఇందులో భాగంగా 2022 జనవరిలో జరిగిన ఒప్పం దం ప్రకారం గత ప్రభుత్వం క్వింటాలుకు రూ.22ల నుండి రూ.26లకు అనగా రూ.4లు క్వింటాలుకు పెంచి చెల్లించారని వెల్లడించారు. ఈ ఒప్పం దం జరిగి 3నెలలు దాటుతున్నా నేటి అమలు చేయకపోవడంతో అనివార్యంగా జనవరి 1 నుంచి సమ్మె చేపట్టడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. ఈ సమ్మెకు కారణం అధికారుల నిర్లక్ష్యమేనని, కావున సిఎం కలగజేసుకుని పెంచిన హమాలీ ఛార్జీలను జిఓ విడుదల చేసి బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని బాలరాజు బహిరంగ లేఖ ద్వారా సిఎంకి విజ్ఞప్తి చేశారు.

## ఆయిల్ పామ్ సాగులో రాష్ట్రానిదే అగ్రస్థానం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయిల్ పామ్ సాగులో దేశంలో తెలంగాణ రాష్ట్రానిదే అగ్రస్థానమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ అన్ని రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులతో వ్యవసాయరంగంలో సంస్కరణల మీద సలహాలు, సూచనలు అన్న అంశంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భముగా మంత్రి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగులో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. ఇప్పటికే లక్ష హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగులోకి రాగా, వచ్చిందని, రానున్న 5 ఏళ్లలో మరో 4 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగులోకి తీసుకురావచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామని కేంద్ర మంత్రికి వివరించారు. అయితే రాష్ట్ర పామ్ ఆయిల్ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు టన్ను పామాయిల్ గెలకు కనీస మద్దతు ధర రూ. 20 వేలు ఉండేలా చూడాలని, అలా కాకపోతే 2018 లో గల దిగుమతి సుకం 40 శాతం కి, ఇప్పుడున్న సుంకం పెంచినట్లయితే అది రాష్ట్ర రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. సోయాబీన్ సేకరణలో కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంతో రాష్ట్రంలో ఈ సారి ఎన్నడూ లేనంతగా 53,617 మెట్రిక్ టన్నుల సోయా సేకరణ చేయగలిమని తెలిపారు. రాష్ట్రంలో పండించే ఇతరపంటలు పసుపు, మిర్చి పంటలకు కూడా కనీస మద్దతు ధర ప్రకటించే విషయాన్ని పరిశీలించాల్సిందిగా కోరారు. పిడిఎంసి మార్గదర్శకాల ప్రకారం డ్రిప్ సాగునీటి పరికరాల సూచనాత్మక ధర చాలా తక్కువగా ఉందని, డ్రిప్ పరికరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, రైతుల ప్రయోజనాల దృష్యా ఈ ధరలను పునఃపరిశీలించాలని కేంద్రాన్ని కోరారు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాయడం జరిగిందని గుర్తు చేశారు. ఆయిల్ పామ్ పంటలో తెలంగాణ ప్రభుత్వం డ్రిప్ పరికరాల ఖర్చులు రూ. 53,465 కు నిర్ణయించగా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సూచనాత్మక ధర కేవలం రూ. 27,304 ఉందని తెలిపారు. నాసిరకాల విత్తనసాగుతో పంటనష్టపోయిన సందర్భములో, సదరు విత్తన కంపెనీలు రైతులకు నష్టపరిహారము చెల్లించేవిధంగా విత్తనచట్టంలో సవరణలు చేయాలని సూచించారు.రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను సబ్సిడీ ధరకు అందిస్తున్నామని, పచ్చిరొట్ట ఎరువులను మరింతగా ప్రోత్సహించడానికి కేంద్రం ఆర్థిక సహాయం అందించాలి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందర్ రావు, వ్యవసాయ , ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సంక్రాంతి నుండే రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం

మహిళా సంఘాలకు రూ.50కోట్ల వడ్డీలేని రుణాలు

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వచ్చే సంక్రాంతి పండుగ నుండే అర్హులైన ప్రజలందరికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వివరించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ గ్రామంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో రూ.8కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన చేయడంతోపాటు కమ్యూనిటీ హాల్, మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. నందిగామ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో పంచాయతీ భవనానికి, ఫరూక్‌నగర్ నుండి వీర్లపల్లి మీదుగా చేగూరు వరకు రూ.19.4కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. చేగూరు నుండి సింబాయసిస్ యూనివర్సిటీ వరకు రూ.7కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న శక్తికి వెలికి తీసేందుకు 15రకాల వ్యాపారాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో చేపల వృత్తిలో ఉన్న వారికి పది లక్షల రుణంలో ఆరు లక్షల రుణం మాఫీ చేయడంతో పాటు 32 జిల్లాలో 150 బస్సులు నడిపించేందుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, వాణిజ్య పరంగా అభివృద్ధి సాధించి కోటీశ్వరులు కావాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో అన్నదాతలకు ఇచ్చిన హామీ మేరకు మూడు దశల్లో రూ.21వేల కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలనే సంకల్పంతోనే రూ.50కోట్ల రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలతోపాటు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళు విధిగా ఇస్తామని వివరించారు. ఎవరు కూడా దళారులను ఆశ్రయించాల్సిన పని లేదని, నేరుగా అధికారులు వచ్చి ఇస్తారనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. సన్న వడ్ల క్వింటాల్‌కు రూ.500బోనస్ ఇవ్వడం జరుగుతుందని, సంక్రాంతి పండుగ తరువాత రేషన్ కార్డులను సైతం ఇవ్వనున్నట్లు తెలిపారు.

**బోనాలతో మంత్రి సీతక్కకు స్వాగతం..**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని మధురాపురం గ్రామానికి మంత్రి సీతక్క వస్తున్న నేపథ్యంలో గ్రామ మహిళలు మంగళ హారతులు, బోనాలతో ప్రత్యేకంగా స్వాగతం పలికారు. పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు షాద్‌నగర్ బైపాస్ రహదారి వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు పూల బోకేతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసిలు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి భార్గవ్ కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత, తహశీల్దార్ పార్థసారధి, ఎంపిడిఓ బన్సర్ లాల్, ఎపిఎం నాగేష్, పంచాయతీ రాజ్ శాఖ ఏఇ గోపాల్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-2 (హౌసింగ్)
సీల్డ్ కొటేషన్ల ఆహ్వాన ప్రకటన నెం. 05/EE-II(H)/GHMC/2024-25, తేది: 03.01.2025
**క్ర.సం.1, పని వివరణ:** మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర మండలం, సర్వే నంబర్లు: 24/2, 24/3లోని అహ్మద్‌గూడ 2బిహెచ్‌కె హౌసింగ్ కాలనీ కొరకు 50 ఎంఎం సైజ్‌గల 1.0 హెచ్‌పి సబ్‌మెర్సిబుల్ సీవేజ్ పంపు ఏర్పాటు మరియు సరఫరా కొరకు సీల్డ్ కొటేషన్లను ఆహ్వానించడమైనది. **కొటేషన్ల స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రకటన జారీ: 04.01.2025న ఉ.10.30గం.లకు, కొటేషన్ల దాఖలకు ఆఖరి తేది: 07.01.2025న మ.3.00గం.ల వరకు, సీల్డ్ కవర్ కొటేషన్ల ప్రారంభం: 07.01.2025న మ. 3.30గం.లకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-2 (హౌసింగ్) కార్యాలయం, జిహెచ్ఎంసి, 1వ అంతస్తు, మున్సిపల్ బిల్డింగ్, హరిహర కళా భవన్, సికింద్రాబాద్ - 500003. వివరాల కొరకు వై.శంకర గణేష్, డిప్యూటీ ఇఇ (హెచ్), జిహెచ్ఎంసి. సెల్: 9701362882, ఇ-మెయిల్ ఐడి: eehr2jnnurm@gmail.com ను సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు http://www.ghmc.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (హౌసింగ్ 2), జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 8646-PP/CL/ADVT/1/2024-25, Date: 04-01-2025




## అందుబాటులోకి స్మార్ట్ క్లాస్‌రూమ్స్



దేశవ్యాప్తంగా స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. స్మార్ట్ సిటీస్ మిషన్ (ఎస్‌సిఎం) ప్రాజెక్టులో భాగంగానే స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు జరుగుతుంది. స్మార్ట్ క్లాస్‌రూమ్స్ వల్ల విద్య నాణ్యత మెరుగుపడిందని బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అధ్యయనం వెల్లడించింది. 2015లో గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా స్మార్ట్ సిటీస్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. నగరాల్లో మౌలిక సదుపాయాలు, జీవన నాణ్యత, స్థిరత్వాన్ని మెరుగుపరచడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. 2022లో ప్రారంభమైన స్మార్ట్ సిటీస్ అండ్ అకాడెమియా టూ యాక్షన్ అండ్ రీసెర్చ్ (ఎస్‌ఎఏఆర్) ద్వారా ఎస్‌సిఎం కింద చేపట్టిన పట్టణ కార్యక్రమాలను డాక్యుమెంట్ చేయడానికి, పరిశోధించడానికి అవకాశం ఏర్పడింది. ఐఐఎం అధ్యయనం ప్రకారం 2015–16నుండి 2023–24వరకు 19 నగరాల్లో ఎస్‌సిఎం కింద స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు 22 శాతం పెరిగాయి. 71 నగరాల్లోని దాదాపు 2,400 ప్రభుత్వ పాఠశాలల్లో 9,500 స్మార్ట్ క్లాస్‌రూమ్స్ నడుస్తున్నాయి. కర్నాటక 80 స్మార్ట్ క్లాస్‌రూమ్ ప్రాజెక్టులతో అగ్రస్థానంలో ఉండగా, రాజస్థాన్ (53), తమిళనాడు (23), ఢిల్లీ (12) తర్వాతి స్థానాలు ఆక్రమించాయి. పశ్చిమ బెంగాల్‌లో అత్యల్పంగా కేవలం రెండు ప్రాజెక్టులు మాత్రమే ఉన్నాయి. ఈ స్మార్ట్ క్లాస్‌రూమ్స్‌తో ఉపాధ్యాయుల శిక్షణ, సామర్థ్యం పెరిగింది. ఈ విధానం సెకండరీ పాఠశాలల్లో ఎంతో ఉపయుక్తంగా ఉంది.

## జీవవైవిధ్యానికి పెను ముప్పు!



గతంలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు జీవ వైవిధ్యానికి తీవ్రమైన ముప్పు పొంచివుంది. 'ట్రాన్స్‌ఫార్మేటివ్ ఛేంజ్ అసెస్మెంట్' పేరుతో ఇంటర్నేషనల్ సైన్స్ పాలసీ ప్లాట్‌ఫామ్ ఆన్ బయో డైవర్సిటీ అండ్ ఎకోసిస్టమ్ సర్వీసెస్ (ఐపిబిఇఎస్) ఇటీవల విడుదల చేసిన నివేదిక పలు అంశాలను ప్రస్తావించిం ది. జీవవైవిధ్యానికి ఏర్పడుతున్న ముప్పును తగ్గించడానికి పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ప్రపంచ దేశాలపై ఉందని ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని ఐపిబిఇఎస్ స్పష్టం చేస్తున్నది. జీవవైవిధ్య నష్టాన్ని నివారించడానికి సమాజాలు ప్రకృతితో ఎలా సంకర్షణ చెందుతాయో వివరించడంతోపాటు, ప్రాథమిక మార్పుల ఆవశ్యకతను హైలైట్ చేస్తున్న ఈ నివేదికను అనుసరించి, పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణరంగంలో 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 10 ట్రిలియన్ డాలర్ల వ్యాపార అవకాశాలు మెరుగుతాయి. ఫలితంగా 395 మిలియన్ ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి. జీవవైవిధ్యం తగ్గడంతో, ప్రజలకు, ప్రకృతికి మధ్య సంబంధాలు తెగిపోతున్నాయి. అధికారం, సంపద కేంద్రీకరణ వంటి అంశాలే జీవవైవిధ్యం దెబ్బతినడానికి ప్రధాన కారణాలు. దీర్ఘకాలిక స్థిరత్వం కంటే స్వల్పకాలిక ప్రయోజనాలు లేదా లాభాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కూడా సమస్య తీవ్రమవుతున్నది. సరైన చర్యలు చేపట్టకపోతే, జీవవైవిధ్యం మరింత దారుణంగా దెబ్బతింటుందని, ప్రాణికోటి కష్టాల్లో పడుతుందని ఐపిబిఇఎస్ నివేదిక స్పష్టం చేస్తున్నది. ప్రపంచ దేశాలు తక్షణమే ఈ సమస్యపై దృష్టి సారించాలి. తగిన చర్యలు చేపట్టాలి.

## చర్చల్లో హెచ్1బి వీసా!



అమెరికా అధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడం, ఈనెల 20న పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉండడంతో, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల దృష్టి హెచ్1బి వీసాలపై కేంద్రీకృతమైంది. ప్రత్యేకించి భారత్, చైనా దేశాలు రాబోయే పరిణామాలను నిశితంగా విశ్లేషించుకుంటున్నాయి. మొత్తానికి ఇప్పుడు హెచ్1బి వీసా చర్చల్లో నానుతున్నది. ఈ హెచ్1బి అనేది వలసేతర వీసా. ఇది సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (ఎస్‌టిఇఎం/ స్టెమ్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) వంటి ప్రత్యేక ఉద్యోగాలకోసం విదేశీ ఉద్యోగులను నియమించుకోవడానికి యుఎస్‌లోని కంపెనీలను అనుమతిస్తుంది. అర్హత కలిగిన యుఎస్ కార్మికులు అందుబాటులో లేనప్పుడు, ఆయా కంపెనీల యజమానులు ఎదుర్కొనే నైపుణ్యం కొరతను పరిష్కరించడంలో సహాయపడటానికి దీనిని 1990 లో ప్రవేశపెట్టారు. వలసేతర వీసా అనేది పర్యాటకం, వ్యాపారం, పని, అధ్యయనం లేదా వైద్య చికిత్స వంటి ప్రయోజనాల కోసం అమెరికాలో తాత్కాలిక ప్రవేశాన్ని అనుమతిస్తుంది. కాగా, హెచ్1బి వీసా గరిష్టంగా ఆరు సంవత్సరాల వరకు జారీ చేస్తారు. వీసాలో పేర్కొన్న గడువు లేదా వ్యవధి తర్వాత, వీసా హోల్డర్ మరొక హెచ్1బి వీసా కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. అయితే, అంతకు ముందు కనీసం 12 నెలల పాటు అమెరికా వదిలి ఉండాలి లేదా శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం, ప్రతి ఆర్థిక సంవత్సరంలో 65,000 కొత్త హెచ్1బి వీసాల వార్షిక పరిమితి ఉంది. అమెరికాలోని ఏదైనా విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ డిగ్రీని కలిగి ఉన్న దరఖాస్తుదారులకు అదనంగా 20,000 వీసాలు అందుబాటులో ఉంటాయి. ఈ వీసాల్లో భారతీయుల ఆధిపత్యం కొనసాగుతున్నది. 2015 నుండి ఏటా విడుదలై, ఆమోదించిన మొత్తం హెచ్1బి పిటిషన్లలో 70 శాతం కంటే ఎక్కువ మంది లబ్ధిదారులు భారతీయులే కావడం గమనార్హం. చైనీయులు 2018 నుండి స్థిరంగా 12 నుంచి 13 శాతం పిటిషన్లతో రెండవ స్థానంలో ఉన్నారు. హెచ్1బి కాకుడా, ఇతర వలసేతర వీసాలు కూడా జారీ అవుతాయి. వీటిలో 'ఒ' అనేది సైన్సెస్, ఆర్ట్స్, ఎడ్యుకేషన్, బిజినెస్ లేదా అథ్లెటిక్స్‌లో అసాధారణ సామర్థ్యం ఉన్న విదేశీయులకు జారీ చేస్తారు. అదే విధంగా హెచ్2ఎ వీసా తాత్కాలిక వ్యవసాయ కార్మికులకు సంబంధించింది. హెచ్2బి అనేది తాత్కాలిక లేదా కాలానుగుణ స్వభావం కలిగిన ఇతర సేవలు లేదా శ్రమను నిర్వహిస్తున్న తాత్కాలిక కార్మికులకు జారీ చేస్తారు. బి2 వీసా పర్యాటక రంగానికి సంబంధించింది. అమెరికా సందర్శించే వారికి ఇచ్చే వీసా.

## భూగర్భ జలాల్లోనూ కాలుష్యం!



కాలుష్యానికి అంతులేకుండా పోతున్నది. వాయుకాలుష్యంతో దేశ రాజధాని ఏ రీతిలో అల్లాడుతున్నదో చూస్తునే ఉన్నాం. నదులు, సరస్సులు, చివరికి సముద్రాలు కూడా కాలుష్యానికి గురవుతున్న వైనం మనకు తెలుసు. అయితే, భూగర్భ జలాలు కూడా కాలుష్యమయమవుతున్నాయని, దీని తీవ్రత పెరుగుతున్నదని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ (సిబిడబ్ల్యుబి) తన తాజా నివేదికలో పేర్కోవడం ప్రమాద ఘంటికలను మోగిస్తున్నది. ఈ అధ్యయనం ప్రకారం, దేశమంతటా భూగర్భ జలాల కాలుష్య సమస్య పెరుగుతున్నది. వివిధ జిల్లాల్లో అత్యధిక నైట్రేట్ స్థాయి నమోదవుతున్నది. ఈ రసాయన కలుషితం పర్యావరణ సమస్యలను పెంచుతుంది. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చిన్నపిల్లలకు ప్రాణాంతమవుతుంది. 2017లో దేశ వ్యాప్తంగా 359 జిల్లాల్లోని భూగర్భ జలాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉండగా, 2023 చివరి నాటికి ఈ సమస్య 440 జిల్లాలకు విస్తరించింది. దేశంలోని 56 జిల్లాల్లో నైట్రేట్ సాంద్రత లీటరుకు అనుమతించిన లేదా సురక్షిత పరిమితిగా పేర్కొన్న 45 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా ఉంది. రాజస్థాన్ (49 శాతం), కర్నాటక (48 శాతం), తమిళనాడు (37శాతం) అత్యధిక నైట్రేట్ కాలుష్యాన్ని నివేదించాయి. మధ్య, దక్షిణ భారతదేశంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో నైట్రేట్ కాలుష్య సమస్య ఉంది. సాధారణంగా రుతుపవనాల తర్వాత నైట్రేట్ కాలుష్యం పెరుగుతుంది, వర్షాకాలంలో 32.66 శాతం నమూనాలు సురక్షితమైన పరిమితులను మించిపోయాయి.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# రైతుల నెత్తిమీద కుంపటి

'రైతులారా! మీరు ఏమన్నా మొత్తుకోండి – వ్యవసాయ కార్పొరేటీకరణపై నా బాట నాదే' అంటున్నది నరేంద్రమోదీ మూడవ ప్రభుత్వం. గతంలో దేశవ్యాప్తంగా రైతు సంఘాల సామూహిక దీర్ఘకాల ఆందోళన పర్యవసానంగా మూడు 'వ్యవసాయ సంస్కరణల' చట్టాలను తనకుతానుగా ఉపసంహరించుకుని దేశ రైతాంగానికి క్షమాపణ చెప్పిన ప్రధాని మోదీ, రైతుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆ సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా దగా చేశాడని రైతాంగం భావిస్తోంది. వ్యవసాయ పంటల కనీస మద్దతుధరకు లీగల్ గ్యారంటీకోసం, ఎంఎస్‌పి నిర్ణయానికి స్వామినాథన్ ఫార్ములా – సి2+50 శాతం – అమలుకోసం రైతులు సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో 2024 ఫిబ్రవరి 13 నుంచి రెండవ దశ ఆందోళన మొదలుపెట్టారు. రైతు బృందాలు ఢిల్లీ రాకుండా హర్యానా బిజెపి ప్రభుత్వం సరిహద్దులోనే అడ్డుకుని అత్యంత అమానుషంగా వ్యవహరిస్తున్నది. రైతు నాయకుడు జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్ పంజాబ్–హర్యానా సరిహద్దులో ఖనౌరివద్ద నవంబర్ 26నుండి ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నా ఆయనతో చర్చలకు మోదీ ప్రభుత్వం ఏ మాత్రం చొరవ చూపకపోవటం ఆ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక మూర్ఖత్వానికి నిదర్శనం. ఇదిలాఉండగా, పుండుమీద కారం చల్లినట్లు బడా వ్యాపార వర్గ అనుకూల మోదీ ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వశాఖ 2024, నవంబర్ 25 న ''వ్యవసాయ మార్కెటింగ్‌పై ముసాయిదా జాతీయ విధాన చట్రం''ను తమ వెబ్‌సైట్‌లో ప్రచురించి, సంబంధీకులనుంచి 15 రోజుల్లో సలహాలు, సూచనలు ఆహ్వానించింది. ఎంతో ప్రాధాన్యతగల ఈ అంశంపై అధ్యయనానికి కేవలం 15రోజుల వ్యవధే ఇవ్వటం – ప్రభుత్వాన్ని వెనకనుండి ఎవరో ముల్లుగ్రతో పొడుస్తున్నట్లు అనిపించటం లేదూ!

**ప్రజాపక్షం 05-01-2025, ఆదివారం**

ఈ ముసాయిదా 2021లో ప్రభుత్వం ఉపసంహరించుకున్న మూడు వ్యవసాయ చట్టాలకన్నా మరింత ప్రమాదకరమైనదని సంయుక్తకిసాన్ మోర్చా శుక్రవారం ఖండించింది. ఈ ఎన్‌పిఎఫ్ఎఎం ముసాయిదా రైతుల కోర్కెలను, వారి ఆందోళనను అలక్ష్యం చేసి వ్యవసాయంలో కార్పొరేట్ల ప్రవేశానికి తొందరపడుతోందని, ఈ విధానం రైతులకు మేలు జరుగుతుందని తప్పుడు ప్రచారం చేస్తోందని నిరసన తెలిపింది. కొత్త ఆందోళనకు సన్నాహకంగా ఈ రోజు (శనివారం) హర్యానాలోని తొహానాలో, పంజాబ్‌లోని మోగాలో కిసాన్ మహాపంచాయతీలు జరిగాయి.

కరోనా సమయంలో 2020 ఆగస్టులో మోదీ ప్రభుత్వం ఆదరాబాదరా పార్లమెంటు ఆమోద ముద్ర వేయించుకున్న మూడు రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళనకు 200ల కుపైగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలతో ఎస్‌కెఎం ఏర్పడింది. రైతుల ఢిల్లీ మార్చ్‌ని ఢిల్లీలోకి అనుమతించని అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక చర్యకు నిరసనగా వారు సరిహద్దులోనే గుడారాలు వేసుకుని సంవత్సరంపాటు ఆందోళన కొనసాగించారు. చలి, అనారోగ్యంతో దాదాపు 500 మంది చనిపోయారు. వారి కుటుంబాలను ప్రభుత్వం తాకి తలుచుకోలేదు. 2021 నవంబర్‌లో – యుపి అసెంబ్లీ ఎన్నికలకు ముందు – ప్రధాని మోదీ తనంతతానుగా వివాదాస్పద చట్టాలు ఉపసంహరించుకున్నారు. రైతుల కోర్కెలను పరిశీలిస్తామని 2021 డిసెంబర్‌లో కేంద్రప్రభు త్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. మూడేళ్లు గడిచిపోయినా, రైతులు మళ్లీ ఆందోళన చేస్తున్నా మోదీ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీ అమలు జరపకపోగా కొత్త జాతీయ విధానం ముసాయిదా ప్రచురించి దగా చేసేందుకు దిగజారింది. ఈ ముసాయిదాను నిరసిస్తూ ఎస్‌కెఎం మొన్న డిసెంబర్ 23న దేశవ్యాప్తంగా ఆందోళన చేబట్టి 500 జిల్లాల్లో జిల్లా కలెక్టర్లకు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞాపనలు సమర్పించింది.

రైతుల డిమాండ్‌ల ఊసెత్తని ముసాయిదా 12 సంస్కరణలు గూర్చి మాట్లాడుతోంది. ప్రైవేటు టోకు మార్కెట్లు ఏర్పాటు, మార్కెట్ నుండి నేరుగా టోకుగా కొనుగోలు చేసేందుకు ప్రాసెసర్లు, ఎగుమతిదారులు, సంఘటిత రిటైలర్‌లు, భారీ కొనుగోలుదారులను అనుమతించటం వాటిలో ఉన్నాయి. మరో ఆందోళనకరమైన అంశం – జిఎస్‌టి కౌన్సిల్ తరహాలో ఒక సంస్కరణ కమిటీని ప్రతిపాదించింది. వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోని అంశం గనుక రాష్ట్రాల ఏకాభిప్రాయంతో నిర్ణయాలని భ్రమపెట్టటానికి దీన్ని తలపెట్టినట్లుంది. పంజాబ్ ప్రభుత్వం ఈ ముసాయిదాను తిరస్కరించింది. జిఎస్‌టితో రాష్ట్రాలు ఆర్థిక హక్కులు కోల్పోయాయి – రేపు వ్యవసాయం, ఇరిగేషన్ హక్కులు కోల్పోవచ్చు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా దీన్ని తిరస్కరించాలి.

# 2025: రాజ్యాంగంపై రాజకీయ రణం

**జ్ఞాన్ పాఠక్**

'రాజ్యాంగాన్ని పరిరక్షించాలి' అనే నినాదంతో ప్రతిపక్ష పార్టీలు ప్రారంభించిన నిరసనల ఫలితంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన పార్టీ బిజెపి మెజారిటీ కోల్పోవాల్సి వచ్చింది. సంవత్సరాంతంలో పార్లమెంటులో నిరసనలు జుగుప్సాకరంగా భౌతిక ఘర్షణలకు దారితీసి, బిజెపి ఎంపిలు కొందరికి గాయాలయ్యాయి. దీంతో కాంగ్రెస్, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలు ఒకరిపై ఒకరు యుద్ధం చేసుకునేందుకు 2025లో పలు కార్యక్రమాలను ప్రకటించాయి.

2024లో మోదీ ప్రభుత్వం భారత రాజ్యాంగ నైతికతను తొక్కిపెడుతూ, అందులోని కీలక నిబంధనలను ఉల్లంఘిస్తోందని ప్రతిపక్ష ఇండియా కూటమి దాడి చేసింది. అదే సమయంలో అధికార పార్టీ ప్రభుత్వాన్ని వెనుకేసుకురావడమే కాకుండా, కొన్నిసార్లు తామే రాజ్యాంగ రక్షకులమని చెప్పుకుంటూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా రాజ్యాంగాన్ని ఉల్లంఘించిందని, దానిని తీవ్రంగా నష్టపరిచిందని పేర్కొంది. అందుకు డిసెంబర్ 15న ప్రధాని మోదీ చేసిన ప్రతి దాడియే ఉదాహరణ.

బెళగావిలో డిసెంబర్ 26న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన పదేళ్ళ నుంచి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న, విస్మరిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని కాంగ్రెస్ తీర్మానాలు చేసింది. ఈ నిరసనలు గణతంత్ర దినోత్సవం వరకు కొనసాగి, రాజ్యాంగం చట్టబద్ధత పొందిన 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించకొని ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది.

మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తాజాగా తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో తమ ప్రభుత్వం భారత రాజ్యాంగం 75 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా సంవత్సరమంతా ఉత్సవాలు నిర్వహించుకునేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇది దేశ ప్రజలకు సంబంధించి గొప్ప గౌరవం అని అన్నారాయన. ''రాజ్యాంగ నిర్మాతలు మనకు అందించిన రాజ్యాంగం కాల పరీక్షలో నిలిచింది.

రాజ్యాంగం మన మార్గదర్శక వెలుతురు, మన మార్గదర్శి'' అని ప్రధాని మోదీ అన్నారు. 'ఈ ఏడాది(2024) మన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న ప్రారంభమైన అనేక కార్యక్రమాలు ఏడాది పాటు కొనసాగుతాయి. రాజ్యాంగం వారసత్వంతో పౌరులను అనుసంధానం చేసేందుకు 'constitution 75. com' అనే పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్ ను సృష్టించాం,'' ఇందులో ప్రజలు రాజ్యాంగ పీఠికను చదివి, వీడియోను అప్‌లోడ్ చేయవచ్చ'ని తెలిపా రు.

తమ ప్రత్యర్థులపై దాడి చేసేందుకు లేదా తమను సమర్థించుకునేందుకు అటు అధికార, ఇటు ప్రతిపక్షాలలోని ఇతర రాజకీయ పార్టీలు కూడా తమ స్వంత కార్యక్రమాలు ప్రకటించుకోవచ్చని భావిస్తున్నారు. ఇదంతా కూడా 2025ను ప్రత్యేకమైనదిగా చేస్తుంది. ఎందుకంటే రాజకీయ పార్టీల ఆరోపణ, ప్రత్యారోపణల ద్వారా వారి వంచన బహిర్గతమవడమే కాకుండా రాజ్యాంగం యొక్క అసలైన ప్రాధాన్యత గురించి ప్రజలు తెలుసుకొని చైతన్యవంతులవుతారు. అధికార, ప్రతిపక్ష పార్టీల 'రాజకీయ కుస్తీ' మధ్య 2024 మొత్తంలో తెలుసుకున్న దానికంటే ఈసారి ప్రజలు మరింత ఎక్కువ స్థాయిలో రాజ్యాంగం గురించి తెలుసుకునే అవకాశం ఉంటుంది.

దశాబ్ద మోదీ పాలనలో అనేక సందర్భాలలో ప్రభుత్వం 'సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర, సమాఖ్య గణతంత్రం' అనే రాజ్యాంగ మూల సూత్రాలను ఉల్లంఘిస్తున్నదని, తొక్కి పెడుతున్నదని, అలాగే భారత ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ సహా రాజ్యాంగ సంస్థలను కూడా బలహీనపరుస్తున్నదని ప్రతిపక్షాలు పదేపదే ఆరోపించాయి.

2024 ప్రారంభంలో జనవరి 22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రధాని మోదీ ప్రారంభించినప్పటి నుంచే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసనలను ఉధృతం చేశాయి. రాజ్యాంగ మూల సిద్ధాంతమైన లౌకికవాదానికి వ్యతిరేకంగా మోదీ హిందూత్వ రాజకీయాలను ప్రదర్శిస్తున్నారని విమర్శలు గుప్పించాయి. 2024 మార్చి 31న ఇండియా కూటమి నాయకులు ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో సభ నిర్వహించి మోదీ ప్రభుత్వం ''ఘర్షణాత్మక సమాఖ్యవాదం'' ద్వారా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతుందని ఆరోపించారు. ప్రధానమంత్రి ద్రవ్య కేంద్రీకరణ, రాష్ట్ర పథకాలకు ఆటంకాలు, రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచడం, గవర్నర్‌లను దుర్వినియోగం చేయడం, రాజ్యాంగంలోని సమాఖ్య ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధంగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని ప్రధానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆరోపణలు చేసింది.

''ఇండియా, అనగా భారత్, రాష్ట్రాల యూనియన్'' అని చెప్పే రాజ్యాంగంలోని మొదటి అధికరణనే మోదీ ప్రభుత్వం ఉల్లంఘించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించిందని ప్రతిపక్షాలు ప్రచారం చేయడమే కాకుండా ''అధికారంలో ఉన్న వారి నుంచి ఉన్న ముప్పు'' నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతినబూనాయి. ప్రభుత్వం విచారణ సంస్థలను, ఎన్నికల యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని కూడా ఆరోపణలు చేశాయి.

తామేమి తక్కువ కాదంటూ ప్రధాని మోదీ, బిజెపి నాయకులు తమను తాము సమర్థించుకునేందుకు శతథా ప్రయత్నించినప్పటికీ జూన్ 4న ఎన్నికల ఫలితాల్లో వారు ఓడిపోయినట్లు తేలింది. గవర్నర్‌ల దుర్వినియోం కానివ్వండి, ఎలక్టోరల్ బాండ్ స్కీమ్ కానివ్వండి లేదా ఇడి, సిబిఐలను ప్రతిపక్ష నేతలను భయభ్రాంతులకు గురిచేసి కటకటాల వెనక్కి పంపడంలో దుర్వినియోగం చేయడం కానివ్వండి, ఇలా అనేక కేసులలో ప్రభుత్వ దురుసుతనానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పులిచ్చింది.

2024 సంవత్సరం ముగింపునాటికి పార్లమెంటు లోపల, వెలుపల ప్రతిపక్ష ఇండియాకూటమి నిరసనలను ఉధృతం చేయడంతో పరిస్థితి మరింతగా క్షీణించింది. భారత రాజ్యాంగం ఆమోదం పొందిన 75వ వార్షికోత్సవం సందర్భంగా పార్లమెంటులో జరిగిన సాధారణ చర్చలో భాగంగా రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరిచే విధంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన బిజెపి నేతృత్వంలోని అధికార కూటమికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలకు మందుగుండు సమకూర్చింది.

మరోవైపు ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేసేందుకు బిజెపి నాయకులు వేగంగా తమ వ్యూహాలు రూపొందించారు. భారత రాజ్యాంగ పతాకదారులము తామేనని చెప్పుకునే ప్రయత్నం చేయడంతో పాటు కాంగ్రెస్ అధికారంలో ఉండగా రాజ్యాంగ మూల సిద్ధాంతాలపై దాడి చేసిందని ఆరోపించారు.

తాజాగా ప్రధాని తన 'మన్ కీ బాత్'లో చెప్పిన విధంగా వరుస కార్యక్రమాల ద్వారా బిజెపి నాయకులే అసలైన రాజ్యాంగ పతాకదారులుగా చెప్పుకునేందుకు ప్రయత్నిస్తారు. కాంగ్రెస్ ప్రచార కార్యక్రమానికి పోటీగా బిజెపి 'రాజ్యాంగం', 'అంబేద్కర్'పై జనవరి 11నుండి రెండు వారాలపాటు సభలు, సమావేశాల రూపంలో ప్రచార కార్యక్రమం ఖరారు చేసింది.

కాబట్టి 2025 దేశ రాజకీయాలలో ఆసక్తికరమైన సంవత్సరం కానుంది. ఎందుకంటే, అధికార బిజెపి, ప్రస్తుతం కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి పార్టీల ఆరోపణ, ప్రత్యారోపణ బాణాల నడుమ రాజ్యాంగం, దాని మూలసూత్రాల చుట్టూ చర్చ జరుగుతుంది.

**(ఐపిఎ సర్వీస్)**

# కవిత తిరిగి క్రియాశీలమవడం వెనుక...

బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ తనయ, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ఇటీవల రాజకీయంగా క్రియాశీలమవుతున్నారు. దాదాపు తొమ్మిది నెలల విరామం తరువాత ఆమె జనాలలోకి వెళ్తున్నారు. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో ఆమె గత ఏడాది మార్చి 15న అరెస్టై తీహార్ జైలులో సుమారు ఆరు నెలలు జైలు జీవితం గడిపారు. అనేక ప్రయత్నాల తరువాత ఎట్టకేలకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆగస్టు 27న విడుదలయ్యారు. హైదరాబాద్‌కు వచ్చాక చాలా కాలం ప్రధాన స్రవంతికి దూరంగా ఉన్నారు. గడిచిన కొద్ది రోజులుగా ఆమె క్రియాశీలమవుతుండడం పట్ల రాజకీయ వర్గాలలో ఆసక్తి నెలకొంది. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ జాగృతి సంస్థ పేరుతో కవిత సమాంతర ఉద్యమాన్ని నడిపి తనదైన గుర్తింపును పొందారు. ఆ తరువాత 2014లో నిజామాబాద్ నుంచి ఎంపిగా గెలిచినప్పటికీ 2019లో మాత్రం ఓటమి దక్కింది. కొద్ది రోజులకే నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి కవితను శాసనమండలికి పంపారు బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్. రాష్ట్ర వ్యాప్తంగా జాగృతి కార్యకలాపాలతో ఆమె తన కంటూ పెద్ద ఎత్తున అనుచరగణాన్ని, అభిమానులను సంపాదించుకోగలిగారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఓడిపోయాక సిబిఐ, ఇడి కేసుల్లో ఇరుక్కోవడంతో కాస్త వెనకపడ్డారు. తన అరెస్టుకు కొద్ది మాసాల ముందు చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ కల్పించాలని కార్యక్రమాలు చేపట్టారు కవిత. మహిళా రిజర్వేషన్‌ల కోసం ఎవరు కృషి చేసినా మంచిదే. అసలు మహిళా రిజర్వేషన్‌ల కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు, సీనియర్ పార్లమెంటేరియన్ గీతా ముఖర్జీ చేసిన పోరాటం చిరస్మరణీయమైనది. ఆమె నేతృత్వంలో పార్లమెంటరీ కమిటీ చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ కోసం సిఫార్సు చేసింది. ఆమె మహిళా బిల్లు కోసం ప్రధాని ఐ.కె.గుజ్రాల్ మంత్రివర్గంలో కూడా చేరే అవకాశాన్ని కూడా తిరస్కరించారు. 1997లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆ బిల్లును ఆమె తీవ్రంగా వత్తిడి చేసి లోక్‌సభలో పెట్టించేందుకు అంగీకరింపజేశారు. ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించిన గీతా ముఖర్జీ, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ లేనప్పుడు లోక్‌సభలో ఆ స్థానంలో ఉండి సభను నిర్వహించే అవకాశం దక్కగా, ఆమె అకస్మాత్తుగా మహిళా రిజర్వేషన్ బిల్లును చర్చకు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే, అది జాబితాలో 24వ అంశమని, అందువల్ల ఆకస్మిక చర్యకు బిజెపి సభ్యులు అభ్యంతరం చెప్పడంతో నిరాశతో పక్కకు పెట్టాల్సి వచ్చింది. జీవితాంతం మహిళా రిజర్వేషన్ కోసం పదవులను సైతం తృణప్రాయంగా వదులుకున్న గొప్ప నాయకురాలు గీతా ముఖర్జీ.




ఇక మహిళా రిజర్వేషన్ కోసం కవిత అప్పట్లో ఢిల్లీలో సైతం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ బిల్లు కోసం జరిగిన చారిత్రాత్మక ఉద్యమంతో ఆమె మమేకమయ్యేందుకు ప్రయత్నించారు. కవిత తాజాగా బిసి రిజర్వేషన్‌ల పెంపు అంశాన్ని లేవనెత్తుతున్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వకపోతే ఊరుకోబోమని సావిత్రిబాయి పూలే జయంతి రోజున ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన బిసి మహాసభలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గతంలో కాంగ్రెస్ 'కామారెడ్డి డిక్లరేషన్' పేరుతో బిసిలకు ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. చాలా కాలం మౌనంగా ఉన్న కవిత ఒక్కసారిగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. జైలు నుంచి విడుదలయ్యాక మొదటిసారి గత వారమే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు కవిత. ఇప్పుడు బిసి ఉద్యమాన్ని ఎత్తుకున్నారు. బిఆర్‌ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ శాసనసభకు , జనబాహుళ్యంలోకి రావడం లేదు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా ఈ– కార్ రేసు కేసులో ఇడి, ఎసిబి విచారణలను ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఏ క్షణంలో ఏమవుతుందోననే ఆందోళన ఆ పార్టీలో ఉంది. ఒకవేళ అరెస్టు జరిగితే పార్టీ తరుపున బలమైన గొంతుకగా ఉండేందుకే కవిత ఇటీవల కాలంలో చురుకుగా ఉంటున్నారనే ప్రచారం సాగుతోంది. కవిత మంచి వక్త. జనాకర్షణ కలిగిన నేత. అయితే ఆమె లేవనెత్తిన మహిళా రిజర్వేషన్, బిసి రిజర్వేషన్‌లు సంబంధించి గతంలో బిఆర్‌ఎస్ వ్యవహరించిన తీరు కారణంగా విశ్వసనీయత అంశం ఇప్పుడు తెరపైకి వస్తోంది. గతంలో కెసిఆర్ రెండవసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత ఎన్నో రోజులకు గాని మహిళలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించకపోవడాన్ని ప్రత్యర్థి పార్టీలు గుర్తు చేస్తున్నాయి. ఇప్పుడు బిఆర్‌ఎస్ అధ్యక్ష పదవి లేదా ప్రతిపక్ష నేత పదవి బిసిలకు ఇస్తారా? అని అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సూటిగా సవాలు విసురుతున్నారు. ప్రస్తుతం పిసిసి అధ్యక్షుడిగా బిసి నేత ఉన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా ఎక్కువగా బిసిలే పనిచేశారు. త్వరలో బిజెపి కొత్త రాష్ట్ర అధ్యక్షుడిని సైతం బిసి వర్గాల నుంచే ఎంపిక చేస్తారనే వార్తలు వెలువడుతున్నాయి. శాసనమండలి ప్రతిపక్ష నేత పదవిని బిసి వర్గానికి చెందిన మధుసూదనాచారికి కట్టబెట్టినప్పటికీ, అధ్యక్ష పదవిని బిసికి కట్టబెట్టే విషయంలో కాంగ్రెస్, బిసిల నుంచి ఎదురవుతున్న సవాలుకు ప్రస్తుతమైతే బిఆర్‌ఎస్ వద్ద సమాధానం లేదు. గడ్డు పరిస్థితుల మధ్య ఎంఎల్‌సి కవిత ఎత్తుకున్న బిసి వాదం ఎంత వరకు ఆమె భవిష్యత్తు రాజకీయాలకు ఉపకరిస్తుందో వేచి చూడాల్సిందే!

# పక్షుల పరిరక్షణతోనే పర్యావరణ ఆరోగ్యం

పర్యావరణానికి ఇంద్రధనుస్సు రంగుల అందాలను అద్దుతూ, ఆకాశ మార్గాన కలియ తిరుగుతూ, జీవ జాతిలో ప్రత్యేకతను సంతరించుకున్న పక్షులు విశ్వ జీవరాసులతో సహజీవనం చేస్తూ, మానవాళి జీవితాలతో అనుబంధాన్ని పెంచుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10,000 రకాల పక్షి జాతులు అడవుల్లో, మానవ ఆవాసాల్లో సంచరిస్తున్నాయి. దురదృష్టకరంగా పక్షి జాతిలో కొన్ని రకాలైన పక్షులు అంతరించే అంచున ఉన్నట్లు, కొన్ని రకాలైన పక్షులు అంతరించిపోయాయనే వార్త మానవాళికి హెచ్చరికగా నిలుస్తున్నది. మిలియన్ల పక్షులను వేటగాళ్లు, స్మగ్లర్లు, గిరిజన జాతులు తమ స్వలాభంకోసం పట్టుకొని ఆహారం లేదా అవయవాల నిమిత్తం చంపివేయడం గమనిస్తున్నాం. పక్షుల వల్ల జీవ వైవిధ్య పరిరక్షణ, ఫలదీకరణానికి అవసరమైన పుప్పొడి వితరణ, విత్తనాలను విస్తరించడం, పంటలకు హానిచేసే క్రిమి కీటకాలను అదుపు చేయడం, వ్యాధుల కట్టడి, సాదు పక్షులతో సంబరాలు, ఆహార పదార్థాలు, వార్తాహరులు, పర్యావరణ సమతుల్యత లాంటి ప్రధానమైన ప్రయోజనాలు ఉన్నాయి.

**జాతీయ పక్షుల దినం–2025:** పర్యావరణ పరిరక్షణలో పక్షుల ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడానికి ప్రతి ఏట 05 జనవరి రోజున జాతీయ పక్షుల దినం (నేషనల్ బర్డ్స్ డే) పాటించడం 2002 నుంచి ఆనవాయితీగా మారింది. పక్షుల ఆవాసాల విధ్వంసం, అక్రమ వ్యాపారంకోసం వేట, వాతావరణ ప్రతికూల మార్పులను అవగాహన పరచడానికి ఈ వేదిక ఎంతగానో ప్రయోజకారిగా నిలుస్తున్నది. జాతీయ పక్షుల దినం రోజున పక్షుల పార్కుల సందర్శన, పక్షులకు ఆహారం వేయడం, పక్షుల కిలకిలారావాలను వినడం, పక్షుల సంరక్షణ ప్రాధాన్యాన్ని వివరించే ఆర్ట్స్ పోటీలు నిర్వహించడం, పక్షులకు సంబంధించిన పుస్తకాలు చదవడం, అరుదైన పక్షి జాతులను గూర్చి తెలుసుకోవడం జరుగుతుంది.

**భారత్‌లో పక్షుల పరిరక్షణ చర్యలు:** భారతీయ సంస్కృతిలో పలు రకాలైన పక్షి జాతులకు ప్రత్యేక స్థానం కల్పించబడింది. భారత జాతీయ పక్షిగా అందమైన నెమలికి ప్రత్యేకత కల్పించబడింది. భారత దేశవ్యాప్తంగా పక్షుల సంరక్షణ చర్యల్లో భాగంగా 72 పక్షుల అభయారణ్యాలు 1,120 రకాల పక్షి జాతులకు ఆవాసాలుగా విలువైన పాత్రను పోషిస్తున్నాయి. పక్షుల సంరక్షణరంగంలో తన జీవితాన్ని అర్పించి కృషి చేస్తున్న పక్షి ప్రేమికులు అనేకులు ఉన్నారు. వీరిలో అగ్రగణ్యుడిగా డా సలీం అలీ నిలిచి 'బర్డ్‌మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరు తెచ్చుకున్నారు. భారతీయ సంస్కృతిలో గరుడ, గండబేరుండ, పావురాలు, నెమలి, జటాయువు, హంస, రామచిలుక లాంటి పలు రకాలైన పక్షులు పురాణ ఇతిహాసాల్లో పూజ్యనీయ స్థానాన్ని ఆక్రమించడం హర్షదాయకం.

**ఆసక్తికర అంశాలు:** పెంగ్విన్ పక్షులు ఎగురలేనప్పటికీ, అవి నీటిలో అద్భుతంగా ఈదగలవు. గుడ్లగూబలు తమ తలను 270 డిగ్రీలు తిప్పి వెనుక ఉన్న దృశ్యాలను చూడగలవు. పక్షి జాతిలో అత్యంత పెద్దదైన ఉష్ట్రపక్షి ఎగరలేదు, కాని గంటకు 60 మైళ్ల వేగంతో పరుగెత్తగలవు. మానవ సమాజానికి దగ్గరగా నివసిస్తున్న పక్షి జాతులతో కాపాడుతూ, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ప్రతి ఒక్కరు తెలుసుకుందాం,

*(05 జనవరి జాతీయ పక్షుల దినం సందర్భంగా)*

# చత్తీస్‌గఢ్‌లో జర్నలిస్ట్ హత్య

ముగ్గురి అరెస్ట్-పరారీలో ప్రధాన నిందితుడు

ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించినట్లు డిప్యూటీ సిఎం విజయ్‌శర్మ వెల్లడి

హత్యను ఖండించిన ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా

**రాయ్‌పూర్ :** చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ హత్యకు సంబంధించి శనివారం ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను నియమించినట్లు ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ ప్రకటించారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు కాంగ్రెస్ నాయకుడని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అయిన 33ఏళ్ల చంద్రకర్ జనవరి 1న అదృశ్యమయ్యాడని, ఆయన మృతదేహం శుక్రవారం నాడు ఒక సెప్టిక్ ట్యాంక్‌లో కనుగొనబడిందని చెప్పారు. అది బీజపూర్ పట్టణంలోని చత్తన్‌పరా వద్ద ఉన్నటువంటి సివిల్ కాంట్రాక్టర్ సురేష్ చంద్రాకర్ సొంత ప్రాపర్టీ అని పోలీసులు తెలియజేశారు. సురేష్ చంద్రకర్ పరారీలో ఉండగా, అతడి బంధువులైన రితేష్ చంద్రకర్, దినేష్ చంద్రకర్‌తో పాటు సూపర్‌వైజర్ మహేంద్ర రామ్‌టెకేను అరెస్ట్ చేసినట్లు డిప్యూటీ సిఎం విజయ్‌శర్మ విలేకరులకు తెలిపారు. 'ఈ హత్య కేసులో సురేష్ చంద్రకర్ ప్రధాన నిందితుడు. ఆయన ఒక కాంగ్రెస్ నాయకుడు. బీజాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ బేరర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. అతడిని పట్టుకునేందుకు నాలుగు పోలీస్ బృందాలను నియమించాం. అతడి బ్యాంక్ అకౌంట్లు, ఇతర నిందితుల బ్యాంక్ అకౌంట్లు కూడా స్తంభింపజేసే ప్రక్రియ ప్రారంభమైనది. సురేష్ చంద్రకర్ మూడు అకౌంట్లను నిలిపివేశాం' అని ఉపముఖ్యమంత్రి శర్మ చెప్పారు. అంతేకాకుండా పరిపాలనా యంత్రాంగం నిందితుల అక్రమ ఆస్తులు, అక్రమ ఆక్రమణలపై కూడా చర్యలు చేపట్టినట్లు విజయ్‌శర్మ విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ మావోయిస్ట్ ప్రాబల్యం ఉన్న మారుమూల ప్రాంతాలపై, స్థానిక సమస్యలపై లోతైన రిపోర్టింగ్ చేశారని ఉపముఖ్యమంత్రి విజయ్‌శర్మ ప్రశంసించారు. 'జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ హత్య బస్తర్ ప్రాంతంలో తీవ్రకలకలం సృష్టించిందని, ఆయన ఆ ప్రాంతంలో శాంతి కోసం చేసిన ప్రయత్నాలు అభినందించదగినవి. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఐపిఎస్ అధికారి మయాంక్ గుర్జార్ సారథ్యంలో 11మంది సభ్యులతో కూడిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను నియమించింది.34వారాలలో పోలీసులు చార్జిషీట్‌ను అందజేయనున్నారు. అత్యంత శీఘ్రగతిన విచారణ కొనసాగించాలని మేం కోర్టును కోరుతున్నాం' అని ఉపముఖ్యమంత్రి విజయ్‌శర్మ తెలియజేశారు. బీజాపూర్‌గంగలూరు రోడ్డు వెంబడి ఉన్న అటవీ భూమి తర్వాత సురేష్ చంద్రకర్ నిర్మించిన ఒక నిర్మాణ సామాగ్రి యార్డ్, స్థానిక అధికారులు తెలిపారు. బీజాపూర్‌లో జరిగిన రోడ్డు నిర్మాణ పనుల్లో అవినీతి చోటుచేసుకున్నదని ఆరోపిస్తూ ఒక వార్తా కథనం గత ఏడాది డిసెంబరు 25న ఎన్‌డిటివిలో ప్రసారం అయ్యింది. ముఖేష్ చంద్రకర్ హత్య వెనక ఈ ఉద్దేశమే దాగిఉందని ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఎన్‌డిటివిలో వార్తా కథనం ప్రసారమైన అనంతరం పిడబ్ల్యుడి విచారణ ప్రారంభమైందని శర్మ చెప్పారు. ముఖేష్ చంద్రకర్ ఇటీవల అక్రమాలను ఎత్తిచూపిన నిర్మాణ పనుల్లో సురేష్‌చంద్రకర్ నిమగ్నమై ఉన్నారని పోలీస్ అధికారులు తెలిపారు. ముఖేష్ చంద్రకర్ ఎన్‌డిటివితో సహా ఇతర వార్తా



చానెళ్లకు ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా పనిచేశాడు. 1.59లక్షల మంది సబ్‌స్క్రైబర్లు కలిగి ఉన్నటువంటి బస్తర్ జంక్షన్ అనే యూట్యూబ్ చానెల్‌ను ఆయన నడుపుతున్నాడు. 22మంది భద్రతా సిబ్బంది అమరులైన తకల్‌గూడ నక్సల్ ఆకస్మిక దాడి తర్వా త ఏప్రిల్ 2021న మావోయిస్ట్ చెరనుండి కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హాస్‌ను విడుదల చేయడంలో ముఖేష్ చంద్రకర్ కీలక పాత్ర పోషించాడు. జనవరి 1వ తేదీ సాయంత్రం ముఖేష్ చంద్రకర్ కనిపించకుండా పోవడంతో అతడి అన్న యుఖేష్ చంద్రకర్ మరుసటి రోజైన జనవరి 2న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముఖేష్ చంద్రకర్ మొబైల్ ఫోన్‌ను ట్రాక్‌చేయగా సురేష్‌చంద్రకర్ యాజమాన్యంలోని ఆవరణలోని సెప్టిక్‌ట్యాంక్‌లో మృతదేహం కనుగొనబడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సెప్టిక్‌ట్యాంక్‌ను కాంక్రీట్ శ్లాబ్‌లతో తాజాగా పోశారు. ముఖేష్ చంద్రకర్ హత్యను శనివారం ప్రెస్ అసోసియేషన్, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) ఖండించాయి. చత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసుపై సమగ్ర దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశాయి. ఇక్కడ విడుదల చేసిన వేరొక ప్రకటనలో ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా, భారతీయ మహిళా ప్రెస్ కార్ప్స్ నిందితులపై కాల పరిమితితో కూడిన చర్య తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

## జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ దారుణహత్య పట్ల ఐజెయు నేతల దిగ్భ్రాంతి

వేగవంతంగా విచారణ జరిపించి న్యాయం చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** ఛత్తీస్‌ఘడ్‌లో జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ దారుణహత్య పట్ల ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. చంద్రకర్ హత్యకు పాల్పడిన వారిని న్యాయస్థానం ముందుకు తీసుకురావడానికి వేగవంతంగా విచారణ జరిపించి న్యాయం చేయాలని ఐజెయు అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ బల్విందర్‌సింగ్ జమ్మూ డిమాండ్ చేశారు. అవినీతి, గిరిజన సమస్యలపై అనేక ప్రచురణలకు రాయడంతో పాటు బస్తర్ జంక్షన్ అనే ప్రముఖ ఛానెల్‌ను నడుపుతున్నయూట్యూబర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ ఈ నెల 1వ తేదీ నుంచి అదృశ్యమయ్యారని, బీజాపూర్ పట్టణంలో ప్రభుత్వ పనులను నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు చెందిన ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్ నుండి చంద్రకర్ మృతదేహాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారని వారు తెలిపారు. జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సబ్ కమిటీ సిఫార్సు చేసిందని వారు తెలిపారు. బాధిత కుటుంబానికి ఐజెయు నేతలు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## కొందరు కులం పేరుతో సమాజంలో విషం వ్యాప్తి : మోదీ

**న్యూఢిల్లీ :** సమాజంలో కులం విషాన్ని వ్యాప్తి చేస్తున్న ప్రతిపక్షాలపై ప్రధానమంత్రి శనివారం విమర్శలదాడితో విరుచుకుపడ్డారు. గ్రామాల ఉమ్మడి సంస్కృతి, వారసత్వాన్ని బలోపేతం చేసే ఉద్దేశంతో ఇటువంటి కుట్రలను తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక్కడ 'గ్రామీణ భారత్ మహోత్సవాన్ని' ప్రారంభించిన అనంత రం ప్రధాని మోదీ మాట్లాడుతూ తమ ప్రభుత్వం—2 నుంచి గ్రామీణాభివృద్ధిపై దృష్టిసారిస్తోం దన్నాకాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, ఇతర ఇండియా కూటమి నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ ఒక వ్యక్తి ప్రస్తావనతో మరికొంతమంది వ్యక్తులు సమాజంలో విషాన్ని కులంలో వ్యాప్తిచేయడం ద్వారా, కల్పితాల సృష్టి ద్వారా సమాజాన్ని బలహీనపర్చడానికి తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మన అందరం ఈ కుట్రలను తిప్పికొట్టాలని, మన గ్రామాల ఉమ్మడి వారసత్వాన్ని బలోపేతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## కేజ్రీవాల్ మరో హామీ

ఢిల్లీ వాసులు తప్పుడు నీటి బిల్లులను చెల్లించొద్దు

తాము అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని ఆప్ కన్వీనర్ ప్రకటన



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండడంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రోజుకో పథకాన్ని ప్రకటిస్తూ ప్రజలకు హామీల వర్షం కురిపిస్తోంది. ఢిల్లీ వాసులకు తప్పుడు నీటి బిల్లులు వస్తే వాటిని కట్టవద్దని, ఆప్ ప్రభుత్వం 2025లో తిరిగి అధికారంలోకి రాగానే ఆ బిల్లులను రద్దు చేస్తుందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరో కీలక హామీ ఇచ్చారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'గత పదేళ్లుగా మా ప్రభుత్వం ఢిల్లీలో ఉచిత నీటిని అందిస్తోంది. 12 లక్షలకు పైగా కుటుంబాలకు జీరో వాటర్ బిల్లులు వస్తున్నాయి. అయితే నేను జైలుకు వెళ్లాక ఏమి జరిగిందో నాకు తెలియదు. వాళ్లు ఏదో తప్పు చేశారు. ప్రజలకు వేలు, లక్షల్లో ప్రతినెలా నీటి బిల్లులు వస్తున్నాయి. తప్పుడు బిల్లులు వస్తున్నాయని అనుకుంటున్న వాళ్లు నీటి బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని నేను బహిరంగంగా, అధికారికంగా ప్రకటిస్తున్నాను. ఓపికతో వేచిచూడండి. ఎన్నికల తర్వాత ఆప్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తప్పుడు బిల్లులన్నింటినీ రద్దు చేస్తుంది. ప్రజలందరికీ ఇది నా హామీ.. ఇందుకు నేను గ్యారెంటీ' అని కేజ్రీవాల్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పిస్తూ, ఆ పార్టీ ప్రజలకు దూరమైందని, ప్రజాసమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి కొరవడిందని అన్నారు. కాంగ్రెస్, బిజెపి రెండు ప్రజావిశ్వాసం కోల్పోయినందున వారు కూటమిగా ఏర్పడాలని సూచించారు. కాంగ్రెస్ ఊసే ప్రజలు ఎత్తడం లేదన్నారు. ఢిల్లీలో బిజెపి విపత్తులో ఉందని, ఆ పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థి కానీ, ఎజెండా కానీ, ఒక విజన్ కానీ లేవని విమర్శించారు.

## ఆర్మీ వాహనం లోయలో పడి ముగ్గురు సైనికులు మృతి



**శ్రీనగర్ :** జమ్మూ కశ్మీర్‌లోని బందిపొర జిల్లాలో ఆర్మీ వాహనం అదుపుతప్పి లోయలో పడిపోవడంతో ముగ్గురు ఆర్మీ సిబ్బంది మృతి చెందగా, ఇద్దరు గాయపడినట్లు అధికారులు శనివారం తె లిపారు. ఉత్తర కశ్మీర్ జిల్లాలోని ఎస్‌కె పాయెన్ సమీపంలో ఆర్మీ వాహనం రోడ్డుపై నుంచి జారిప డి లోయలో పడిపోయిందని వారు తెలిపారు. ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు గా యపడ్డారని అధికారులు తెలిపారు. బందిపోరా జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇండియన్ ఆర్మీ వాహనం లోయలో పడిపోయిందని ఆర్మీకి చెందిన చినార్ కారప్స్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు. 'గాయపడిన సైనికులను కశ్మీరీ స్థానికుల సహాయంతో వెంటనే వైద్య సంరక్షణ కోసం తరలించారని, దీని కోసం తక్షణ సహాయాన్ని అందించిన పౌరులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము' అని వారు ఎక్స్‌లో పోస్ట్‌లో తెలిపారు. 'దురదృష్టవశాత్తూ ప్రమాదంలో ముగ్గురు ధైర్యవంతులు ప్రాణాలు కోల్పోయారు. భారత సైన్యం మృతుల కుటుంబాలకు హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తుంది' అనిఆర్మీ తెలిపిం

## మణిపూర్ అల్లర్ల వెనుక బిజెపికి స్వప్రయోజనాలు

రాజధర్మం పాటించని ప్రధాని మోదీ తప్పించుకోలేరు:ఖర్గే



**న్యూఢిల్లీ :** మణపూర్‌లో గత ఏడాదిన్నర కాలం నుంచి హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. తాజాగా మరోసారి హింస చెలరేగిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాని నరేంద్రమోదీపై విరుచుకుపడింది. రాజధర్మం పాటించనందున రాజ్యాంగపరమైన అపరాధం నుంచి మోదీ తప్పించుకోలేరని పేర్కొంది. మణిపూర్ నిరంతరం హింసాత్మక ఘటనలతో రగులుతుండటం వెనుక బిజెపికి స్వప్రయోజనాలు ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. బిజెపి మ్యాచ్‌స్టిక్‌తో మణిపూర్ రగులుతోందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం ఆరోపించారు. మణిపూర్‌లో తాజా హింసాత్మక ఘటనకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను కూడా ఆయన షేర్ చేశారు. 'నరేంద్ర మోదీ జీ.. మీరు చివరిసారిగా ఓట్లు అడిగేందుకు 2022 జనవరిలో మణిపూర్ వెళ్లారు. 2023 మేలో హింసాత్మక ఘటనలు మొదలయ్యాయి. 600 రోజుల గడిచిపోయాయి. రాష్ట్రంలో ఒక్కో గ్రామం తుడిచిపెట్టుకుపోతోందని శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా మీడియా కథనాల్లో వెల్లడవుతోంది. మీ అసమర్థ ముఖ్యమంత్రి రాష్ట్రంలో హింసాకాండకు క్షమించమని అడుగుతుంటారు. మీరు రాష్ట్రానికి రాకపోవడాన్ని మాత్రం ఆయన దాటవేస్తుంటారు'' అని ఖర్గే అన్నారు. మణిపూర్ విషయంలో బిజెపి స్వప్రయోజనాలు చూసుకుంటోందని పదేపదే తాము బాధ్యతాయుతంగా చెబుతూ ఉన్నామని ఖర్గే తెలిపారు. మణిపూర్ హింసాకాండలో 250 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారని, 20 నెలలుగా వారు తాత్కాలిక శిబిరాల్లోనే జీవనం సాగిస్తున్నారని అన్నారు. మణిపూర్‌లో శాంతి, యథాపూర్వ పరిస్థితి నెలకొనేలా చూడటం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతని సుప్రీం కోర్టు సైతం స్పష్టం చేసినట్టు తెలిపారు. 'మణిపూర్‌లో ఇండియా కూటమి సైతం డిసెంబర్ 6న మీకు (ప్రధానికి) మూడు విజ్ఞప్తులు చేసింది. 2024 ముగిసేలోపు మణిపూర్‌ను సందర్శించాలని కోరాం. కానీ మీరు ఆపని చేయలేదు. అఖిల పక్ష నేతలతో ఢిల్లీలోని మీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయమని విజ్ఞప్తి చేశాం. అది కూడా చేయలేదు. మణిపూర్ అంశాన్ని నేరుగా మీరే చూసుకోవాలని కోరాం. ఆ పని కూడా చేసినట్టు కనిపించడం లేదు. మా విజ్ఞప్తుల్లో ఒక్కటైనా పట్టించుకోకుంటే మీరు రాజధర్మాన్ని పాటించనట్టే అవుతుంది. రాజ్యాంగ తప్పిదం నుంచి మీరు తప్పించుకోలేరు' అని ఖర్గే ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## బాణసంచా తయారీ పరిశ్రమలో పేలుడు

ఆరుగురు కార్మికులు మృతి

**చెన్నై:** తమిళనాడులో బాణసంచా కర్మాగారంలో పేలుడు సంభవించిన ఘటనలో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. పేలుడు ధాటికి కర్మాగార భవనంలోని కొన్ని గదులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. విరుద్‌నగర్‌లోని సాయినాథ్ బాణసంచా తయారీ కేంద్రంలో శనివారం ఉదయం ఒక్కసారిగా పేలుడు సంభవించింది. చుట్టుపక్కల ఒకటిన్నర కిలోమీటర్ల దూరం వరకు పేలుడు శబ్ధాలు వినిపించాయి. నాలుగు గదులు నేలమట్టమయ్యాయి. ఆ గదుల్లో ఉన్న ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, పలువురు గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందిన వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. శిథిలాల కింద ఉన్న మృతదేహాలను స్వాధీనం చేసుకుని శవ పరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రసాయనాలను కలిపే ప్రక్రియలో పేలుడు సంభవించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సాయినాథ్ ఫైర్ వరక్స్ పేరుతో బాలాజీ అనే వ్యక్తి ఈ ఫ్యాక్టరీని నడుపుతున్నాడు. నిర్లక్ష్యం, సరైన భద్రత లేకుండా కార్మికులను పనిలో పెట్టుకున్నందుకు ఫ్యాక్టరీ యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలాజీ, శశిబాలన్, మేనేజర్ దాస్ ప్రకాశ్ సహా నలుగురిపై 5 సెక్షన్ల కింద కేసు నమోదైంది. మరోవైపు, ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల, గాయపడిన వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు.

## గ్యాస్ వ్యర్థాల దహన యూనిట్‌పై రాళ్లదాడి



**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని భోపాల్ గ్యాస్ దుర్ఘటన దేశ చరిత్రలో అత్యంత విషాదకరమైంది. ఈ ఘటన తర్వాత యూనియన్ కార్బైడ్ సంస్థ ఆవరణలోని 377 టన్నుల విష పదార్థాల తరలింపు చర్య మొదలైంది. ఈ వ్యర్థాలను దహనం చేసేందుకు ఉద్దేశించిన యూనిట్‌పై కొంతమంది రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులు వెల్లడించారు. ఇండోర్ సమీపంలోని పితాంపుర్ పారిశ్రామికవాడలో వ్యర్థాలను దహనం చేసే యూనిట్‌పై వంద మందికి పైగా దాడికి పాల్పడ్డారు. యూనిట్ గేట్‌పై రాళ్లు రువ్వారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ దిశగా విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. 1984 డిసెంబరు 2 అర్ధరాత్రి దాటిన తర్వాత భోపాల్ నగర శివారులోని యూనియన్ కార్బైడ్ పురుగు మందుల కర్మాగారంలోని ట్యాంకు నుంచి 4045 టన్నుల అత్యంత ప్రమాదకర మిథైల్ ఐసోసైనేట్ (ఎంఐసి) వాయువు లీకైన సంగతి తెలిసిందే. దీని కారణంగా వేల మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 6 లక్షల మంది అస్వస్థతకు గురయ్యారు. ఆ ఘటన తర్వాత యూనియన్ క్యార్బైడ్ సంస్థ ఆవరణలో దాదాపు 40 ఏళ్లుగా పడి ఉన్న 377 టన్నుల విష పదార్థాల తరలించే కార్యక్రమం మొదలైంది. జిపిఎస్ అమర్చిన ట్రక్కులు, అత్యంత పకడ్బందీగా తయారు చేసిన కంటైనర్లలో వీటిని పీథంపుర్ పారిశ్రామికవాడలోని యూనిట్‌కు తరలించే కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటికే పిపిఇ కిట్లు ధరించిన సిబ్బంది, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వైద్యులు, నిపుణులు అక్కడికి చేరుకున్నారు. దహనం చేసేందుకు ఏర్పాట్లు కొనసాగుతుండగా.. ఓ గుంపు యూనిట్‌పై రాళ్ల దాడికి దిగింది.

## కేజ్రీవాల్‌పై మాజీ ఎంపి పర్వేష్ పోటీ

29 అభ్యర్థులతో ఢిల్లీలో బిజెపి తొలి జాబితా విడుదల



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రాజకీయం వేడెక్కింది. ఇప్పటికే అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), కాంగ్రెస్‌లు అభ్యర్థుల జాబితాను విడుదల చేయగా, తాజాగా బిజెపి కూడా జాబితా ప్రకటించింది. తొలి జాబితాలో 29 మంది అభ్యర్థులను కాషాయపార్టీ పోటీకి దింపింది. ఢిల్లీ మాజీ సిఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై న్యూఢిల్లీ సీటు నుంచి మాజీ ఎంపి పర్వేష్ వర్మ పోటీ చేయనున్నారు. అదే విధంగా కల్కాజీ స్థానం నుంచి ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అభ్యర్థి అతిశీపై మరో బిజెపి మాజీ ఎంపి రమేష్ బిధూరి బరిలోకి దిగనున్నారు. న్యూఢిల్లీ స్థానం నుంచి కేజ్రీవాల్ 2013 నుంచి పోటీ చేస్తున్నారు. వర్మ 1990 దశకంలో రెండు సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడు. పశ్చిమ ఢిల్లీ మాజీ ఎంపి వర్మ తనను అధికారిక అభ్యర్థిగా ప్రకటించకముందే ఆ స్థానం నుంచి పోటీ చేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టారని, జాతీయ నేతలు తనకు అనుమతి ఇచ్చారని చెప్పారు. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ బరిలో నిలిచారు. ఇటీవలి నెలల్లో కాంగ్రెస్, ఆప్ నుండి మారిన ఎనిమిది మంది ప్రముఖ నాయకులకు బిజెపి మొదటి జాబితాలో స్థానం లభించింది. తూర్పు ఢిల్లీలోని గాంధీ నగర్ స్థానం నుంచి ప్రస్తుత బిజెపి ఎమ్మెల్యే అనిల్ బాజ్‌పాయ్‌ను తప్పించి ఢిల్లీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అరవిందర్ సింగ్ లవ్లీకు టిక్కెట్ ఇచ్చారు. 2022లో బిజెపిలో చేరిన జంగ్‌పురా నుండి మూడుసార్లు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అయిన తర్విందర్ సింగ్ మార్వా అదే స్థానం నుండి పోటీ చేయనున్నారు. ఆయన ఆప్ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో పోటీ పడుతున్నారు. బిజ్వాసన్ నుంచి మాజీ రవాణా మంత్రి కైలాష్ గహ్లోట్ బరిలో నిలిచారు. రెండుసార్లు నజాఫ్‌గఢ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన మంత్రి పదవికి రాజీనామా చేసి, నవంబర్‌లో బిజెపిలో చేరడానికి ఆప్‌ని విడిచిపెట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో మంత్రి పదవికి రాజీనామా చేసి, ఆప్‌ని వీడిన రాజ్ కుమార్ ఆనంద్ పటేల్ నగర్ స్థానం నుంచి పోటీకి దిగారు. ఆప్ నుంచి కాషాయ పార్టీలోకి మారిన ఛతర్‌పూర్ ఎమ్మెల్యే కర్తార్ సింగ్ కూడా అదే స్థానం నుంచి బరిలోకి దిగారు. మరో ఆప్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌డి శర్మ బదర్‌పూర్ నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. కాషాయ పార్టీ తన జాతీయ ఆఫీస్ బేరర్లు దుష్యంత్ కుమార్ గౌతమ్, ఆశిష్ సూద్‌లను వరుసగా కరోల్ బాగ్, జనక్‌పురి స్థానాల నుండి పోటీకి దింపింది. బిజెపి జాతీయ కార్యదర్శి మంజీందర్ సింగ్ సిర్సా 2015 ఎన్నికల్లో గెలిచిన రాజౌరీ గార్డెన్ నుంచి పోటీ చేయనున్నారు. సీమాపురి నుంచి బిజెపి అభ్యర్థిగా కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ కుమారి రింకూ పోటీ చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు ఒపి శర్మ (విశ్వాస్ నగర్), అసెంబ్లీలో ప్రతిపక్ష నేత విజేందర్ గుప్తా (రోహిణి), అజయ్ మహావార్ (ఘోండా), జితేంద్ర మహాజన్ (రోహతాష్ నగర్)లను కూడా బిజెపి పోటీకి దింపింది. 2020 ఎన్నికల్లో గెలిచిన లక్ష్మీ నగర్, కరవాల్ నగర్ స్థానాలకు పార్టీ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. ఢిల్లీ బిజెపి మాజీ అధ్యక్షుడు సతీష్ ఉపాధ్యాయ్ మాలవీయ నగర్ నుంచి పోటీ చేయనున్నారు. నాంగ్లోయ్ జాట్ స్థానం నుంచి ఢిల్లీ మంత్రి రఘువీందర్ షోకీన్‌పై మాజీ ఎమ్మెల్యే మనోజ్ షోకీన్‌ను పార్టీ పోటీకి దింపింది.

## అమెరికా దిగువసభలో ఆరుగురు భారత సంతతి సభ్యులు ప్రమాణ స్వీకారం



**వాషింగ్టన్ :** అమెరికా దిగువసభలో శనివారంనాడు భారత సంతతికి చెందిన ఆరుగురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మొట్టమొదటిసారి మైనారిటీగా ఉన్న భారత సంతతికి చెందిన నాయకులు ఎక్కువమంది అమెరికా ప్రతినిధులసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయడం విశేషం. నవంబరు ఎన్నికల అనంతరం 119వ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. 20వ తేదీ ట్రంప్ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందుగా ఎంపీల ప్రమాణ స్వీకారోత్సవ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా చట్టసభకు ఎన్నికైన భారత సంతతికి చెందిన ఆరుగురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. 1957లో మొదటిసారి భారత్‌కు చెందిన సిక్కు మతస్థుడు దలిప్ సింగ్ సంద్ అమెరికా దిగువసభలో సభ్యుడయ్యారు. ఆయన డెమొక్రటిక్‌పార్టీ తరపున వరుసగా మూడుసార్లు గెలిచారు. దిగువసభలో భారత సంతతికి చెందిన రెండో సభ్యుడు బాబీ జిందాల్ (2005–2008)ప్రమాణ స్వీకారం చేయడానికి యాభై సంవత్సరాలు పట్టింది. తర్వాత జిందాల్ రెండుసార్లు లూయిసియాకు గవర్నర్‌గా పనిచేశారు. ఆయన రిపబ్లికన్‌పార్టీ తరపున గెలిచారు.

12 సంవత్సరాలక్రితం దిగువసభలో సభ్యుడుగా మొడా.అమి బేరా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ రోజున ఆయనతోపాటు మరో ఐదుగురు భారత సంతతి నాయకులు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ విషయాన్నే ఆయన ఎంతో ఆనందంగా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. దిగువసభలో భారత సంతతి నాయకులలో ఇప్పుడు బేరా అందరికంటే సీనియర్ సభ్యుడు. ప్రమాణ స్వీకారం చేసినవారిలో సుహాశ్ సుబ్రమణియన్, శ్రీథానేదార్, రో ఖన్నా, ప్రమీలా జయపాల్, కృష్ణమూర్తి ఉన్నారు.

**ప్రమాణ స్వీకారంలో తడబడిన కమలా హారిస్**

అమెరికా దిగువసభ సభ్యురాలుగా కమలాహారిస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఐతే ఆమె ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు ప్రతిజ్ఞ పదాలను ఉచ్చరించడంలో తడబడ్డారు. జాతీయ జెండాకు విధేయంగా ఉంటానని ప్రతిజ్ఞ చేసే సమయంలో జెండా అనే పదాన్ని ఆమె మింగేశారు. ఉచ్ఛరించలేదు. దాంతో ఆమె అభాసుపాలయ్యారు. సోషల్ మీడియాలో ఒక లాఫింగ్ టాపిక్‌గా, విమర్శలకు వేదికగా మారారు. ఆమె చిత్తశుద్ధిని తప్పుపడుతూ అనేక మంది విమర్శలు చేస్తున్నారు.

**స్పీకర్‌గా మళ్ళీ మైక్ జాన్సన్**

అమెరికా దిగువసభ స్పీకర్ పదవికి మైక్ జాన్సన్ మరోసారి ఎన్నికయ్యారు. రిపబ్లికన్‌పార్టీ తరపున ఆయనను ఎన్నుకున్నప్పటికీ ప్రతిపక్షానికి చెందిన చట్టసభ్యులు కూడా ఆయనకు అనుకూలంగా ఓట్లు వేశారు. మూడు ఓట్ల తేడాతో ఆయన మళ్ళీ స్పీకర్ పదవి గెలుచుకున్నారు. డోనాల్డ్ ట్రంప్ కూడా ఆయనకు పూర్తి మద్దతు తెలియజేశారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ 56వ స్పీకర్‌గా సేవలు అందిస్తారు. 2017 నుండీ ఆయన పదవిలో కొనసాగుతున్నారు. సుమారు మూడు గంటలపాటు ఎంతో ఉత్కంఠంగా ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ట్రంప్ తరహాలోనే కన్జర్వేటివ్ విలువలకు ఆయన కట్టుబడి ఉంటారు.

## మణిపూర్‌లో మళ్లీ హింస

పెద్ద ఎత్తున భద్రతా బలగాల మోహరింపు

**ఇంఫాల్ :** మణిపూర్‌లో శుక్రవారం మళ్లీ హింసాత్మక ఘటనలు జరిగాయి. మణిపూర్‌లోని ఇంఫాల్ ఈస్ట్ జిల్లా కాంగ్‌పోక్పిలో శుక్రవారంనాడు కొందరు ఎస్‌పి కార్యాలయంలో మూకమ్మడి దాడికి దిగారు. సైబల్ గ్రామం నుంచి కేంద్ర బలగాలను ఉపసంహరిచడంలో ఎస్‌పి కార్యాలయం విఫలమైందని ఆరోపిస్తూ జరిపిన ఈ దాడిలో ఎస్‌పి గాయపడ్డారు. సైబల్ గ్రామంలో కేంద్ర బలగాలు ముఖ్యంగా బిఎస్‌ఎఫ్, సిఆర్‌పిఎఫ్ దళాలను కొనసాగించడంపై ఆగ్రహించిన కొందరు శుక్రవారం సాయంత్రం ఎస్‌పి ప్రభాకర్ కార్యాలయంపై రాళ్లురువ్వారు. ఎస్‌పి ఆవరణలో నిలిపి ఉంచిన జిల్లా పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. అయితే ఆందోళనకారులు రువ్విన రాళ్లు ఎస్‌పి నుదిటికి తాకడంతో తీవ్ర గాయాలైనట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో సైబల్‌లో పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరింపచేశామని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. అయితే రాళ్లురువ్వడంతో పాటు ఎస్‌పి కార్యాలయంపై పెట్రోల్ బాంబులతో దాడి చేశారని పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆందోళనకారుల గుంపును భద్రతా బలగాలు చెరగొట్టాయని, పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. ఈ ఘర్షణల్లో గాయాలైన కొందరు ఆందోళనకారులు ఆసుపత్రిలో చేరారన్నారు. సైబల్ గ్రామంలోని మహిళలపై డిసెంబర్ 31న భద్రతా బలగాలు లాఠీచార్జి చేశారని కుకీ సంస్థలు ఆరోపిస్తున్నాయి.

## ఉత్తర భారతాన్ని కమ్మేసిన పొగమంచు..

**న్యూఢిల్లీ :** చలి తీవ్రతకు ఉత్తర భారతం వణుకుతోంది. ఢిల్లీ సహా హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, బీహార్ రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. దీంతో దట్టమైన పొగ మంచు కమ్మేసింది. పొగమంచు కారణంగా విమాన, రైలు సర్వీసులకు ఆటంకం ఏర్పడింది. దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విజిబిలిటీ జీరోకు పడిపోయింది. దీంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే దాదాపు 250 విమానాలు ఆలస్యమయ్యాయి. 40 విమానాలను అధికారులు రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్ ఇండియా సహా పలు విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. ఇక కోల్‌కతా విమానాశ్రయంలో 40 విమాన సర్వీసులు ఆలస్యం అయ్యాయి. మరో ఐదు విమానాలను రద్దు చేసినట్లు ఫ్లైట్ మానిటరింగ్ ప్లాట్‌ఫాం ఫ్లైట్‌రాడార్ తెలిపింది. చండీగఢ్, అమృత్‌సర్, ఆగ్రా సహా ఉత్తరాదిలోని ఇతర విమానాశ్రయాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి.ఆయా విమానాశ్రయాల్లో విజిబిలిటీ జీరోగా నమోదైంది. మరోవైపు రైలు సర్వీసులకు కూడా తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం.. వివిధ ప్రాంతాల నుంచి ఢిల్లీకి వచ్చే 50కిపైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. న్యూఢిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (22436) దాదాపు నాలుగు గంటల కంటే ఎక్కువ ఆలస్యంగా నడుస్తోంది. వారణాసి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 14 గంటలు, మరో న్యూఢిల్లీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఎనిమిది గంటల 17 నిమిషాలు, ఆనంద్ విహార్ టెర్మినల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏడు గంటలకు పైగా ఆలస్యంగా నడుస్తోంది.దట్టమైన పొగ మంచు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **శ్రీ ముత్యాల సంగీత, భర్త: ముత్యాల రమేష్ రెడ్డి,** సేల్ డీడ్ డాక్యుమెంట్ నంబర్: **559/2008,** సబ్ రిజిస్టర్ దేవరకొండలోని (ప్లాట్ 63) నల్గొండ జిల్లా. వారి దగ్గర నుండి కొనుగోలు చేసిన మంద సైదయ్య / మంద జంగయ్య, నివాసం: ఓంకార్ నగర్, ప్లాట్ నెంబర్: 80, సరూర్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, వారు డిసెంబర్ 15న 2024 హస్తినాపురంలోని భారతి నగర్ ప్లాట్ నెంబర్ 18లో కిరాయికి ఉంటున్నారు. డిసెంబర్ 15న ఓంకార్ నగర్‌కు రూము మారుస్తుండగా లింకు డాక్యుమెంటు మిస్ కావడం జరిగింది. ఎవరికైనా దొరికినచో క్రింది నంబర్‌కు తెలియజేయగలరు.

ఇట్లు

మంద సైదయ్య, తండ్రి: మంద జంగయ్య

సెల్: 9182675214

## ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కార్మికుల పిల్లలు, కార్మికులు ఉపకార వేతనాల కొరకు ఫిబ్రవరి 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె. విజయభాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు , కార్మాగారాలు, మోటార్ రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ఇతర ట్రస్టులలో పనిచేయుచున్న కార్మికుల పిల్లలు, కార్మికులకు ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలను అందించనున్నట్లు తెలిపారు. 2023 24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఐటిఐ కోర్సు ఉత్తీర్ణులైన వారికి రూ. 1000, పాలిటెక్నిక్ కోర్సుకు రూ. 1500, ఇంజనీరింగ్, మెడిసిన్, లా, బియస్సి, బిసిఎ, ఎంసిఎ, బిఫార్మసి, ఎంఫార్మసి, బిబిఎ, ఎంబిఎ, పిజి డిప్లోమా ఇన్ మెడికల్ లాబోరేటరీ టెక్నిషియన్ కోర్సు ఉత్తీర్ణులైన వారికి రూ. 2వేలు ఉపకార వేతనం చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు మే డే నాటికి లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ఆయన తెలిపారు.

## నాగేంద్రబాబు సేవలు ఆదర్శప్రాయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యా రంగానికి నాగేంద్రబాబు అందించిన సేవలు పలువురికి ఆదర్శ ప్రాయమని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వరరావు తెలిపారు. రోటరీనగర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ డి. నాగేంద్రబాబు పదవి విరమణ పొందారు. ఈ సందర్బంగా శనివారం పాఠశాలలో హెచ్‌ఎం పి. పద్మ అధ్యక్షతన అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వైవి మాట్లాడుతూ 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన నాగేంద్రబాబు ఎక్కడ పనిచేసినా పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేశారన్నారు. ఉత్తీర్ణతతో పాటు పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు గ్రామస్తుల సహకారంతో కృషి చేశారన్నారు. నాగేంద్రబాబు సేవలు పలువురికి ఆదర్శంగా నిలిచాయన్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం మధు మాట్లాడుతూ అందరిని అప్యాయంగా, ప్రేమగా పలకరిస్తూ పాఠశాల అభివృద్ధిలో నాగేంద్రబాబు చేసిన సేవలను గుర్తు చేశారు. నాగేంద్రబాబు దంపతులను ఈ సందర్బంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, గాయత్రి, రమ, ఎం. పద్మ, సుజాత, పిఆర్‌టియు మాజీ అధ్యక్షులు ఎన్. కృష్ణమోహన్, చలపతిరావు, డి.రామారావు, డివి రామన్, విజయ్‌అమృత్ కుమార్, శేఖర్, గుడిపూడి శ్రీనివాసరావు, రవికిరణ్, రమణారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీతారత్నం ట్రస్టు సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యా రంగానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఖమ్మం సిడిపివో వీరభద్రమ్మ తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని కొత్తూరు 2 అంగన్‌వాడీ కేంద్రంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గురు గర్భిణీలకు సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో వీరభద్రమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనకు ట్రస్టు తరుపున పరిశ పుల్లయ్య అందిస్తున్న చేయూత మరువలేనిదన్నారు. గర్భిణీలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవన నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం సెక్టార్ పర్యవేక్షకులు మోతుకూరి కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయుని వి. వెంకట నాగ మణి, ఆయా సీతమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ ఉపాధ్యాయుని వెంకటనాగమణి, ఆయా సీతమ్మను ఘనంగా సత్కరించారు.

## ముగింపు దశకు రివర్ ఫెస్టివల్ పనులు



**ప్రజాపక్షం/భద్రాచలం:** ముక్కోటి ఏకాదశి సమీపిస్తున్నందున రివర్ ఫెస్టివల్ నిర్వహణ కోసం జరుగుతున్న పనులను ముంగింపు దశకు చేరుకున్నాయని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. శనివారం గోదావరి కరకట్ట ప్రాంతంలో చేపడుతున్న పనులను, తాత్కాలిక విడిది గృహాల ఏర్పాట్లు, వివిధ గిరిజన వంటకాలు, గిరిజన కళాఖండాలకు సంబంధించిన స్టాల్స్‌ను, పర్యాటకులు విహరించే బోట్ షికారును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ దాదాపు అన్ని పనులు చివరి దశకు చేరుకున్నాయని, కళాకృతులు, స్టాల్స్ నిర్మాణ పనులు వేగవంతంగా నడుస్తున్నాయన్నారు. విడిధి గృహాల్లో పర్యాటకులు ప్రశాంతంగా సేదతీరేందుకు, తెప్పల మీద విహరించేందుకు బోట్ సౌకర్యం, బస చేసిన వారికి డైనింగ్ హాల్ ఏర్పాట్లు, విడిధి చేసే ప్రాంతమంతా విద్యుత్ కాంతులు వెదజల్లేలా సోలార్ విద్యుత్ ఏర్పాట్లు చేయిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ ఉన్న గోదావరి అందాలను సెల్ఫీ ద్వారా ఫొటోలు తీసుకోవడానికి సెల్ఫీపాయింట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కల్చరల్ ప్రోగ్రాంకు ఏర్పాట్లు కూడా సజావుగా జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతీ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో వినిపించేలే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం గోదావరి బోటులో సరదాగా విహరించి పర్యాటకులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఇ వెంకటేశ్వరరావు, దేవస్థానం ఇఇ రవీంధర్, గ్రామపంచాయితీ ఇఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు మరో డాక్టరేట్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రధాని జిల్లా ప్రాంతీయం భాస్కర్ థియేటర్‌లో డిసెంబర్ నెల 24వ తేదీన మధ్యాహ్నం జరిగిన సన్మాన సభలో అవార్డు సన్మాన సభలో మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు అమెరికా గవర్నమెంట్ డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ వారు డాక్టర్ ఎమోస్ జేమ్స్ పిహెచ్డి చాన్సర్ డిఐవియు ఇండియన్ మరియు డాక్టర్ కే పాల్ శామ్యూల్ పిహెచ్డి చైర్మన్ డిఎయుఎస్ఏ డాక్టర్ కింగ్ ది మెయిన్ వైస్ ప్రెసిడెంట్ డిఏయూ ఇంగ్లాండ్ డాక్టర్ సిరీస్ పిహెచ్ ఆఫ్రికా వారు డాక్టర్ సర్టిఫికెట్ తో పాటు, గోల్డ్ మెడల్ మెమెంటోతో డాక్టర్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన సభలో ప్రముఖ సినీ నిర్మాత రామకృష్ణ గౌ, ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్, సినీ నటుడు శశి, ముంతాజ్, కిరణ్, రుద్రా స్టూడియో శ్రీనివాస్, హలో ప్రసాద్, మెగా ఎంటర్ప్రైజెస్ అభినేత్రి శిరీష రెడ్డి , సినిమా నటులు పాల్గొన్నారు. విద్యా రంగంలో ఉపాధ్యాయుని పాత్ర అనే అంశంపై డాక్టరేట్ లభించినందుకు నాకు చాలా ఆనందంగా ఉందదని డాక్టర్ వెంకటేష్ పత్రికలకు తెలిపారు. డాక్టర్ ఎమోస్ జేమ్స్, పిహెచ్డి క్యాన్సిలర్ డిఏయు ఇండియా వారు సార్ ని ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రతీ నియోజక వర్గానికి 3,500 ఇండ్లు

***అసంపూర్తి ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు *అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన *లబ్దిదారులకు చెక్కులు పంపిణీ *టీస్టాల్ ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి**





**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్/ కూసుమంచి :** రాష్ట్రంలోని ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం ఎంపి రామ సహాయం రఘురాంరెడ్డితో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించారు. ఉపాధి హామీ నిధులు రూ. 15 లక్షలతో కూసుమంచి మండలం లోక్యాతండా గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులకు రూ. 20 లక్షలతో లోక్యాతండా గ్రామంలో, రూ. 19 లక్షలతో లింగారం తండాలో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నేలకొండపల్లి మండలానికి చెందిన 42 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 16,01,500, కూసుమంచి మండలానికి చెందిన 62 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 18,80, 500 చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో పేదలు కుటుంబంతో సంతోషంగా, ఆరోగ్యంగా ఉండేవిధంగా భగవంతుడు ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మార్పు కావాలని పేదలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఇచ్చిన ప్రతీ మాట నెరవేర్చాలనే ధృడ సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షల మంది ఇండ్లు కావాలని దరఖాస్తు చేశారని ఇప్పటి వరకు 64 లక్షల దరఖాస్తుల సర్వే ఈ యాప్ ద్వారా పూర్తి చేశామని మిగిలిన దరఖాస్తుల సర్వే మరో నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. గతంలో వివిధ దశల్లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను కూడా సంక్రాంతి లోపు పంపిణీ చేస్తామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సరఫరాకు అధికారులు యుద్ద ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రైతులు, యువకులు, మహిళల సంక్షేమం కోసం ఇందిరమ్మ రాజ్యం చిత్తశుద్దితో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బి ఎస్ఇ హేమలత, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వరరావు, ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, పిఆర్ఇఇ వెంకటరెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి రా ంబాబు, వ్యవసాయ శాఖ ఎడిఎ సరిత, ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, ఇంచార్జి తహసీల్దార్ కరుణశ్రీ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మంరూరల్:** ఏరా చెల్లమ్మ...నీదేనా రా షాప్...ఏం రెడీ చేశావ్..టీ చేశావా ఇవ్వు..వాహ్ భలే ఉంది రా చాయ్ అంటూ ఇందిర మహిళాశక్తి ఆధ్వర్యంలో టీస్టాల్ ఏర్పాటు చేసిన మహిళను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. శనివారం ఖమ్మంరూరల్ మండలం వరంగల్‌క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన ఆ టీస్టాల్‌ను మంత్రి పొంగులేటి, ఎంపి రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. మహిళలు స్వశక్తితో ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పేరుతో రుణాలు ఇప్పించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. కావున మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా బలపడాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దిమల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, బండి జగదీష్, భూక్య సురేష్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ యువజన నాయకులు తమ్మినేని నవీన్, మద్దుపల్లి మార్కెట్ డైరెక్టర్ తేజావత్ పంతుల్‌నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కళ్లెం వెంకట్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## మీ సేవలు మరువలేనివి

### -సీనియర్ పెన్షనర్లకు సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఏళ్ల తరబడి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి సమాజంలో మార్పు కోసం ప్రయత్నించిన వారి సేవలు అజరామరమని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అర్విణి రాజేంద్ర బాబు తెలిపారు. ఉద్యోగ బాధ్యత అంటే కేవలం అప్పగించిన పని చేయడమే కాదని సమాజ శ్రేయస్సు కోసం, మార్పు కోసం ప్రజల అవసరాలను గుర్తెరిగి పనిచేయడమని ఆయన తెలిపారు. శుక్రవారం రాత్రి ఖమ్మంజిల్లా ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ సామాజిక సేవలో జీవితాన్ని వెచ్చించిన వారి పట్ల పాలకులు అనుసరిస్తున్న వైఖరి ఇబ్బందికరంగా ఉందన్నారు. పని చేస్తున్న కార్యాలయాన్ని కుటుంబంగా ఎంచుకుని పని చేసి పదవి విరమణ పొందిన తర్వాత ప్రభుత్వం నుంచి అందాల్సిన సదుపాయాలను కల్పించడంలో విఫలమవుతున్నారని రాజేంద్ర బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో వయస్సు పైబడిన వారికి ఇబ్బందులు తలెత్తుతాయని అందరూ నగదు నిల్వతో ఉండరన్న వాస్తవాన్ని ఈ ప్రభుత్వం గుర్తెరగడం లేదన్నారు. నగదు రహిత వైద్య సాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అదే సమయంలో అప్పో సప్పో చేసి వైద్యం చేయించుకుంటే మెడికల్ రీయంబర్స్‌మెంట్ నెలలు గడిచినా రాకపోవడం వృద్దాప్యంలో ఉన్న వారిని మనో వేదనకు గురి చేస్తుందన్నారు. పిఆర్‌సి, డిఏలను కూడా విడుదల చేసి పెన్షనర్లకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు. మొత్తం 35 మంది పెన్షనర్లకు సన్మానం చేశారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఖజానా అధికారి ఎస్‌వీఎస్ నరసింహం, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి నర్సింగరావు, జిల్లా కార్యదర్శి రాయల రవికుమార్, అసోసియేషన్ బాధ్యులు కన్నెకంటి కృష్ణమూర్తి, ఐవి భాస్కరాచారి, కనపర్తి వెంకటేశ్వర్లు, ఊడుగు వెంకటేశ్వర్లు, బెల్లం రాధాకృష్ణమూర్తి, పెదమళ్ల సత్యనారాయణ, గుర్రాల శ్రీనివాసరావు, లక్ష్మి, లక్ష్మి సుజాత, కృష్ణకుమారి, మేరీ ఏసుపాదం, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కోయచలక గ్రామంలో ముఖ్యమంత్రి స హాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు బస్వాజి నా గమ్మ, నాయిని అపర్ణ లకు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు ప ంపిణీ చేశారు. ఈ సందర్బంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకూరి పూ ర్ణచందర్‌రావు, మాధంశెట్టి హన్మంతరావు, చెరుకూరి సీతారాములు, మేళ్లచెరువు రాంప్రసాద్, మాధంశెట్టి సీతారాములు, చెరుకూరి కృష్ణారావు, బ లుసుపాటి ఏసు, శేషయ్య, పరమయ్య, అమరం అప్పారావు పాల్గొన్నారు.



## డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాచలం;** కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి క్యాజువాలిటీలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అర్‌అండ్‌బి అధికారులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఆయన శనివార ం ఆస్పత్రి ఆవరణలో జరుగతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన దయాల్సిస్ యంత్రాల ఏర్పాటుకు కావాల్సిన రూంను ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బంది ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎంఓ డా.రమేష్, ఆర్ఎంపి అధికారులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ‘ప్రజాపక్షం’ ప్రజల పక్షం...

### అశ్వాపురం సిఐ అశోక్‌రెడ్డి

**ప్రజాపక్షం/అశ్వాపురం:** ప్రభుత్వంలో నాలుగో స్తంభమైన జర్నలిస్టు వృత్తి ఎంచుకోవడం చాలా గొప్ప విషయమని, నిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వాన్ని పెన్నుతో ప్రశ్నించే తీరు ఒక్క జర్నలిస్టుకు మాత్రమే ఉందని సిఐ అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం అశ్వాపురం పోలీస్ స్టేషన్ లోని ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపక్షం ప్రజల పక్షం మేనని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ సమాజానికి మేలు చేస్తున్నదని అన్నారు. నిజాన్ని నిర్భయంగా రాయడం జర్నలిస్టుకు మాత్రమే సాధ్యమని, ప్రజాపక్షం గోపినాథ్ మురుకుపల్లిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం ప్రెస్ క్లబ్ సభ్యులు వెలమ రాజేందర్, రాధాకృష్ణ, అంజనరావు, లెనిన్, అర్జున్, నాగరాజు, సత్యనారాయణ, కోటేశ్వరరావు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్

### 18 లక్షల విలువచేసే సొసొత్తు రికవరీ




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం, వరంగల్, హన్మకొండ, హైదరాబాద్, మహబూబాబాద్ జిల్లాలో గత కొంత కాలంగా వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను ఖమ్మం టూటౌన్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. స్థానిక పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు కార్యాలయంలో ఎసిపి సురద వెంకట రమణమూర్తి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. స్థానిక బైపాస్ రోడ్డు రాపర్తినగర్ సెంటర్‌లో శనివారం టూటౌన్ సీఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీచేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా అందులో బంగారు, వెండి ఆభరణలు ఉండటంతో అనుమానంతో పోలీసు స్టేషన్‌కు తరలించారన్నారు. అతనిని విచారించగా చోరీల విషయం బయటపడిందన్నారు. మహబూబాబాద్ జిల్లా నెలికుదురు మండలం నల్లగుండితండాకు చెందిన గుగులోత్ నవీన్ గత ఏడాది డిసెంబర్ నెలలో ఖమ్మం రవాణశాఖ కార్యాలయం సమీపంలోని ఎస్ఆర్‌సీ టవర్స్ అపార్ట్‌మెంట్‌లోని నాలుగవ అంతస్తులో ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో రాత్రివేళ తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలోని బంగారు, వెండి ఆభరణలు దొంగిలించినట్లు తెలిపాడన్నారు. అదేవిధంగా గత ఏడాది ఆగష్టు నెలలో హైదరాబాద్ కుషాయిగూడ మేడ్చెల్ వద్ద ఒక స్కూటీని, డిసెంబర్ మాసంలో అదే ప్రాంతంలో రెండు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందన్నారు. అదే మాసంలో హన్మకొండ జిల్లా కేంద్రంలో ఓ ఇంట్లో చోరికి పాల్పడి అభరణాలు దొంగిలించినట్లు అంగీకరించాడని ఏసీపీ తెలిపారు. 2016 నుంచి ఆయా జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడని చివరికి శనివారం ఖమ్మం రాపార్తినగర్ వద్ద టూటౌన్ సీఐకి పట్టుబడ్డాడని వెల్లడించారు. నిందితుడి నుంచి 18 లక్షల రూపాయల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ చెప్పారు. టూ టౌన్, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా పనిచేసి నిందితుని నుంచి సొత్తు రికవరి చేశారన్నారు. ఈ సందర్బంగా టూటౌన్‌సిఐ బాలకృష్ణ, ఎస్సైలు, సిబ్బందిని రమణమూర్తి అభినందించి రివార్డుకు ఉన్నతాధికారులకు సిఫర్స్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిసిఎస్ ఎసిపి రెహమాన్, టూటౌన్ సిఐ బాలకృష్ణ సిసిఎస్ సిబ్బంది గజేందర్, మంగిలాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**తాళం వేసి ప్రయాణాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి ఎసిపి రమణమూర్తి వెల్లడి:**

పండుగ సెలవులు, శుభకార్యాలకు ఊరు విడిచి వెళ్లావారు తగు జాగ్రత్తలు పాటించాలని టౌన్ ఏసిపి రమణమూర్తి తెలిపారు. ముఖ్యంగా విలువైన బంగారు, వెండి ఆభరణలతో పాటు ఎక్కువ మొత్తంలో నగదు ఇంట్లో ఉంచవద్దని బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలని నగర ప్రజలకు సూచించారు. చోరిలేదా ఏదైన ప్రమాదం సంభవిస్తే అన్నివిధాల నష్టపోవలసి వస్తుందన్నారు. ఇళ్లలో తక్కువ మొత్తంలో ఉంచుకుంటే మంచిదన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు సమీప పోలీసు స్టేషన్‌లలో సమాచారం ఇస్తే ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పోలీసు పహారా పెంచుతామన్నారు. ప్రజలు దీనిని గమనించి పోలీసువారికి సహకరించాలని ఆయన కోరారు. నష్టం జరిగిన తరువాత బాధపడేకన్న ముందు జాగ్రత్త మంచిదన్నారు.

# అసంతృప్తికి కారణమవుతున్న వాగ్దాన భంగం

*** రుణమాఫీపై రైతుల్లో ఆగ్రహం * రైతు భరోసా ఏమి చేస్తారో...?* మాట తప్పితే ఇబ్బందులు తప్పకపోవచ్చు**





**ప్రజాపక్షం/ఖమ్మం :** అంత్య నిష్టూరం కంటే అది నిష్టూరం మేలన్నది సామెత. అది అన్ని సందర్భాల్లోనూ అందరికీ వర్తిస్తుంది. తొలుత కాదని తర్వాత ఇచ్చే ఆనందం ఎంతగా ఉంటుందో ఇస్తానని ఇవ్వకపోతే కోపం, బాధ అంతకు రెట్టింపు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ రుణమాఫీ వ్యవహారంలో అచ్చు అదే జరిగింది. రెండు లక్షల రుణమాఫీ చేస్తాం. రెండు లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని రైతులు చెల్లిస్తే రెండు లక్షలు మేము రైతుల ఖాతాల్లో వేస్తాం అని మంత్రులు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి మరీ చెప్పారు. కానీ ఇప్పుడు అసలు రెండు లక్షల లోపు రుణమాఫీయే పూర్తి కాలేదన్నది రైతుల్లో ఉన్న ఆవేదన. మూడు దఫాలుగా రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసిన తర్వాత దాదాపు రూ. 3వేల కోట్ల రూపాయలకు సంబంధించిన రైతు రుణాలు వివిధ కారణాల వల్ల మాఫీ కాలేదని ఇప్పుడు అన్ని ఆధారాలను సేకరించాం కాబట్టి వాటిని మాఫీ చేస్తున్నామని నవంబర్ 30న స్వయనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడమే గాక రూ. 3వేల కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఇంత వరకు ఏ రైతు ఖాతాల్లోనూ డబ్బులు జమ చేసిన దాఖలాలు లేవు. బ్యాంకు అధికారుల చుట్టూ రెండు లక్షల లోపు ఉన్న రైతులు తిరుగుతున్నా ఇదిగో అదిగో అంటున్నారు తప్ప రుణమాఫీ మాత్రం జరగడం లేదు. దీని మీద క్షేత్రస్థాయి అధికారుల నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు ఎవరి వద్ద సరైన సమాధానం లేదు. ఎందుకు రెండు లక్షల లోపు రుణమాఫీ జరగడం లేదో అర్థం కానీ పరిస్థితి. ఇక రెండు లక్షల పైన ఉన్న రైతులు మంత్రుల మాట విని తమకు తప్పనిసరిగా రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందని ఆశ పడ్డారు. గతంలో పలు మార్లు మీడియా సమావేశాల్లోనూ, సభల్లోనూ పదే పదే ప్రకటించిన ఏ మంత్రి కూడా ఇప్పుడు రెండు లక్షలపై బడి ఉన్న రుణాల ఊసెత్తక పోవడం గమనార్హం. రుణమాఫీ పరిస్థితి ఈవిధంగా ఉంటే డిసెంబర్ మాసంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి కూడా అయిన మల్లు భట్టివిక్రమార్క భూమి లేని నిరుపేదల ఖాతాల్లో డిసెంబర్ 28న కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ. 12వేలు జమ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత దానిని కొద్దిగా సవరించి రెండు విడతల్లో ఆరువేల రూపాయల చొప్పున జమ చేస్తామని ప్రకటించారు. 28న ఏ పేద వాని ఖాతాల్లోనూ రూపాయి జమ చేసింది లేదు. ఆ తర్వాత దీనిని గురించి ఎక్కడ ప్రస్థావించకపోవడం కూడా పలు అనుమానాలకు తావిస్తుంది. పేదలకు ఏడాదికి రూ. 12వేల పథకాన్ని ప్రారంభిస్తారా లేక మరేమైనా పునరాలోచనకు వెళ్తారా అన్న దానిపై కూడా స్పష్టత లేదు. అసలు రూ. 12వేలు ఇచ్చే లబ్దిదారులను ఎలా ఎంపిక చేస్తారన్నది కూడా ఇంత వరకు తేల్చలేదు. భూమి లేని నిరుపేదలని అంటున్నారు. భూమి లేని వారిలో కూడా అనేక మంది ధనవంతులు ఉన్నారు. రెండవది జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారిని ఎంపిక చేసే అవకాశం ఉంటుందంటున్నారు. గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్నాయి. దీనిని బట్టి నిరుపేదల ఎంపికకు ఒక ప్రత్యేకమైన సర్వే నిర్వహిస్తే తప్ప లేకపోతే అనర్హులు కూడా లబ్ది పొందే అవకాశం ఉంది. అనర్హులు ఎక్కడో ఒక చోట లబ్ది పొందిన అంతగా ఇబ్బంది లేదు కానీ అర్హులకు ఈ పథకం చేరకపోతే ప్రభుత్వ లక్ష్యం పక్కదారి పడుతుంది. రైతుభరోసాకు సంబంధించి విధి విధానాలను ఖరారు చేసేందుకు మంత్రి వర్గ ఉప సంఘం ప్రజాభిప్రాయ సేకరణ చేసిన తర్వాత రెండు మూడుసార్లు సమావేశమైంది. సమావేశం సారాంశం పూర్తిగా బయటకు రాకపోయినా భూమికి సంబంధించి ఎటువంటి కోతలు ఉండవని సాగు భూమి ఎంత ఉన్నా రైతు భరోసా వర్తింపజేస్తారన్న వార్తలు బయటకు వచ్చిన నేపథ్యంలో రైతులు దీనిని స్వాగతిస్తున్నారు. కానీ సాగు భూమి నిర్ధారణ కూడా అంత తేలికైన విషయం కాదు. ఇప్పటికే జాప్యం జరిగిన రైతు భరోసాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన విధంగా సంక్రాంతికి రైతుల ఖాతాల్లో జమ చేయాలి దీనికి సంబంధించి కూడా రైతుల నుంచి ఒక బలమైన వాదన వినపడుతుంది. వ్యవసాయ అధికారులకు ఎవరు ఏ పంట సాగు చేశారో రికార్డుల్లో నమోదై ఉంది కాబట్టి మరల దరఖాస్తులు ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు వాగ్దానాలను ఇచ్చినవిధంగా అమలు చేస్తుంది. ఒకటి ఉచిత బస్సు, రెండు గృహజ్యోతి, ఉచిత బస్సులో కూడా బస్సుల సంఖ్య పెరగకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు ప్రభుత్వ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గృహ జ్యోతికి సంబంధించి చిన్న చిన్న సమస్యలు ఉన్న ఆ సాఫీగానే సాగుతుందన్న భావన వ్యక్తమవుతుంది. ఇక గ్యాస్‌కు సంబంధించి 60 శాతం మంది ఖాతాలలో నగదు జమ కావడం లేదన్న ఆరోపణ వినవస్తుంది. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం పదే పదే వాగ్దాన భంగానికి పాల్పడుతుండడంతో ప్రజల్లో అసంతృప్తి మొదలైంది. రుణమాఫీతో పాటు రైతు భరోసా పైన తక్షణ నిర్ణయం తీసుకుని రైతులను సంతృప్తి పర్చడంతో పాటు ప్రభుత్వ సానుకూలతపెంచుకునే దిశగా ఆలోచన చేయాలని కోరుతున్నారు.

# ఇక జిల్లాలకు పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

నేడు నాగార్జునసాగర్‌లో 'ఆదివాసి కాంగ్రెస్ సభ'

6న ఆదిలాబాద్, 7న నిజామాబాద్‌లో పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం నాగార్జునసాగర్‌కు వెళ్లనున్నారు. ఆ మరుసటి రోజు ఈ నెల 6వ తేదీన ఆదిలాబాద్,7న నిజామాబాద్ జిల్లాల్లో మహేష్ కుమార్ పర్యటించనున్నారు. నాగార్జునసాగర్ లో ఆదివాసీ కాంగ్రెస్ సమావేశాన్ని నిర్వహించగా, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో మహేష్‌గౌడ్, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథన్‌తో పాటు ఇన్‌చార్జ్ మంత్రులు, జిల్లాకు చెందిన మంత్రులు, డిసిసి అధ్యక్షులు, ఎంపీలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు , శాసనసభ నియోజకవర్గాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులు, పలు కార్పొరేషన్ చైర్మన్‌లు, సీనియర్ నాయకులు హాజరుకానున్నారు. కాగా ఈ సమావేశంలో రాబోయే పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రజా పాలన మొదటి వార్షికోత్సవ విజయాలు తదితర అంశాలపై చర్చించనున్నారు.

# సన్నాయిల సమస్యలు పరిష్కరిస్తాం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సన్నాయిలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరిస్తామని బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్ తనను కలిసిన సన్నాయిల కుల సంఘం నేతలకు హామి ఇచ్చారు. శనివారం ఖైరతాబాద్‌లో ఉన్న బిసి కమిషన్ కార్యాలయానికి సన్నాయిల కుల సంఘం నూతన కమిటి అధ్యక్షలు వేముల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోమాండ్ల మనోహర్, కరీంనగర్ జిల్లా సంఘం అధ్యక్షులు కొమాండ మహేందర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పులి జగదీష్‌కు వచ్చి ఛైర్మన్ నిరంజన్‌ను కలిశారు. రాష్ట్రంలో సన్నాయిలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నిరంజన్‌కు వారు వివరించారు. కొన్ని జిల్లాలలో ధ్రువీకరణ పత్రంలో ఎమ్మార్వో లు ఇబ్బంది పెడుతున్నారని అలాగే ప్రభుత్వం పరంగా వచ్చే సంక్షేమ పథకాలు తమకు చెందడం లేదని నిరంజన్‌కు సంఘం కమిటీ సభ్యులు వివరించడం జరిగింది. దానికి నిరంజన్ స్పందిస్తూ జిల్లాల బిసి వెల్ఫేర్ అధికారులను కలవాలని తాము కూడా అధికారులకు తెలుపుతామని మాటిచ్చారు. అదేవిధంగా ఏ జిల్లాలో అయితే కుల ధృవీకన పత్రాలు ఇవ్వడం లేదో ఆ జిల్లాల ఎమ్మార్వో ల వివరాలు అందించాలని సూచించారు. తమ సహకారాలు సన్నాయిల కులానికి అందిస్తామని బిసి కమిషన్ అధికారి సతీష్ కూడా మాటిచ్చారు.

# కవిత ధర్నాతో అపవిత్రమైన ఇందిరాపార్క్ : పిడమర్తి రవి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరా పార్క్‌లో టిఆర్ఎస్ పార్టీ నేత కల్వకుంట్ల కవిత బిసి మహాసభ నిర్వహించడం తో ఇందిరా పార్క్, బిసి వాదం అపవిత్రమైందని ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శనివారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ లో కల్వకుంట్ల కవిత బిసి మహాసభ నిర్వహించిన స్థలంలో పాలతో శుద్ధిచేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి దళితుడిని చేస్తా అని మాట ఇచ్చి దళితులను తీవ్రంగా అణచివేసిన ఘనత కెసిఆర్ కే చెందుతుందన్నారు. దళితున్ని ముఖ్యమంత్రి చేయకపోగ మంత్రివర్గంలో ఒక్క మాదిగకు చోటు కల్పించకుండా తీవ్రంగా అణచివేసిన నియంత కెసిఆర్ అని ఇప్పుడు కెసిఆర్ కూతురు కల్వకుంట్ల కవిత బిసి వాదం ఎత్తుకొని బిసిలను నమ్మించి అణిచివేసే ధోరణి వారి కుటుంబంలో ఉందని బిసి సోదరులు దయచేసి కల్వకుంట్ల కుటుంబ మాయలో పడొద్దని దళితులను మోసం చేసినట్లే బీసీలను మోసం చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వక్కళ్ళగడ్డ చంద్రశేఖర్, ఎండి రహీం, నంద్రు నరసింహ, బోరెల్లి సురేష్, పాతకోటి కరన్,దర్శనం జాన్, శ్రీనాథ్, దేవరకొండ నరేష్ జోగు గణేష్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచారం అందుబాటులో లేకపోవడంతోనే వెనుకబాటుతనం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాచారం అందుబాటులో లేకపోవడం వల్లనే వెనుకబాటుతనం ఉందని మాజీ ఎంఎల్‌సి ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. 'పోరస్ సిటీజన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్' ఆధ్వర్యంలో 'యూ రూల్' పేరుతో ఏర్పాటు చేసిన సిటిజన్ సర్వీస్ పోర్టల్‌ను నాగేశ్వర్ శనివారం ఆవిష్కరించారు. లోగోను ఇండిపెండెంట్ జర్నలిస్ట్ తులసి చందు ఆవిష్కరించారు. తులసి చందు మాట్లాడుతూ, ప్రభుత్వం చేయలేని పనులను యూ రూల్ చేయాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూరూల్ ఎండి ఆదిమల్ల గోవర్ధన్, చీఫ్ కంటెంట్ డెవలపర్ మహేష్ కొంగర, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ రాణి గుంటికాడి, కంటెంట్ రైటర్స్ కొడిదెల సురేష్, దూడపాక నరేష్, లీగల్ అడ్వాయిజర్ కట్కూరి శ్రీనివాస్, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ నెనావత్ మహేందర్, కోఆర్డినేటర్లు దుర్గా ప్రసాద్, వరలక్ష్మి ,బాబు నాయక్, అనగండ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కేసు కొట్టేయండి: కౌశిక్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించారంటూ 2023 నవంబర్ 29న కమలాపూర్ పీఎస్‌లో నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కమలాపురం ఎంపీడీవో జి.బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమలాపురం పోలీసులు కేసు మేరకు పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్‌ను నాంపల్లి ప్రజానిధుల కోర్టు విచారణకు పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రక్రియను సవాల్ చేస్తూ కౌశిక్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను సోమవారం హైకోర్టు విచారణ చేయనుంది. మీరు ఓటు వేయకుంటే మా ముగ్గురు శవాలను చూడండి.. అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మీరు ఓటు భారీ విజయం ఇస్తే విజయయాత్రకు వస్తాను. లేదంటే మా శవయాత్రకు మీరు రండి.. అని కౌశిక్ రెడ్డి ప్రసంగించినట్లుగా చెబుతున్న వీడియో ఉందని చెప్పి ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని పిటిషనర్ తప్పుపట్టారు. తాను ప్రసంగించినట్లు ఉన్న వీడియో ఆధారంగా కేసు నమోదు చెల్లదని, సీడీ ఆధారంగా ఫిర్యాదు చేశారని, అయితే దీన్ని సంబంధిత కోర్టుకు అందజేయలేదని అన్నారు. పోలీసుల చార్జిషీట్‌లో కూడా సీడీ ప్రస్తావన లేదని అన్నారు. ఫిర్యాదుకు ఈ సీడీ ఒక్కటే ఆధారమని, దాన్ని మాత్రం కోర్టుకు సమర్పించలేదని తప్పుపట్టారు. చార్జిషీట్ ఆధారంగా నాంపల్లి కోర్టు విచారణకు స్వీకరించడం చట్టవిరుద్ధమన్నారు అయిదుగురు సాక్షులను విచారించారని, వారంతా అధికారులేనని, సాక్షుల్లో ఒక్క ఓటరు కూడా లేరన్నారు. ఎలాంటి నేరం చేయలేదని, అయినా అన్యాయంగా కేసు నమోదు చేశారన్నారు. రాజకీయ కక్షతోనే కేసును పెట్టారని చెప్పారు. నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులోని కేసును కొట్టివేయాలని కౌశిక్‌రెడ్డి హైకోర్టును కోరారు.

# అంతరిక్షంలో జీవం అంకురిస్తుంది

ప్రయోగం విజయవంతం : ఇస్రో

భూమ్యాకర్షణ లేకుండా

అలసందల విత్తనాలు మొలకెత్తాయ్

త్వరలో ఆకులూ పుట్టుకొస్తాయి



**న్యూఢిల్లీ :** అంతరిక్షంలో జీవం అంకురిస్తుందని 'ఇస్రో' ప్రకటించింది. అంతరిక్షంలో 350 కి.మీ ఎత్తులోకి ఉపగ్రహాలను పంపించాక పోయమ్–4 వేదికపై నాలుగు రోజుల్లోనే విత్తనం మొలకెత్తిందని, ప్రయోగం విజయవంతమైందని, త్వరలో ఆకులు కూడా పుట్టుకు వస్తాయని ఇస్రో శనివారం నాడు ప్రకటించింది. ఐదు రోజుల క్రితం డిసెంబరు 30న పిఎస్ఎల్‌వి–సి 60 వాహకనౌక ద్వారా రెండు అంతరిక్ష జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. భూమ్యాకర్షణశక్తి లేని స్థితిలో అలసందల విత్తనాలను అంతరిక్షంలో మొలకెత్తించాక ఇస్రో ఈ తాజా ప్రకటన చేసింది. పోయమ్–4 వేదికపై ఈ అలసందల విత్తనాలను ప్రయోగప్రాతిపదికపై ఇస్రో మొలకెత్తింపజేసింది. 'క్రాప్స్' ప్రయోగం ద్వారా ఇది సాధ్యమైంది.

అదేవిధంగా భూమి పరిభ్రమణం చేసే 470 కిమీ ఎత్తులో స్పేస్ డాకింగ్ ప్రయోగ కార్యక్రమంపై ఛాసర్ ఉపగ్రహం ఒక సెల్ఫీ వీడియోను రూపొందించింది. ఈ సెల్ఫీ వీడియోను కూడా ఇస్రో పోస్టు చేసింది. అంతరిక్షంలో లక్ష్యానికి అనుగుణంగా ఛాసర్ ఉపగ్రహం తన జంట ఉపగ్రహంతో బహుశా మంగళవారం అనుసంధానం అవుతుందని అంచనా వేస్తున్నారు.

అంతరిక్ష కక్ష్యలో మొక్కల అధ్యయనం కోసం అతి తక్కువస్థలంలో అవసరమైన పరికరాలతో పోయమ్–4 వేదిక ఏర్పాటు చేశారు. మొక్కల కోసం తగిన వాతావరణాన్ని సృష్టించి విత్తనాలను మొలకెత్తించేందుకు చేసే ప్రయోగాలను "కాంపాక్ట్ రీసెర్చ్ మాడ్యూల్ ఫర్ ఆర్బిటల్ ప్లాంట్ స్టడీస్" అని పిలుస్తారు. దీనిని సంక్షిప్తంగా "క్రాప్స్" అంటారు. ఈ "క్రాప్స్" ప్రయోగాలను భూమ్యాకర్షణలేని పరిస్థితుల మధ్య విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (విఎస్ఎస్‌సి) నిర్వహించింది.

"అంతరిక్షంలో జీవం అంకురిస్తుంది! పోయమ్–4 వేదికపై విఎస్ఎస్‌సి 'క్రాప్స్' ప్రయోగం విజయవంతమైంది, అలసందల విత్తనాలు నాలుగు రోజుల వ్యవధిలో మొలకెత్తాయి, త్వరలో ఆకులు కూడా పుట్టుకొస్తాయి" అని ఎక్స్ వేదికగా ఇస్రో ఒక పోస్టింగ్ పెట్టింది. 'స్పేస్‌డెక్స్ జంట ఉపగ్రహాలను డిసెంబరు 30 రాత్రి పిఎస్ఎల్‌వి–సి 60 అడ్వాన్స్‌డ్ వాహకనౌక కక్ష్యలోకి పంపించింది. భూమికి 350 కి.మీ ఎత్తులో ఈ వేదికద్వారా మొత్తం 24 ప్రయోగాలు చేపడతారు. "అంతరిక్షంలో ఉన్న విభిన్నమైన, అసాధారణ వాతావరణ పరిస్థితుల మధ్య ఏ విధంగా మొక్కలు మొలుస్తాయి" అనే విషయాన్ని అర్థం చేసుకోవడం కోసం ఈ 'క్రాప్స్' ప్రయోగాలను ఇస్రో తలపెట్టింది. రాబోయేకాలంలో ఇస్రో దీర్ఘకాలిక ప్రయోగాలను చేపట్టబోతున్నది. సుదీర్ఘకాలంపాటు అంతరిక్షంలో ఉండి భవిష్యత్‌లో ప్రయోగాలు కొనసాగించాలంటే ఇవన్నీ అర్థం చేసుకోవడం ఎంతో అవసరం. మొత్తం ఎనిమిది అలసందల విత్తనాలను తీసుకువెళ్ళి నియంత్రిత వాతావరణం మధ్య అక్కడ ప్రయోగం చేశారు. ఈ విధంగా బహుముఖ వేదికల ద్వారా మొక్కలు పెంచడం ఇస్రో భవిష్యత్‌లో ఇస్రో శక్తిసామర్థ్యాలకు చిహ్నంగా ఉంటుంది. ఈ విధంగా ఆకులు విచ్చుకుని మొక్కలు జీవం కొనసాగిస్తే ఆ వాతావరణంలో తదుపరి ప్రయోగాలకు ఎంతో ఆ పరిస్థితులు ఉపకరిస్తాయి. మొత్తం ఏడురోజులపాటు ప్రయోగాలు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఒక మొక్క మొలిచేందుకు జీవక్రియలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అక్కడ చేశారు. తేమ, ఉష్ణోగ్రత, ఆక్సిజన్, కార్బండైయాక్సైడ్, మట్టిలో తేమ నియంత్రణ వంటి అన్ని కండిషన్స్‌ను ఏర్పాటు చేశారు.

# ఎంసిపిఐ(యు) పార్టీలో విలీనమైన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంసిపిఐ(యు) పార్టీలో వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కమిటీని విలీనమైంది. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్ ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్దికాయల అశోక్ సమక్షంలో వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు పాండురంగరావు విలీనం చేశారు. ఈ సందర్భంగా పాండురంగచారికి అశోక్ ఎంసిపిఐ(యు) కండువా కల్పి పార్టీలోకి ఆహ్వానించి విలీనం ప్రక్రియను పూర్తి చేశారు. పాండురంగారావుతో పాటు వర్కర్స్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు వడ్ల అరుణ, ఇబ్రాహీం పట్నం నియోజకవర్గం ఇంఛార్జ్ మునుకుంట్ల మురళి ఎంసిపిఐ(యు)లో చేరారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఎంసిపిఐ(యు) దేశం లో, రాష్ట్రంలో కమ్యూనిస్టు వామపక్ష సామాజిక శక్తుల ఐక్యత కోసం నిరంతరం చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో వర్కర్స్ పార్టీని విలీనం చేయడం యంసిపిఐ(యు) చేస్తున్న కృషికి ఒక తోడ్పాటు అందిస్తుందన్నారు. పార్టీలో చేరిన వారందరూ పార్టీ నిబంధనలకు కట్టుబడి పని చేయాలని కోరారు. పాండురంగాచారి మాట్లాడుతూ ఎంసిపిఐ (యు) పార్టీ సామాజిక న్యాయం ఎజెండాకు కట్టుబడి, బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానంతో పని చేస్తోందన్నారు. ఏ పాలకవర్గ బూర్జువా భూస్వామ్య పార్టీలతో ఎన్నికలల్లో కానీ, ఇతర సందర్భంగా కానీ కలవకుండా నీతినిజాయితిగా నిబద్ధతకు పార్టీ కార్యక్రమంను అమలు చేస్తున్న విధానం, దేశంలో రాష్ట్రంలో కమ్యూనిస్టుల ఐక్యత కోసం చేస్తున్న కృషికి ఆకర్షితులై తమ వర్కర్స్ పార్టీని ఎంసిపిఐ(యు) లో విలీనం చేసినట్లు ప్రకటించారు.

# బిసి సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి పొన్నం 'బడ్జెట్ సన్నాహక సమావేశం'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత బడ్జెట్‌లో బిసి సంక్షేమ శాఖ ప్రతిపాదనలు, అమలు తదితర అంశాలపై బిసి సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ బడ్జెట్‌పై శాఖాపరమైన సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులను బడ్జెట్‌కి కేటాయించే అంశాలపై తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిసి సంక్షేమ శాఖలో అమలు చేస్తున్న పథకాలను చేయూత ద్వారా వాటికి కేటాయించే బడ్జెట్ ప్రతిపాదనలపై పలు సూచనలు చేశారు. ఇప్పటికే ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు పెంచిందని, దానిని మెనూ ప్రకారం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్‌లో పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు వారికి అందించే యూనిఫామ్స్, పుస్తకాలు ఇతర వస్తువులు అందించాలన్నారు. బిసి గురుకుల పాఠశాలలకు నూతన భవనాల కోసం ప్రతిపాదనలు పెట్టాలన్నారు. ఇప్పటికే గీతా కార్మికుల కోసం 10 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ జరిగిందని, దానిని అధిక మొత్తంలో పెంచుతామన్నారు. ఇప్పటికే సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విధంగా మోడ్రన్ దోభిఘట్‌లు ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కుల వృత్తులకు ప్రాధానత్య ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. కుల వృత్తులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కుమ్మరి వృత్తి వారి నుండి అధునాతన వస్తువులు మట్టి పాత్రలు కప్స్, వాటర్ బాటిల్స్ తయారుచేసి, మట్టి పాత్రలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 17 వ తేదిన మరో సారి సమావేశాన్ని ఏర్పాటు చేసి వివిధ ప్రతిపాదనలపై మరోసారి చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్,కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల కార్యదర్శి సైదులు హాజరయ్యారు.

# 'ఇపియాన్' స్పెషలిస్ట్ డాక్టర్ మినల్ చంద్రకు 'దక్షిణ భారత మహిళా అచీవర్స్ అవార్డ్'




**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్య రంగంలో అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఇపియాన్ కో ఫౌండర్ ,పెయిన్ స్పెషలిస్ట్ కన్సల్టెంట్ డాక్టర్ మినల్ చంద్రకు 'దక్షిణ భారత మహిళా అచీవర్స్ అవార్డ్స్ 2024"(ఎస్ఐడబ్ల్యుఎఎ) లభించింది. వివిధ రకాల సంక్లిష్ట నొప్పులకు ఆధునీక సాంకేతికతను జోడిస్తూ అద్భుతమైన చికిత్స ను అందిస్తూ, అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నందుకు గాను డాక్టర్ మినల్ చంద్రకు 'దక్షిణ భారత మహిళా అచీవర్స్ అవార్డ్'కు ఎంపికైంది. భూజాలు, మోకాలు,నడుము ఇలా పలు రకాల నొప్పులకు డాక్టర్ మినల్ చంద్ర అందిస్తున్న చికిత్సతో చాలా మంది నొప్పులతో విముక్తి పొందారని, సర్జరీలు చేయకుండా రక్తం పోకుండా ఆధునీకర పద్ధతిలో చికిత్సను అందిస్తున్నట్టు ఇపియాన్ వైద్య బృందం తెలిపింది. దేశవ్యాప్తంగా దూర ప్రాంతాల నుంచి తమ వద్దకు చికిత్స నిమిత్తం వస్తారని, వారి సమస్యకు తమ వద్ద పరిష్కారాన్ని చూపుతున్నామని, అందుకే తమ చికిత్స పట్ల రోజు రోజుకూ ఆదరణ లభిస్తుందని డాక్టర్ మినల్ చంద్ర వెల్లడించారు. దక్షిణ భారతదేశంలో వివిధ వ్యాపార రంగాల్లో రాణిస్తున్న మహిళలను గుర్తించి, వారికి తోడ్పాటును అందించడంతో పాటు వారు తమ తమ రంగాలల్లో మరింత ఎదిగి వ్యాపార దిగ్గజంగా ఎదగాలనే ఉద్దేశంతో ట్వెల్ మీడి యా ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో గత కొంత కాలంగా అవార్డులను అందజేస్తున్నట్టు ట్వెల్ మీడియా సంస్థ తెలిపింది.

# 'విజన్ 2047' లక్ష్యంతో ముందుకు సాగాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విజన్ 2047 లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కార్యాచరణతో అధికారులు ముందుకు సాగాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. ఏ శాఖలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శనివారం జరిగిన ' ఎన్విజన్ తెలంగాణ 2047' సింపోజియంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అధికారులు సామాజిక బాధ్యతతో కృషి చేయాలన్నారు. శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని అమలు చేయాలని, అందుకు శాఖల వారీగా రోడ్‌మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విద్య, వైద్యం, నీటిపారుదల, విద్యుత్, వ్యవసాయం, ఉద్యోగాల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని చిన్నారెడ్డి సూచించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ శశాంక గోయల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరిమురళి, వైద్య శాఖ నిపుణులు డాక్టర్ గంగాధర్, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ హెడ్ కెప్టెన్ లింగాల పాండురంగారెడ్డి, ఆర్థిక నిపుణులు జి .ఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టియుడబ్ల్యుజె పోరాటాలు ఆకర్షించాయ్





దానికి అనుబంధంగానే పని చేస్తాం

తెలంగాణ వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ వెల్లడి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దశాబ్దాలుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె (ఐజెయు)) అవిశ్రాంతంగా పోరాడడం తమను ఎంతగానో ఆకర్షించిందని, ఆ సంఘానికి అనుబంధంగా పని చేసేందుకు తమ అసోసియేషన్ నిర్ణయం తీసుకుందని తెలంగాణ వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ బాధ్యులు వెల్లడించారు. శనివారం నాడు బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో జరిగిన అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి హరీష్‌లు తమ నిర్ణయాన్ని సభా ముఖంగా ప్రకటించి, టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీకి లేఖను అందించారు.ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ వీడియో జర్నలిస్టులు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం తమ సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె ఉప ప్రధాన కార్యదర్శి కె రాములు, కార్యదర్శులు వి.యాదగిరి, కె.శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి ఎం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రాజేష్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరి, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్, టియుడబ్ల్యుజె మహిళ విభాగం బాధ్యురాలు కల్యాణం రాజేశ్వరిలతో పాటు వీడియో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

**ప్రజాపక్షం/షాబాద్ :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యం అవుతుందని గురు స్వామి దర్పల్లి రవీందర్ గౌడ్ అన్నారు. శనివారం షాబాద్ హనుమాన్ దేవాలయ సనిధిలో అయ్యప్ప స్వాములకు డాక్టర్ ముస్తాఫ భిక్ష ఎర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గురు స్వామి దర్పల్లి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. మతాల కతీతంగా డాక్టర్ ముస్తాఫ ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వామి భక్తులకు భోజన వసతి ఇప్పటి వరకు ఆరు సార్లు ఎర్పాటు చేయడం జరిగిందన్నారు. మతాలకు అతీతంగా మానవ సమాజంలో అందరూ ఒక్కటే అనే విధంగా డాక్టర్ ముస్తాఫ ఆధ్యాత్మికంగా అలోచించడం సంతోషంగా ఉందన్నారు. అని మతాలు మానవాలి ఐక్యత కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం డాక్టర్ ముస్తఫకు అయ్యప్ప స్వాములు శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు తదితరులు ఉన్నారు.

# మా గ్రామానికి బ్యాంకు మంజూరు చేయండి

**ప్రజాపక్షం/తలకొండపల్లి :** తమ గ్రామానికి బ్యాంకు మంజూరు చేయాలని కోరుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవిని గట్టుఇప్పలపల్లి గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన పార్లమెంట్ సభ్యులు అతి తొందర్లోనే మీ గ్రామానికి బ్యాంకు మంజూరు చేయిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ వెలిగొండ మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు గాదె రేణు రెడ్డి, యువజన కాంగ్రెస్ తలకొండపల్లి మండల అధ్యక్షులు ఇందికంటి శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు కల్పించడానికి కృషి

**ప్రజాపక్షం/యాచారం :** అర్హులైన పేదలందరికి ఉపాధి పనులు కల్పిండానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధి కూలీల వివరాలను నమోదు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో గ్రామ స్థాయిలో ఎలాంటి పనులు చేయాలనే విషయాలను గ్రామ సభల ద్వారా చర్చించి పనులను గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ లింగయ్య ఫిల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# భావ ప్రకటనా స్వేచ్ఛ, పరిశోధనలపై దాడిని ఖండించండి

ప్రజలకు, ప్రజాస్వామ్యవాదులకు సిపిఐ(ఎం) పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'వీక్షణం' సంపాదకులు ఎన్.వేణుగోపాల్ మీద సోషల్ మీడియాలో చేస్తున్న దాడిని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం సిపిఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పత్రిక ప్రకటన విడుదల చేశారు. తమకు నచ్చని పుస్తకాన్ని అమ్ముతున్నారనే పేరుతో వేణుగోపాల్‌పై కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం మీద పరిశోధనలు జరిపిన ఒక చరిత్రకారుడు, అది పూర్వం బౌద్ధక్షేత్రం అనీ, దానికి ఆధారాలున్నాయని 40 సంవత్సరాల క్రితం పుస్తకం విడుదల చేశారని. ఇప్పుడు అది తెలుగులో వెలువడిన ఈ పుస్తకాన్ని హైద్రాబాద్ బుక్ ఎగ్జిబిషన్‌లో అమ్మకానికి పెట్టడాన్ని వీరు ప్రశ్నిస్తుండడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ చర్యలు భావ ప్రకటనా స్వేచ్ఛ మీద, పరిశోధనల మీద దాడిగా తమ్మినేని అభివర్ణించారు. ఆ పుస్తకాలలో చెప్పిన విషయాలపై అభ్యంతరాలున్నవారు వాటిని ఖండిస్తూ మరో పుస్తకం రాయడమో,ప్రకటనలు చేయడం చేయోచ్చు అని కాని ఒక మతానికి చెందినవారిని రెచ్చగొట్టి దాడులకు ప్రోత్సహించటం ప్రమాదకరమన్నారు. ఇలాంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటిని ఖండించాలని ప్రజలకు, ప్రజాస్వామ్యవాదులకు సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేస్తోందన్నారు. సోషల్ మీడియాలో ఇలాంటి క్యాంపెయిన్ చేస్తున్నవారి మీద తక్షణం చర్యలు తీసుకోవాలని తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే గౌరీ లంకేష్, ప్రొఫెసర్‌ఎంఎం కల్బుర్గి, నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే లాంటి మేధావులను ఇలాంటి శక్తులు హత్య చేశారని, రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టు తులసి చందుపై సైతం ఇదే పద్ధతిలో దాడులకు ఉసి గొలుపుతూ ట్రోలింగ్ చేస్తున్నారన్నారు. శాస్త్రీయ విమర్శలకు తట్టుకోలేనివారు, మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే శక్తులు మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడుతారని పేర్కొన్నారు. ఇలాంటి స్వార్ధపరుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని,ప్రజాస్వామ్య రక్షణకు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తెలుగు రాష్ట్రాలపై హైకోర్టు ఆగ్రహం

13 వాయిదాలు జరిగినా కౌంటర్ వేసే తీరిక లేదా?

మార్గదర్శి కేసులో హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిబంధనల ఉల్లంఘన కేసు విచారణ గత ఏడాది జూన్‌లో ప్రారంభించామని, ఇప్పటికి 13 వాయిదాలు జరిగాయని, అయినప్పటికీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాలు కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయలేదని హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది ఇంకా ఎన్నాళ్లకు కౌంటర్ దాఖలు చేస్తారని తెలుగు రాష్ట్రాలను నిలదీసింది. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా హైకోర్టు 2024 జూన్‌లో విచారణ ప్రారంభిస్తే ఇప్పటి వరకు 13 సార్లు విచారణ జరిగినా కౌంటర్లు వేయలేదంది. చిట్ట చివరిసారిగా మూడు వారాల గడువు ఇస్తున్నట్లు తెలిపింది. ఈసారి కూడా కౌంటర్ దాఖలు చేయకపోతే రెండు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులను విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేస్తామని తేల్చి హెచ్చరించింది. పనుల ఒత్తిడిలో ఉంటే ఆన్‌లైన్‌లోనైనా విచారణకు హాజరుకావాల్సిందేనని తేల్చి చెప్పింది. విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

చట్ట నిబంధలను ఉల్లంఘించినందుకు మార్గదర్శి, దాని కర్త రామోజీరావుపై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలంటూ నాంపల్లి కోర్టులోని ఫిర్యాదును హైకోర్టు 2018, డిసెంబర్ 31న కొట్టివేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, వైఎస్ జగన్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో వేర్వేరుగా అప్పీల్ దాఖలు చేశారు. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు కొట్టివేస్తూ గత ఏడాది ఏప్రిల్ 9న తీర్పు చెప్పింది. ఈ వివాదంపై విచారణ పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులో రెండు తెలుగు రాష్ట్రాలు కౌంటర్లు దాఖలు చేయకపోవడంతో శుక్రవారం ధర్మాసనం పైవిధంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.

# రోడ్డు భద్రత మాసోత్సవంపై అవగాహన కార్యక్రమాలు



### రోడ్డుభద్రత నియమాలను జిల్లాలో కచ్చితంగా అమలుచేస్తాం
### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రాష్ట్రప్రభుత్వ ఆదేశాలమేరకు రోడ్డుభద్రత నియమాలను జిల్లాలో కచ్చితంగా అమలు చేస్తామని కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. శనివారం హైదరాబాద్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు రవాణా అధి కారులతో రోడ్డుభద్రత పరిరక్షణపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ ఘునాథ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్‌సంతోష్ వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ కొత్త సంవత్సరం కొత్త సంవత్సరం నుండి ఈనెల 31వరకు నెలరోజులపాటు రాష్ట్రప్రభుత్వ ఆదేశాలమేరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని మంత్రికి తెలిపారు. ప్రజలకు రోడ్డు భద్రతపట్ల అవగాహన కల్పించి ప్రమాదాలను తగ్గించడం రోడ్డుభద్రత నియమాలపై అవగాహన పెంచడం, పాఠశాలలు, కళాశాలలో దీనిపై పిల్లలకు పలు పోటీలు నిర్వహించి , జిల్లాలో పౌరులు, ప్రజల ప్రాణాలకు రక్షణకల్పించేలా అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా చేపడుతామని మంత్రికి కలెక్టర్ తెలియజేశారు. అదేవిధంగా ముఖ్యకూడలిలో రోడ్డు ప్రమాద నివారణపైప్రదర్శనలు నిర్వహించడం, సురక్షిత రవాణాపై పల్లెనుంచి పట్టణాలవరకు ప్రచారయాత్రలు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా చేస్తామని మంత్రికి కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి :** జనవరి ఒకటి నుండి నెలరోజుల పాటు నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవాన్ని విజయవంతం చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి రాష్ట్ర రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవ నిర్వహణపై శనివారం రాష్ట్ర బీసీ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , రాష్ట్ర రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ లు హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రవాణా శాఖ అధికారులతో మీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లాలో రోడ్డు భద్రత మాసోవ్సవం పై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం చేపడుతున్న కార్యక్రమాల పై జిల్లా కలెక్టర్ మంత్రికి వివరిస్తూ. రోడ్డు భద్రత మాసోత్సవానికి సంబంధించి జిల్లా లో రవాణా శాఖ, ఆర్.టి.సి, విద్యా శాఖలు, పోలీస్ శాఖల ద్వారా సమన్వయంతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో వాహనదారులు ప్రజలే,రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా జిల్లా మంత్రి తో పాటు,ఇతర ప్రజాప్రతినిధులు అందరినీ సమన్వయం చేసుకొని జిల్లా, మండల స్థాయిలలో పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీలను నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ట్రాఫిక్‌పై సైతం అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కిషన్,ఆర్.టి.సి.ఆర్.ఎం.సంతోష్ కుమార్, ఆర్,బి ఇఇ దేశ్యా నాయక్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రఘు, ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

## హెల్మెట్ లేకుంటే నో ఎంట్రీ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను శనివారం జిల్లా రవాణశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలు, వాహనాలకు అంటించి అవగాహన స్టిక్కర్లను కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భగా కలెక్టర్ బదావత్‌సంతోష్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది అత్యంత ప్రాధాన్యమైనదని, మానవతప్పిదాలవల్ల అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై పోలీసుశాఖ అధికారుల ద్వారా కనుగొన్న బ్లైండ్ స్పాట్ల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన సూచికలను ఏర్పాటుచేయాలని ఆర్‌అండ్‌బి అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డుభద్రత చర్యలు పాటించేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణశాఖ అధికారి చిన్నబాలు, డిఈఓఎ రమేష్‌కుమార్, ఆర్‌అండ్‌బిఈఈవివిధశాఖల అధికారులు, ట్రాఫిక్‌పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సత్తేశ్వర ఆశ్రమ సేవలు అద్భుతం
### జడ్చర్ల సిఐ పెద్దిరెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** సత్తేశ్వర సేవ ఆశ్రమ లక్ష్మా ల్లో మరో మైలురాయి బెం గుళూరు వాసిని కుటుంబ సభ్యులకు అప్పగింత సత్తే శ్వర సేవ ఆశ్ర మంలో శుక్రవారం కోలుకున్న ఒక మాన సిక వికలాంగుణ్ణి వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పడం జరిగింది. బెంగళూరుకు చెందిన పురుషోత్తం అనే వ్యక్తిని నేడు పోలీసుల సమక్షంలో వారి కుటుంబ సభ్యులకు పంపించి నట్లు తెలిపారు. దాదాపు ఆరు సంవ త్సరాల క్రితం ఆశ్రమానికి చేరిన ఇతను తను బెంగళూరు వాసినని తెలు పడంతో అక్కడ వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆధార్ కార్డు ద్వారా వారి అడ్రస్ తెలుసుకొని అప్పగించినట్లు తెలిపారు. ఇప్పటికీ 112 మంది కోలుకున్న వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఆశ్రమ నిర్వా హకులు చిత్తనూరి ఈశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఆది రెడ్డి ఎస్సై, ప్రధాన కార్యదర్శి చిత్తనూరి రామకృష్ణ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని కుప్పగండ్ల గ్రామానికిచెందిన కానుగుల కుమార్ అనారోగ్యంతో మృతిచెందారు. ఈవిషయం బిఆర్ ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించి మృతుడి కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. మండలకేంద్రానికి చెందిన బస్సమోని శ్రీనివాసులు అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆయన కుటుంబానికి కూడా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ మాజీ అధ్యక్షులు భాస్కర్‌రావు, మాజీసర్పంచ్ సింగిల్‌విండోడైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, మాజీ సర్పంచ్ బాలలక్ష్మ య్య, ఉపసర్పంచ్ నర్సింహ్మ ముదిరాజ్, యువ నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు నిధుల మంజూరుపై హర్షం

**ప్రజాపక్షం/వెల్దండ :** రాష్ట్రప్రభుత్వం మండలకేంద్రంలో ఉన్న పాఠశాలలకు మౌలిక వసతులకల్పన నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిలకు కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, డైరెక్టర్ మట్టవెంకటయ్యగౌడ్, మాజీసర్పంచ్ భూపతిరెడ్డిలు హర్షం వ్యక్తంచేశారు. ఎంపిపిఎస్ బాలికల పాఠశాలకు మూత్రశాల నిర్మాణానికి రూ.10లక్షలు, ఎంపిపి ఎస్(ఎంఆర్సి) పాఠశాలకు డైనింగ్ హాల్, మూత్రశాలలు రూ.20లక్షలు, జిల్లాపరిషత్ పాఠశాలలో అదనపు గదులు, వంటగది, మూత్రశాలకు రూ.200లక్షలు, జిల్లాపరిషత్ పాఠశాల(బాలికల)రూ.70లక్షలు, ఆదర్శ పాఠశాలకు వంటగది, కాంపౌండ్‌వాల్‌లకు రూ.ఒకకోటి, ఎస్సి గురుకుల బాలికల పాఠశాలలో వంటగది, మూత్రశాలలు, అండర్‌గ్రౌండ్‌డ్రైనేజీలకు రూ.50లక్షల చొప్పన మొత్తం రూ.5కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఆనిధుల మంజూరు చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఇంటింటి సర్వే



**ప్రజాపక్షం/అచ్చంపేట:** ప్రభుత్వం ఆదేశానుసారం ఇందిరమ్మ ఇండ్లకు ఇంటింటి సర్వే జరుపుతున్నట్లు అచ్చంపేట ఎంపిడిఓ మధుసూద న్‌గౌడ్ అన్నారు. శనివారం అచ్చంపేట మండలం శివారుతండాలో సర్వేచేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదేశానుసారం ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం తామూ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో హౌజింగ్‌ఈఈ వెంకటేశ్వర్లు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నియమితులైన కమిటీ సభ్యులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/వెల్దండ:** జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యులుగానియమితులైన, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.మోతిలాల్‌నాయక్‌ను మండలపరిధిలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా భవిష్యత్తులో మరిన్ని స్వీకరించాలని అభినందించారు.

## అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు
### జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్

**ప్రజాపక్షం/నారాయణపేట :** నూతన సంవత్సరం 2025 సందర్భంగా నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్‌పి యోగేష్‌గౌతమ్,జిల్లా పోలీస్‌అధికారులు, సిబ్బందితో కలిసి నూతన సం వత్సరం వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నారాయణపేట పోలీసు శాఖలో ఎన్నో అనుభవాలతో అనుభూతులతో తీపి, చేదు గుర్తులతో 2024వ సంవత్సరం గడిఇచిపోయిందన్నారు. అదనపు ఎస్పీ ఎండి. రియాజ్ హుల్ హక్ , డిఎస్పీ ఎన్. లింగయ్య, ఎస్‌బి సిఐ రాంలాల్, ఆర్ఐ నర్సింహా, సిఐలు శివశంకర్, చంద్రశేఖర్, రాజేందర్ రెడ్డి, దుస్రు నాయక్, ఎస్ఐలు, మిగిలిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం : ఎమ్మెల్యే





**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి :** ప్రతి కాలనీలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని 12వ వార్డులో 50 లక్షలతో నిర్మించిన సిసిరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను ప్రారంభించారు. అలాగే ఇదే వార్డులో 80 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో సోషియా ఫ్లాజా, కమ్యూనిటీ హాల్ సిసి రోడ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య వైద్యం, ఉపాధి పైన అధిక ప్రాధాన్యత ఇస్తూ, అభివృద్ధి ఫలాలు అందరికీ అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్య మని ఆయన స్పష్టం చేశారు. అనంతరం నూత నంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ 12వ వార్డు కౌన్సిలర్ ఉమర్, నాయకులు శ్యామ్యూల్ దాసరి, అజ్మత్ అలి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం :** మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ లోని 13వ వార్డులో 30 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్ ను, 10 లక్షలతో నిర్మించిన మహిళా కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారం భించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మహిళలతో ఆయన మాట్లాడి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్ లక్ష్మి దేవి యాదగిరి గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వెన్నారపు లింగం యాదవ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర రెడ్డి మున్సిపల్ సిబ్బంది, నాయకులు అజ్మత్ అలి, శ్యామ్యూల్, ఫయాజ్ కౌన్సిలర్లు కార్య కర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కోసం ఏర్పాట్లు



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి/జడ్చర్ల :** జడ్చర్లలో ఈ నెల 7 8 9 తేదీలలో జరగనున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, రాష్ట్రంలో 33 జిల్లాల నుండి 2500 మంది విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. వారు మాట్లాడుతూ జడ్చర్ల మండలం పోలేపల్లిసెజ్‌లో ఉన్న ఎస్వికేఎం ఇంటర్నేషనల్ స్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా విద్యాశాఖతో పాటు ఉన్నతాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని, వైజ్ఞానిక ప్రదర్శన కోసం 26 కమిటీలు వేశారని, వివిధ జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులు ఉపాధ్యాయులు కోసం ప్రత్యేకంగా వసతి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. బాలుర కోసం స్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో బాలికలు కోసం కేజీబీవీ బాలనగర్‌లో వసతిని కల్పించనున్నారు.561ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమమైన ప్రదర్శనను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ డిఇఒ ప్రవీణ్ కుమార్ డిఎస్ఒ శ్రీని వాసులు కమిటీలను సమన్వయం చేస్తూ సూచనలిస్తున్నారు. వైజ్ఞానికి ప్రదర్శన కోసం అతిథులకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లా విద్యశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ డి.ఎస్ఓ శ్రీనివాసులు జడ్చర్ల ఎంఇఒ మంజులదేవి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహా రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జడ్చర్ల ఎంఎల్‌ఏ అనిరుధ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి విద్యా కమిషన్ చైర్మర్ ఆకునూరి మురళి పాటు జిల్లా ప్రజా ప్రతినిధులును విద్యాశాఖ ఉన్నతధికారులను సైన్స్ ఫేర్ సందర్శనకు రావాల్సిందిగా ఆహ్వానించారు.

## పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/పెద్దమందడి :** పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పిసిఈఓ యాదయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం ఆయన జెడ్‌పి డిప్యూటీ సిఇఒ రామేశ్వర్ రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నుండి నిర్వహిస్తున్న ప్రతి పనిని రికార్డులలో నమోదు చేయాలని, మండల పరిషత్ అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సద్గుణ, ఎంపిఒ పుష్ప కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం / నారాయణపేట:** శరీర దారుఢ్యానికి, మానసిక వికాసానికి కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె. రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. మా కేశవ్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఫౌండర్ వ్యవస్థాపకులు కేశవ్ మాస్టర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కరాటే విద్యార్థిని విద్యార్థులకు శనివారం నారాయణపేట పట్టణంలోని ఎస్.ఆర్. గార్డెన్స్‌లో బెల్టుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె. రాజ్ కుమార్ రెడ్డి హాజరై విద్యార్థినీ, విద్యార్థులకు బెల్టులను అందజేశారు. అంతకు ముందు కరాటే విద్యార్థులు పలు విన్యాసాలు, ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడా రంగాల్లో రాణిం చేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేశవ్ కరాటే అకాడమీ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ అశోక్ , అనురాధ, మహేశ్వరి, రాకేష్ , వైశాలి, ఆరాధ్య, ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, బాలాజీ, గోపాల్ , సుదర్శన్ రెడ్డి, వెంకటేష్ , శివరాజ్ , శ్రీనివాస్ , నర్సింహ, సంతోష్ , మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రుద్రారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
### ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**ప్రజాపక్షం/అచ్చంపేట :** రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను సంపూర్ణంగా అందిస్తుందని ప్రతిపక్షాలనిందలకు తావులేదని ఎమ్మె ల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నా రు. శనివారం పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ , సిఎం రిలీఫ్‌ఫండ్‌కు సంబంధించిన లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ 270 చెక్కులు పంపిణీ చేయగా, సిఎం రిలీఫ్ ఫండ్ కింద 137 మంది లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పేదలకు వరమని నియోజకవర్గ ప్రజలందరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అచ్చంపేట మున్సిపల్‌చైర్మన్ గార్లపాటిశ్రీనివాసులు, వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## అచ్చంపేటను అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట పట్టణంలోని అ న్ని సమస్యలను సంపూర్ణం గా తన హయాంలోనే అభి వృద్ధి చేస్తానని ఎమ్మెల్యే డాక్ట ర్ వంశీకృష్ణ అన్నారు. శని వారం రూ.40లక్షల వ్యయ ంతో చేపట్టిన పలు సిసి రోడ్ల కు శంకుస్థాపన చేశారు. మా ట్లాడుతూ పట్టణం కాంగ్రెస్ కాలంలోనే అభివృద్ధి చెందిందని మళ్లీ కాంగ్రెస్‌తోనే అభివృద్ధిచెందుతుందన్నారు. అందుకోసమే ప్రణాళికంగా పనులు చేపడుతున్నామన్నారు.

**ప్రతి పనిని సంపూర్ణంగా చేయించే బాధ్యతనాది :** అచ్చంపేట మున్సిపాలిటీపరిధిలో ప్రతి అభివృద్ధిపథకానికి తాను బాధ్యత వహిస్తానని అచ్చం పేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటిశ్రీనివాసులు అన్నారు. సిసిరోడ్ల నిర్మాణం సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేట మినీ ట్యాంకుబండ్, విగ్రహాల ప్రతిష్టాపనతోపాటు ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్‌సౌకర్యం మున్సిపల్ ఆధ్వర్యంలో పూర్తిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా కూరగాయలమార్కెట్, మాంసం మార్కెట్‌తో పాటు చిరు వ్యాపారులకు కూడా ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌరిశంకర్, వెంకటేష్, బాబా, పాల్గొన్నారు.

# రైతు భరోసా హామీ అమలు చేయాలి




**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల పథకాలను అమలు పర్చాలని లేని యెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామన్నారు. కొత్తకోట మండల కేంద్రంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూ ధరణి, భూభారతి 2024 పేరు మార్పు చేసిందని గవర్నర్ ఆమోదించిన తర్వాత గెజిట్ ప్రకటించాల్సి ఉంది. తర్వాత చట్టానికి రూల్స్ రూపొందించాలి. సాగుదారుల హక్కులు నమోదు చేస్తామని సీఎం ప్రకటించిన నమోదు చేస్తామని సిఎం ప్రకటించిన భూ భారతి చట్టం లోని 23 సెక్షన్లలో ఎక్కడ పేర్కొనలేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత వానకాలం యాసంగి పంటలకు ఎకరాకు 7500 ఇస్తామన్న వాగ్దానాన్ని పక్కనపెట్టి రైతులు మళ్లీ అప్లై చేసుకోవాలని చెప్పడం మరి ఎగవేతకు దారి లాంటిదని ఆయన వివరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. గోపి, బాల్ రెడ్డి, మండ్లరాజు, బొబ్బిలి నిక్సన్ , వెంకట్రాములు, రాజు, పరమేశ్వరచారి, మేకల ఆంజనేయులు, బాల్య నాయక్ పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్‌కు స్థల పరిశీలన



**ప్రజాపక్షం/పెద్దమందడి :** మండల పరిధిలోని పామిరెడ్డిపల్లి గ్రామ శివారులోని శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నంబర్లు 146 భూమి స్థలాన్ని పెద్దమందడి తహసీల్దార్ సరస్వతి పరిశీలించారు. విద్యుత్ సబ్ సెక్షన్ నిర్మాణం కోసం పరిశీలించిన నివేదికలను జిల్లా కలెక్టర్ అందజేస్తున్నట్లు వారు తెలిపారు. త్వరలోనే సబ్ స్టేషన్ నిర్మాణం కోసం భూ పూజ కూడా చేయనున్నట్లు వారు తెలిపారు. వారితో పాటు ఆర్ఐ గణేష్ , సర్వే పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## అభ్యుదయ ఆదర్శ రైతుకు పురస్కారం




**ప్రజాపక్షం/పెబ్బేరు :** పట్టణానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ప్రవీణ్ కుమార్‌రెడ్డికి శనివారం విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా అభ్యుదయ ఆదర్శ రైతు పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు, నర్సరావుపేట ఎంపి రావు శ్రీకృష్ణదేవ రాయులు, పద్మశ్రీ వై. వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ లావురత్తయ్య చేతుల మీదుగా విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ ఆదర్శ రైతు పురస్కారం అందజేశారు.

## నర్సరీకి కంచె ఏర్పాటు



**ప్రజాపక్షం/పెద్దమందడి :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని నాగ ర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ అన్నారు. మండల పరిధిలోని కల్వరాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన నర్సరీకి ఇనుకంచను ఏర్పాటు చేయించారు. పశువుల బెడద నుంచి నర్సరికి రక్షణగా కంచెను ఏర్పాటు చేసినట్లు పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ తెలిపారు.

## కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్‌పి,డిఎస్‌పి



**ప్రజాపక్షం/నారాయణపేట :** నూతన సంవత్సరం 2025 సందర్భంగా శనివారం జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ , డిఎస్‌పి ఎన్. లింగయ్యలు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా పోలీసుశాఖ అందరికీ నూతన సంవత్సర శుభాకా ంక్షలు తెలిపి జిల్లాలో పోలీస్ శాఖ బాగా పని చేస్తుం దని, అదే ఉత్సాహంతో మరింత బాగా పని చేసి జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షిస్తూ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు.

## 9న 'డిమాండ్ డే'గా జరుపుదాం



**ప్రజాపక్షం/మక్తల్ :** ఈనెల 9న 'డిమాండ్ డే'గా జరపాలని అఖిల భా రత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు భగవంతు అన్నారు. శనివారం మక్తల్ పట్టణంలోని ఐబిలో అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో జనవరి 9 డిమాండ్ డే పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏఐయూకెఎస్ జిల్లా అధ్యక్షులు పంచాదేవ్ పాడు రాజ్ మాట్లాడుతూ వ్యవసాయ మంత్రిత్వ శాఖ తన బడ్జెట్ కేటాయింపులను 2014/15 నుండి 2024/ 2025 వరకు ఐదు ఇంతలు పెంచిందని మోడీ పాలన కూడా పేర్కొంది. అయితే గ్రౌండ్ రియాలిటి , రైతుల జీవిత అనుభ వాలు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత ఐసిడిఎస్, మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదు. 2014 నుండి వ్యవ సాయ కూలీల వాస్తవ వేతనాలు ప్రతి సంవత్సరం 1.3 శాతం తగ్గాయి. ఇది మా గణాంకాలు కాదు, భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాం కాలు, అదే విధంగా వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధర విషయంలో ఐదు రెట్లు పెంచారా ? మళ్లీ లేదు. మోడీ పాలనలో ఐదు రెట్లు పెంచండి అని జుమ్లా ప్రచారం చేస్తున్నప్పటికి వాస్తవానికి గత పదేళ్లలో నాలుగు ఫ్లాగ్ షిప్ పథకాల్లో బడ్జెట్ కేటాయింపులు, ప్రజాపంపిణీ వ్యవస్థ ఎన్ఆర్ ఆజీవి, ఐసిడిఎస్ , మిడ్ డే మిల్లు మోడీ పాలనలో ఒక విధంగా లేదా మరొక విధంగా నిర్వీర్యమయాయి. జనవరి 9న డిమాండ్స్ దే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్స్ విడుదల చేయడం జరి గింది. ఈ సమావేశంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం ఏఐయూకెఎస్ నాయకులు, మహమూద్ ,పరశురాంగౌడ్, చెన్నకేసవగౌడ్, భీమన్న, నర్సిములు, చంద్రశేఖర్, నర్సింహ, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఫోకస్


వొలొడర్ ముర్జిన్

మహిళల విభాగంలో హంపి టైటిల్ గెల్చుకోగా, జు వెన్జున్ (చైనా), కతెర్యానా లాగ్నో (రష్యా) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో మొదటి మూడు స్థానాలను రష్యా ఆటగాళ్లే ఆక్రమించడం విశేషం. 18 ఏళ్ల వొలొడర్ ముర్జిన్ మొత్తం 10 పాయింట్లతో అగ్రస్థానాన్ని ఆక్రమించి, టైటిల్ అందుకున్నాడు. అతని సహచరులు అలెగ్జాండర్ గ్రిస్‌చుక్, ఇయాన్ నెపోనియాచ్చి వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మహిళల విభాగంలో మొదటి మూడు స్థానాల్లో ఉన్న కోనేరు హంపి, జు వెన్జున్, లాగ్నోలకు వరుసగా 60,000, 40,000, 28,000 డాలర్లు చొప్పున ప్రైజ్‌మనీ లభించింది. అదే విధంగా పురుషుల విభాగంలో విజేత ముర్జిన్‌కు 90,000 డాలర్లు లభించాయి. గ్రిస్‌చుక్, నెపోనియాచ్చి 70,000, 56,000 డాలర్ల చొప్పున ప్రైజ్‌మనీ సంపాదించుకున్నారు.

# 'జయహో' హంపీ

ప్రపంచ చెస్ సమాఖ్య 'ఫిడే' నిర్వహించిన పురుషుల ప్రపంచ చాంపియన్‌షిప్‌ను భారత ఆటగాడు గుకేశ్ దొమ్మరాజు కైవసం చేసుకోగా, కొన్ని రోజుల తేడాతో మహిళల ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను హంపి గెల్చుకోవడం తెలుగువారందరికీ గర్వకారణం. కోనేరు అశోక్, లత దంపతులకు ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడలో 1987, మార్చి 31న జన్మించిన హంపి, చిన్నతనం నుంచే చెస్ పట్ల ఆసక్తి పెంచుకొని, తండ్రి వద్ద శిక్షణ తీసుకుంది. కేవలం ఆరేళ్ల వయసులోనే విజయవాడ నగరం, కృష్ణా జిల్లా అండర్–8 ఇభాగంలో చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకోవడం ద్వారా తన జైత్రయాత్రను ప్రారంభించింది. 1999లో, ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలైన ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ (డబ్ల్యుఐఎం)గా అవతరించింది. 2001: మహిళా గ్రాండ్ మాస్టర్ (డబ్ల్యుజిఎం) హోదాను సంపాదించింది. ఈ ఘనతను సాధించిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. 2012లో జరిగిన మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్షిప్‌లో కాంస్యం సాధించి, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. 2019లో జరిగిన స్కోల్కోవో మహిళల గ్రాండ్ ప్రీ, మొనాకో మహిళల గ్రాండ్ ప్రీతోపాటు ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను కూడా తన ఖాతాలో వేసుకొని సంచలనం సృష్టించింది. 2020లో కెయిర్న్స్ కప్ పోటీల్లో స్వర్ణం సాధించింది. అదే ఏడాది ఫిడే ఆన్‌లైన్ చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం, 2021 ఫిడే ఆన్‌లైన్ చెస్ ఒలింపియాడ్‌లో కాంస్యం సంపాదించింది. 2022లో జరిగిన 44వ చెస్ ఒలింపియాడ్‌లో మూడో స్థానాన్ని ఆక్రమించింది. అదే టోర్నీలో గప్రిందాష్విలి కప్‌ను గెల్చుకున్న జట్టులో సభ్యురాలిగా ఉంది. ఆ తర్వాత జరిగిన ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని అందుకుంది. అంతేగాక, పిఎస్‌పిబి ఇంటర్–యూనిట్ చెస్ అండ్ బ్రిడ్జ్ టోర్నమెంట్‌లో 'ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్'గా నిలిచింది. 2023లో, గ్లోబల్ చెస్ లీగ్‌లో రజతాన్ని, అదే ఏడాది టాటా స్టీల్ ఇండియా చెస్ టోర్నమెంట్ మహిళల బ్లిట్జ్ విభాగంలో రజతాన్ని స్వీకరించింది. ఈ ఏడాది మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో రజత పతకాన్ని గెల్చుకుంది. తాజాగా ప్రపంచ ర్యాపిడ్ చెస్ మహిళల చాంపియన్‌షిప్ టైటిల్ అందుకుంది. 2019లోనూ ఇదే టోర్నమెంట్‌ను గెల్చుకున్న హంపి, రెండు పర్యాయాలు చాంపియన్‌గా నిలిచిన రెండో మహిళగా రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించింది. అంతకు ముందు 2017, 2018 సంవత్సరాల్లో చైనాకు చెందిన జు వెన్జున్ ప్రపంచ మహిళల ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను సాధించింది. ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను పురుషుల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ రెండు పర్యాయాలు (2003, 2017) స్వీకరించాడు. అతని వారసత్వాన్ని కొనసాగిస్తూ హంపి రెండోసారి ఈ టైటిల్‌ను గెల్చుకుంది.



# జీన్స్ తెచ్చిన తంటా!

ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో ఐదుసార్లు (2014, 2015, 2019, 2022, 2023) చాంపియన్‌గా నిలిచిన మాగ్నస్ కార్ల్‌సెన్ ఈసారి టైటిల్‌ను నిలబెట్టుకోకుండానే టోర్నీ నుంచి వైదొలిగాడు. జీన్స్ ప్యాంట్ ధరించినందుకే అతను టోర్నీలో కొనసాగే అవకాశాన్ని కోల్పోయాడు. మొదటి ఎనిమిది రౌండ్లలో అతను 5 పాయింట్లు సంపాదించాడు. ఆ సమయంలో జీన్స్ వేసుకొని వచ్చిన కార్ల్‌సెన్‌ను తొమ్మిదో రౌండ్ గేమ్ ఆడేందుకు 'ఫిడే' అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేగాక, అతనికి తొమ్మిదో రౌండ్‌లో ప్రత్యర్థిని ఖరారు చేయలేదు. ఈ పరిణామాన్ని తీవ్రంగా పరిగణించిన కార్ల్‌సెన్ తాను టోర్నీ నుంచి వైదొలగుతున్నానని ప్రకటించాడు. అంతేగాక, 'ఫిడే' వ్యవహార శైలితో విసిగిపోయానని, అందుకే, రాబోయే బ్లిట్జ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనబోనని తేల్చిచెప్పాడు. కాగా, 'ఫిడే' తన నిర్ణయాన్ని తొలుత సమర్థించుకుంది. మరో ఆటగాడు ఇయాన్ నెపోనియాచ్చి స్పోర్ట్స్ షూ ధరించగా, అతనిని కూడా వారించినట్టు తెలిపింది. డ్రెస్ కోడ్ ఎవరికైనా ఒకటేనని, దాని నుంచి ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేసింది. అయితే, ఆ తర్వాత తన అభిప్రాయాన్ని మార్చుకుంది. జీన్స్ ప్యాంట్ ధరించడాన్ని అనుమతిస్తూ, డ్రెస్ కోడ్‌ను మార్చింది. 'ఫిడే' నిర్ణయంతో శాంతించిన కార్ల్‌సెన్ తన ప్రకటనను వాపసు తీసుకున్నాడు. ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటానని ప్రకటించాడు. అయితే, ఈసారి మాత్రం అతను ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకునే అవకాశాన్ని కోల్పోయాడు. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ అతను పాల్గొనని విషయం తెలిసిందే. అందులో నెగ్గిన డింగ్ లిరెన్‌ను ఈ ఏడాది పోటీల్లో ఓడించిన భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ దొమ్మరాజు విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే.



మాగ్నస్ కార్ల్‌సెన్

# టీమిండియా బిజీబిజీ!




ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్, ఇంగ్లాండ్ పర్యటనలతో ఈ ఏడాది భారత క్రికెట్ జట్టు బిజీబిజీగా ఉండనుంది. 2024 సంవత్సరాన్ని మెల్బోర్న్ టెస్టులో ఓటమితో ముగించిన టీమిండియా, సిడ్నీ వేదికగా కొత్త సంవత్సరంలో తొలి, ఆసీస్ టూర్‌లో చివరిదైన ఐదో టెస్టును సిడ్నీలో ఆడుతున్నది. ఈ సిరీస్‌లో భాగంగా పెర్త్‌లో జరిగిన మొదటి టెస్టును భారత్ 295 పరుగుల తేడాతో గెల్చుకుంది. అయితే, అడెలైడ్‌లో రెచ్చిపోయిన ఆస్ట్రేలియా రెండో టెస్టును ఏకంగా 10 వికెట్ల ఆధిక్యంతో సొంతం చేసుకుంది. బ్రిస్బేన్‌లో మూడో టెస్టు డ్రాగా ముగియగా, మెల్బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా 184 పరుగుల తేడాతో గెలిచి, 2–1 ఆధిక్యాన్ని సంపాదించింది. సిరీస్‌ను గెల్చుకునే అవకాశాన్ని ఇప్పటికే కోల్పోయిన భారత జట్టు, చివరి టెస్టును గెలిస్తే, సిరీస్‌ను డ్రా చేసుకుంటుంది. రెండు జట్లకూ అత్యంత కీలకంగా మారిన ఈ టెస్టు చివరికి లోస్కోరింగ్ మ్యాచ్‌గా ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 185 పరుగులకే కుప్పకూలిన టీమిండియా, ఆ తర్వాత ఆసీస్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు పరిమితం చేసింది. నాలుగు పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సంపాదించినప్పటికీ, ఆ ఆనందం ఎక్కువ సేపు నిలువలేదు. రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన భారత్, మూడో రోజు ఆట ముగిసే సమయానికి 141 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న కారణంగా, ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. అయితే, ఈ టెస్టును సొంతం చేసుకొని, సిరీస్‌ను భారత జట్టు డ్రా చేసుకుంటుందని ఆశిద్దాం. ఇలావుంటే, కొత్త ఏడాదిలో, ఆస్ట్రేలియా టూర్ ముగిసిన వెంటనే స్వదేశంలో ఇంగ్లాండ్‌తో ఐదు టి20, మూడు వన్డే ఇంటర్నేషనల్స్‌లో ఆడుతుంది.

**ఇంగ్లండ్ టూర్ షెడ్యూల్**

**జనవరి 22:** తొలి టి20 (కోల్‌కతా)
**జనవరి 25:** రెండో టి20 (చెన్నై)
**జనవరి 28:** మూడో టి20 (రాజ్‌కోట్)
**జనవరి 31:** నాల్గో టి20 (పుణే)
**ఫిబ్రవరి 2:** ఐదో టి20 (ముంబై)
**ఫిబ్రవరి 6:** తొలి వన్డే (నాగ్‌పూర్)
**ఫిబ్రవరి 9:** రెండో వన్డే (కటక్)
**ఫిబ్రవరి 12:** మూడో వన్డే (అహ్మదాబాద్)

ఈ పరిమిత ఓవర్ల సిరీస్ తర్వాత, భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ (వన్డేలు)లో పాల్గొంటుంది.

**ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్..**

**ఫిబ్రవరి 20:** భారత్ vs బంగ్లాదేశ్ (దుబాయ్)
**ఫిబ్రవరి 23:** భారత్ vs పాకిస్తాన్ (దుబాయ్)
**మార్చి 2:** భారత్ vs న్యూజిలాండ్ (దుబాయ్)

గ్రూప్ దశలో ఫలితాల ఆధారంగా సెమీస్, ఫైనల్ మ్యాచ్‌ల్లో ఆడే జట్లు ఖరారవుతాయి.

ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం, టీమిండియా ఇంగ్లండ్ లో ఐదు టెస్టు మ్యాచ్ల సిరీస్ ఆడుతుంది. ఆ సిరీస్ షెడ్యూల్

**జూన్ 20–24:** తొలి టెస్టు (లీడ్స్)
**జులై 2–6–30:** రెండో టెస్టు (బర్మింగ్‌హామ్)
**జులై 10–14:** మూడో టెస్టు (లండన్, లార్డ్స్)
**జులై 23–27:** నాలుగో టెస్టు (మాంచెస్టర్)
**జులై 31–ఆగస్టు 4:** ఐదో టెస్టు (లండన్,కెన్నింగ్‌టన్‌ఓవల్)

ఇలావుంటే, షెడ్యూల్ ప్రకారం, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్, సౌతాఫ్రికాతో భారత జట్టు సిరీస్‌లు ఆడాల్సి ఉంది, కానీ వీటికి సంబంధించిన షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు.

---

## సొంతింటి కల నెరవేర్చే దిశగా చర్చిస్తున్నాం

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : సింగరేణి కార్మికుల సొంతింటి కల, వడ్డీలేని రుణాల కోసం యాజమాన్యంతో చర్చిడం జరిగిందని, వెంటనే అమలు చేయడం జరుగుతుందని సింగరేణి కాలరీస్ వర్క్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. శనివారం భూపాలపల్లి ఏరియాలోని కెటికె 1ఇంక్లైన్‌లో ఎఐటియుసి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చేది శగా స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించడం జరిగిందన్నారు. అలాగే సింగరేణిలో 2035 వరకు పాత గనులు మూసివేయడం జరుగుతుందని,నూతన బొగ్గు బావులు రావలసిన అవష్యకత ఉందన్నారు. ఆదిశగా యాజమాన్యంతో చర్చించటం జరిగిందని తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలకు రిజర్వేషన్ కోట ప్రకారం విద్యార్థులకు మెడికల్ సీట్లు కేటాయించడం జరుగుతుందని వివరించారు. సింగరేణి అనేక సమస్యలపై గుర్తింపు సంఘంగా గెలిచిన నుండి డిపెండెంట్ వయోపరిమితి పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీలు గురిజపెల్లి సుధాకర్ రెడ్డి, జి శ్రీనివాస్,కాంట్రాక్ట్ వర్కర్స్ ఇంచార్జీ నూకల చంద్రమౌళి,బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుడేటి ఐల య్య, కొమురయ్య,అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ తదితరులు కార్మికులు పాల్గోన్నారు.

## జిఒ విడుదల చేయకపోవడం శోచనీయం : పల్లా నర్సింహారెడ్డి

ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండలోని సివిల్ సప్లై గోడౌన్ ముందు సివిల్ సప్లై హమాలీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె 4వ రోజుకు చేరుకుంది. శనివారం సమ్మెకు సంఘీభావం తెలిపిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపిపి పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. గతంలో సివిల్ సప్లై కమిషనర్ కార్మికులతో ఒప్పుకున్న ప్రకారం జిఒ అమలు చేయక పోవడం శోచనీయం అని అన్నారు. పెరిగిన రేట్ల జిఒ అమలు చేయకపోవడం వెనుక ఉన్న మతలబు కార్మికులకు అర్థం కావడం లేదని అన్నారు. ఒప్పుకున్న రెట్ల ఒప్పందం జిఒ 3 నెలలు అయిన అమలు చేయకపోవడం ఏంటని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలతో సహా ఒప్పంద జిఒను అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించి కార్మికులకు 10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించకపోతే సమ్మె యధావిధిగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షులు పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ సివిల్ సప్లై అధికారులు అంగీకరించిన విధంగా క్వింటాల్ ఎగుమతి దిగుమతి 29 రూపాయలు వెంటనే చెల్లించే విధంగా జిఒ విడుదల చేయాలన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే జిఒ విడుదల చేసి సమ్మె విరమింప చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సిం హా, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, సివిల్ సప్లై హమాలీ యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




# భూ ఆక్రమణదారుల గుండెల్లో గుబులు

### బిసి, ఎస్‌సిల నోళ్లు కొట్టి భూములు లాక్కున్న వారి పాత్ర ఎంతుందో విచారణ జరిపించాలి : చాడ



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూ కబ్జాదారుల గుండెల్లో గుబులు మొదలైంది. అరెస్టు పర్వం కొనసాగుతుంది. భయంతో కొంతమంది అక్రమంగా భూ అక్రమాలకు పాల్పడ్డవారు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పజెప్పాలనే నినాదంతో ఆక్రమణ దారులు కలెక్టరేట్ కార్యాలయంలో బారులు తీరుతున్నారు. జిల్లాలో సుమారు 6 నుండి 7వేల ఎకరాల భూమి భూ ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ కూడా స్థానిక శాసన సభ్యుని అనుచరులే భూ ఆక్రమణకు పాల్పడ్డట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇంతకుముందు తహశీల్దార్ ప్రొసిడింగ్ ఇచ్చి పాస్ బుక్కులు కూడా జారీ చేశారని బాధితులు లబోదిబోమంటున్నారు. తంగళ్లపల్లి మండలం కెసిఆర్ నగర్‌లో 40 సంవత్సరాల నుండి కబ్జాలో ఉన్న వారిని తప్పించి పాస్‌బుక్‌లో ఎక్కించుకున్నారని ఆరోపణలు మెండుగా వినబడుతున్నాయి.

#### కబ్జాకు గురైన భూమిని సందర్శించిన చాడ

శనివారం కెసిఆర్ నగర్‌లో కబ్జాకు గురైన భూమిని సందర్శించి బాధితులతో మాట్లాడి ఈ సమస్య రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తిరిగి పట్టాలు ఇప్పించే ప్రయత్నం చేస్తానని బాధితులకు భరోసనిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో దున్నేవాడికే భూమి ఉండాలని చెప్పింది సిపిఐ పార్టీ అని, జెండాలు పాతి ప్రజలకు భూములు పంచింది సిపిఐ పార్టీ అన్నారు. ప్రభుత్వాలు మారిన కొద్ది ఆర్ఒఆర్ చట్టాలని పట్టేదారు పాసు బుక్కులను, అసైన్‌మెంట్, భూస్వాముల చట్టమని, చాలా చట్టాలొచ్చాయని ఎన్ని చట్టాలు వచ్చినా కిందివి కిందనే ఉండి పైనవి పైనే ఉండి మధ్యలది మాయమవుతుందన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర సర్వే చేస్తే దొంగలు ఎవరూ దొరలు ఎవరూ తెలుస్తారని ఎన్నోసార్లు కోరామన్నారు. కానీ పట్టాదారులు ప్రభుత్వ భూమి, గుట్టలు ఉన్న దగ్గర భూములు కొంటూ పక్కనున్న భూములను, గుట్టలు సైతం పట్టాలుచేసుకున్నారని ఆరోపించారు. కెసిఆర్‌ను సర్వే నెంబర్ వారీగా సమగ్ర సర్వే చేయాలని కోరామని, మోఖాపై కాస్తులో ఎవరైతే ఉన్నారో వారికి పట్టాలివ్వాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరామన్నారు. ధరణి పోర్టల్‌తో నిషేధిత చట్టం కింద ఉన్న భూముల ను వారి అన్యాయులకు పట్టాలు చేశారని మండిపడ్డా రు. తంగళ్లపల్లిలో పేదల నోళ్లు కొట్టి కెటిఆర్ తొత్తులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పజెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే నెంబర్ వారీగా సమగ్ర సర్వే చేసి కబ్జాకు గురైన భూముల ను వెన క్కు తీసుకొని పట్టేదారు పాసుబుక్‌లు ఉన్న బాధితు లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ హాయంలో ఎవరికైతే అక్రమంగా పట్టాలయ్యాయో వాటిపై కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరిపించి సీనియర్ ఐఎఎస్ ఆఫీసర్‌తో ఒక కమిటీ ఏర్పాటు చేసి అక్రమంగా పట్టాలు చేసుకున్న వారి పై క్రిమినల్ కేసులు పెట్టి ఇంతవరకు రైతు బంధు తీసుకున్న మొత్తంను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసి రెవెన్యూ మం త్రి పొంగులేని శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమ స్య పరిష్కారం అయ్యే దిశగా పని చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

#### మా పట్టాలు మాకు ఇప్పించండి సార్

మండెపల్లి గ్రామంలో 377 సర్వే నెంబర్‌లో మూడు ఎకరాల భూమి నా పేరుపై పట్టా పాసుబుక్ ఉందని, 40 సంవత్సరాలు కబ్జాలో ఉన్నామని, 2018లో ధరణి పోర్టల్ ద్వారా మా భూమి అన్యాక్రాంతం అయింది. అన్యాక్రాంతం అయిన మా భూమి మాకు ఇప్పించండి.

**పట్టాదారు పాసుబుక్ బాధితుడు**
**ముంద్రాయి భాస్కరచారి**

## కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

### పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటాం : ఎమ్మెల్యే కూనంనేని..



ప్రజాపక్షం/సుజాతనగర్ : కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం మండలంలోని స్టేషన్ బేతంపూడి గ్రామంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా సారథ్యంలో సుజాతనగర్ మండల పార్టీ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు సిపిఐలో చేరారు. చేరిన వారికి ఎర్ర కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దుతానన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడం లక్ష్యంగా పనిచేస్తామన్నారు. గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామన్నారు. పార్టీలో చేరిన వారికి కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. బేతంపూడి మాజీ ఎంపిటిసి సభ్యులు బాణోత్ సక్రం నాయక్, పుల్సింగ్, వార్డు మెంబర్లు వాంకుడోత్ శాంతి, కున్సోత్ శాంతి, బానోత్ సుభద్ర, ధారావత్ బద్రు, మాజీ విద్యా కమిటీ చైర్మన్ కిషన్, ధరవత్ వీరన్న, కిరణ్‌తో పాటు, బేతంపూడి, నాణ్యతండ గ్రామాలు చెందిన కార్యకర్తలు చేరారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ సిపిఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు, జక్కుల రాములు, కుమారి హనుమంతరావు, సిపిఐ నాయకులు కుమారి కృష్ణ, తాళ్లూరి పాపారావు, తాళ్లూరి ధర్మారావు, బొడ్డు కేశవరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు గణేష్, కోమటిపల్లి రాజేష్, భూక్యా శ్రీనివాస్, భాగం కృష్ణ, బోడా రమేష్, అజ్మీరా కళ్యాణ్ పాల్గొన్నారు.

## పెంచిన హమాలీల రేట్ల జిఒను విడుదల చేయకపోవడం విడ్డూరం




ప్రజాపక్షం/ తాండూర్ : గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం సివిల్ సప్లయి హమీల కార్మికుల రేట్లు జిఒను వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. శనివారం తాండూర్ ఎంఎల్‌సి పాయింట్ వద్ద హమాలీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన ఒప్పందం ప్రకారమే జనవరి 1–2024 నుండి కొత్త రేట్ల ఒప్పందం జరగవలసి ఉందన్నారు. చర్చలు జరిపి కూలీ రేట్లు పెంచిన ప్రభుత్వం సంబంధిత గెజిట్ ప్రభుత్వ జిఒను విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో గత్యంతరం లేక కార్మికులు నిరవధిక సమ్మెకు దిగవలసిన పరిస్థితి ఏర్పడిందని దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని ఆయన అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు క్వింటాకు రూపాయలు 26 నుండి 35 కు పెంచాలని 350 కేజీల బెల్స్ బండలను ఒకటికి ఎగుమతి దిగుమతికి రూపాయిలు 200 పెంచాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, తానె శ్రీనివాస్ ,పెద్ద బోయిన చందు ,మహేందర్, బానయ్య, వెంకటేష్, లక్ష్మ ణ్, గణేష్, అంకేశ్, సుమలతలు పాల్గొన్నారు.

## 6న సివిల్ సప్లయి హమాలీల చలో కలెక్టరేట్

ప్రజాపక్షం/మహబూబాద్ ప్రతినిధి : సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారానికై 6న చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి రేషపల్లి నవీన్, హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంకాయపాటి జకరయ్య పిలుపునిచ్చారు. సివిల్ సప్లై హమాలీ కార్మికుల అర్ధనగ్న నిరవధిక సమ్మె 4వ రోజుసమ్మెనుద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎగుమతి, దిగుమతి రేట్లతో పాటు సివిల్ సప్లై కార్మికుల సమస్యలు ఎఐటియుసి నాయకత్వం చర్చించి సమస్యలు పరిష్కరించే వారన్నారు. కమిషనరేట్‌లో ఎగుమతి, దిగుమతి రేట్ల పెంపుకై వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన హామీ అమలు చేయకపోగా జిఒను కూడా విడుదల చేయలేదన్నారు. ప్రతి విషయంపై వినతిపత్రం ఇచ్చి సమ్మె చేస్తామని తెలపడం జరిగిందని కానీ స్పందించకపోవడంసరైంది కాదన్నారు. కాలయాపన చేస్తే స్కూల్కుకు అందించే సరుకులు చేరకపోతేదానికి బాధ్యులు సివిల్‌సప్లై హామాలీ అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైనా ఆలోచించి హమాలీల ఎగుమతి, దిగుమతి రేట్ల జిఒను అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లరి లక్ష్మి నారాయణ, ఎస్ వెంకన్న, తిరుపతి, రవి, భూమయ్య, లింగయ్య, సాయి, అశోక్, ఎం. సురేష్,సరిత, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## జిఒ వస్తుందంటూనే దొడ్డిదారిన బియ్యం సరఫరా



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : జిఒ వస్తుందని చెబుతూనే రెండోవైపు దొడ్డిదారిన బియ్యం సరఫరా చేయటం సరికాదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో సివిల్ సప్లయి కార్పోరేషన్ హమాలీ స్వీపర్ల 4వ రోజు సమ్మెలో భాగంగా నగరంలోని ఎన్‌టిఆర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి మాట్లాడారు. నాలుగు రోజులుగా కార్మికుల సమ్మె చేస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఒక వైపు అధికారులు జిఒ వస్తుందని చెబుతూనే రెండోవైపు దొడ్డిదారిన బియ్యం సరఫరా చేయాలనుకోవడం సరికాదన్నారు. పిట్ల మండలంలో స్టాక్ పాయింట్లు ఈ రోజు ఎలాంటి సమాచారం లేకుండా బియ్యం బయటకు పోయినట్లు కార్మికుల ద్వారా తెలిసిందని పక్కదారి పట్టించడం కోసం ఈ రకమైన విధానాలు అధికారులు అవలంభిస్తున్నారా ? మరి ఎవరైనా చేస్తున్నారా ? అనే అంశంపై గోదాంపై సివిల్ సప్లయి కార్పొరేషన్ అధికారులు, విజిలెన్స్ అధికారులు, పోలీసులు దర్యాప్తు చేసి బియ్యం తీసుకెళ్లిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పి. నర్సింగరావు, ఉపాధ్యక్షులు చక్రపాణి, కార్యదర్శి పిన్నెల హన్మండ్లు, నాయకులు దేవేందర్, బాబర్, మోహన్, తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

# మహానగరి

## విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాపక్షం/కొందుర్గు:** విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శనివారం జిల్లేడ్‌చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్లలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా టోర్నమెంట్‌లు నిర్వహించడం వల్ల ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అన్నారు.



## వేంకటేశ్వర కల్యాణ మహోత్సవంలో కార్పొరేటర్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** శ్రీరేణుక రాజా రాజేశ్వరి శక్తి పీఠం జగన్మాత మొల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పద్మావతి పరిణయ, వేంకటేశ్వర కల్యాణ మహోత్సవంలో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠం సభ్యులు రవీందర్‌రెడ్డి, డాక్టర్.మల్లేశం, మధుసూదన్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## 'కెటిఆర్ ట్వీట్.. ఆయన అపరిపక్వతకు నిదర్శనం'



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** వాహన రిజిస్ట్రేషన్లను టిఎస్ నుంచి టిజికి మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యికోట్ల టెండర్‌ను శ్రీనాథ్ స్మార్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి కట్టబెట్టినట్లు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి బిఆర్ఎస్ నేత కెటిఆర్ ట్వీట్ చేయడం ఆయన అపరిపకత్వకు నిదర్శనమని కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ విమర్శించారు. కోటికి, వెయ్యికోట్ల అంకెలకు తేడా తెలియని వ్యక్తి అప్పటి మంత్రివర్గంలో ఎలా ఉన్నారని శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో విస్మయం వ్యక్తం చేశారు. సదరు టెండర్ ఫొటో విడుదలచేస్తూ రూ.1.37 కోట్లని, వెయ్యికోట్లుగా వక్రీకరించి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించడానికి వారేమి అమాయకులు కారని ఆమె పేర్కొన్నారు.

## మాదిగ డైరీ – 2025 ఆవిష్కరణ



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** మాదిగ డైరీ –2025 ఆవిష్కరణ కార్యక్రమం శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది. తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డం యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్‌సి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతం, రాష్ట్ర పూర్వ ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి హాజరై, మాదిగ డైరీ–2025ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడ్డం యాదయ్య మాట్లాడుతూ 'డాక్టర్ అంబేద్కర్ అభయ హస్తం' పథకం నిధులను వెంటనే విడుదల చేయాలని సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి ఐక్యవేదిక అధ్యక్షులు విజయ్ కుమార్, మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షులు రాజేందర్, మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షులు బిఎన్. రమేశ్ కుమార్, ఎస్‌సి 57 ఉపకులాల ఐక్య వేదిక అధ్యక్షులు రాజలింగం, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సంద్రు నరసింహ రావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

### షాద్‌నగర్ ఉప రవాణాశాఖ అధికారి వాసు



**ప్రజాపక్షం/నందిగామ:** ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం..రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు కృషి చేద్దామని షాద్‌నగర్ ఉప రవాణాశాఖ అధికారి వాసు తెలిపారు. శనివారం పట్టణంలోని ఎంవిఐ కార్యాలయం ఆవరణలో స్కూల్ బస్సు డ్రైవర్లతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ వాసు మాట్లాడుతూ జనవరి 1వ తేది నుండి 31వ తేది వరకు రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. స్కూల్ బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహవాలను నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయడంతోపాటు తగిన జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు. వాహనాలు నడిపించే సమయంలో సెల్‌ఫోన్లు మాడితే ఫైన్ విధించడం తోపాటు కేసులు నమోదు చేయనున్నట్లు వివరించారు. మద్యం సేవించి వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో నడపరాదని, అనేక అంశాలపై డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వినయ్, కానిస్టేబుల్ శ్రీకాంత్, హోంగార్డు భూపాల్, అశోక్‌తోపాటు డ్రైవర్లు ఉన్నారు.

## మహిళాభ్యున్నతికి సావిత్రిబాయి కృషి

### టిఎస్ఎస్ఒ రాష్ట అధ్యక్షుడు లక్ష్మీ నివాస్



**ప్రజాపక్షం/షాబాద్ :** మహిళ భ్యున్నతికి సావిత్రిబాయి పూలే కృషి చాల గొప్పదని టిఎస్ఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నివాస్ అన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలోని గురుకుల్ పాఠశాలలోని మహిళ ఉపాధ్యాయులు వినోద, గౌతమి, క్రాంతి, రాధిక, జంగమ్మలకు సావిత్రిబాయి పూలే జన్మదినం సందర్భంగా శాలువాతో సత్కరించి పూలే చిత్ర పట్టాని అందజేశారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



**ప్రజాపక్షం/ చంపాపేట:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధి మాధవనగర్‌కాలనీలో రూ. 39లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన శనివారం కాలనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీ వాసులకు రోడ్డు నంబర్ 7,8,9లో రోడ్డు లేక పలు ఇబ్బందులు పడుతుండడంతో, ప్రత్యేక చొరవ తీసుకొని నూతనంగా సీసీ రోడ్డు పనులను చేపడుతున్నామని అన్నారు. సీసీ రోడ్డు పనులు 22 అడుగుల వెడల్పుతో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, త్వరగా పూర్తి చేయాలని సదరు గుత్తేదారుడిని అధికారులను అదేశించారు. దశలవారిగా డివిజన్ పరిధిలోని కాలనీలు బస్తీల్లో అభివృద్ధి పనులను చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఏఈ సురేశ్, కాలనీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అనసూయ, కార్యదర్శి బెనర్జీ, మాజీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, భాజపా నాయకుడు దశరథ్ గౌడ్, నాయకులు శ్రీధర్‌గౌడ్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అపరిశుభ్ర వాతారణంలో కేక్‌ల తయారీ!

### నగరంలో బేకరీలపై ఫుడ్ సెఫ్టీ అధికారుల దాడులు

### పలు బేకరీలు సీజ్, నోటీసులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేక్‌ల తాయారీలో ప్రమాణాలు పాటించని బేకరీలపై జిహెచ్‌ఎంసి ఫుడ్ సెఫ్టీ అధికారులు కొరడా జులిపించారు. నగరంలోని పలు బేకరీలను సీజ్ చేయడంతో పాటు నోటీసులు జారీ చేశారు. ఎక్కువ డబ్బులు సంపాదించేందుకు కొంతమంది బేకరీ నిర్వహకులు ప్రజల ఆరోగ్యాలనే పణంగా పెడుతున్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా కల్తీనే లభిస్తుంది. నిర్వహకులు నాణ్యత విషయంలో తిలోదకాలు ఇచ్చేశారు. ఆహారం విషయాల్లోనూ వ్యాపారస్తులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అనేక రెస్టారెంట్లు, హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించిన వాటిని సీజ్ చేయడంతో పాటు పలువురికి నోటీసులు కూడా ఇస్తున్నారు. అయినా వ్యాపారుల్లో మాత్రం చలనం రావడం లేదు. తాజాగా బేకరీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించగా, దారుణమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బేకరీలో కనిపించిన దృశ్యాలను చూసి ఫుడ్ సేఫ్టీ అధికారులు షాక్‌కు గురయ్యారు. కార్ఖానాలోని వాక్స్‌పెస్ట్రీన్ బేకరి నిర్వహకులు పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో కేక్‌లు తయారు చేస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. ప్లాస్టిక్ డ్రమ్ములలో అపరిశుభ్రంగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే కేక్‌ల తయారీలో ఇతర కెమికల్స్ కూడా వాడుతున్నట్లు అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. కేక్‌ల తయారీ విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బేకరీ నిర్వహకులపై చర్యలు తీసుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు వెల్లడించారు.

**బొద్దింకలు, ఎలుకల మధ్యే..**

మరోవైపు అల్వాల్ మచ్చ బొల్లారం మోంగినిస్ బేకరీలోనూ ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు నిర్వహించారు. బొద్దింకలు, ఎలుకల మధ్య కేక్‌లను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు వాడుతున్నట్లుగా అధికారుల తనిఖీల్లో బయటపడింది. గడువు తీరిన కోకోనట్ పౌడర్, కేసర్ సిరప్, వెనీలా ఫ్లేవర్ సిరప్, పైన్ యాపిల్ సిరప్‌లను అధికారులు సీజ్ చేశారు. అపరిశుభ్ర వాతావరణంలో కేక్‌లను తయారు చేస్తున్న బేకరి నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

## నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర ప్రజలకు అన్ని సౌకర్యాలతో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, పలు అభివృద్ధి పనులు చేపట్టబడుతున్నామని గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. రూ. 3 కోట్ల 54 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ పనులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఎంఎల్‌ఎ దానం నాగేందర్‌తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించడంలో నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా వివిధ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎస్.ఇ రత్నాకర్, కార్పొరేటర్ మన్నె కవిత తదితరులు పాల్గొన్నారు.

## దళితుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆందోజు రవీంద్ర చారి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** దళితుల హక్కులను కేంద్ర పభుత్వం కాలరాస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి ఆరోపించారు. శనివారం ఎల్‌బి నగర్ నియోజకవర్గ దళిత హక్కుల పోరాట సమితి సమావేశంను ఎస్.ఎ డాంగే భవనంలో పి.సురేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు మల్లేష్ పాల్గొని మాట్లాడారు. స్వాతంత్రం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా దళితుల పై అనేక దాడులు జరుగుతన్నాయని, దళితుల కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకోచ్చిన వాటిని అమలు చేయడం ప్రభుత్వ యంత్రగం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలకు అండగా నిలువాల్సిన అధికార యంత్రాగం మాత్రమే బడ నాయకులకు సలాం చేస్తుందని విమర్శించారు. దేశంలో దళితులకు 50 శాతం వరకు భూములు లేక ఉన్నారని, వారి సౌకర్యాలు కల్పించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేశారన్నారు. అసంఘటిత రంగ కార్మికులల్లో 84 శాతం మంది ఉన్నారన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పతిన్నర సంవత్సరాల్లో ఉండి ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు దళితులకు చెందకుండా చేస్తున్న వైనాన్ని ఖండిస్తూ, ఈ దేశంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పరిశ్రమలలో స్థానికంగా ఉన్నటువంటి దళితులకు రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్ రెండవ జాతీయ మహాసభల బహిరంగ సభను ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి దళిత శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాతరాజు నరసింహ, శ్రీదేవి, కందుల సుధాకర్, శివ నాయక్, ఎనమల్ల, శ్రీకాంత్, దేవస్వామి, ఆదిలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## దోమల బెడద నుంచి కాపాడండి

### ది సిటిజన్స్‌కౌన్సిల్ ఉప కార్యదర్శి బొమ్మ ఉపేంద్ర నాథ్ రెడ్డి



**ప్రజాపక్షం/నార్సింగి:** మణికొండ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్య ధోమల బెడద ఎక్కువ ఉందని ది సిటిజన్స్ కౌన్సిల్ ఉప కార్యదర్శి బొమ్మఉపేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆయన తెలియజేశారు. మణికొండ ప్రాంతంలో పెరుగుతున్న ధోమల సమస్య వల్ల చిన్న పిల్లల ఆరోగ్యలపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ప్రజలు ముక్త కంఠంతో వాపోతున్నారని, పిల్లలు పెద్దలు దోమల బెడదతో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా తదితర వ్యాధులకు గురవుతున్నారని ఆయన అన్నారు. ప్రజల మద్దతుతో ది సిటిజన్స్ కౌన్సిల్ మణికొండ ఆధ్వర్యంలో శనివారం నెక్నంపూర్ చింతచెట్టు సర్కిల్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలియజేశారు. దోమల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ పాదయాత్రగా మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ ప్రదీప్ కుమార్ కుని కలసి దోమల బెడద నుంచి కాపాడండి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లు పద్మారావు, నవీన్ కుమార్, నాయకులు ప్రసాద్, గణపతి రాజు, జాఫర్, విజయ భాస్కర్, సుజాత, స్వప్న, రాధిక, రూపా, అనితా, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో పలు కాలనీల కార్యవర్గ సభ్యులు, ది సిటిజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, కార్యదర్శి ఆరీఫ్ మొహమ్మద్, కార్యవర్గ సభ్యుడు బొడ్డు శ్రీధర్, స్థానిక నాయకులు ముత్తంగి లక్ష్మయ్య, గుట్టమీద నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌ఎల సమస్యల పరిష్కారానికి కృషి

### మంత్రి సీతక్కకు విఆర్‌ఎ జెఎసి నేతలు వినతిపత్రం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విఆర్‌ఎలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్ర భుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విఆర్‌ఎ జెఎసి నేతలు పెంటయ్య, శేఖర్, హరిశంకర్, శ్రీకాంత్, శ్రీనివాస్, శివశంకర్‌లు తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కోరారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో ని మధురాపురం గ్రామంలో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సీతక్కను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ద్వారా వినతిపత్రం ఇచ్చారు. జీవో నంబర్ 81 ప్రకారం 61ఏళ్ళ వయస్సుపై బడిన విఆర్‌ఎల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సీతక్క స్పందిస్తూ విఆర్‌ఎల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

**ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇచ్చేందుకు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి సీతక్కను సిఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు కోరారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపురం గ్రామంలో ఆశ వర్కర్లు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

## డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం డివిజన్ లోని భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరిచాలని వాటర్ వర్క్స్ కమిషనర్ అశోక్‌రెడ్డిని శనివారం వారి కార్యాలయంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మర్యా ద పూర్వకంగా కలిసి పూల బోకే అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్ష లు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో కొన్ని కాలనీలకు డ్రైనేజీలు అస్థవ్యస్థంగా ఉందని, వాటిని పునరుద్దరణ చేయాలని, కొన్ని ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన డ్రైనేజీలు ఇప్పటికే ఉన్నాయని, వాటి స్థానంలో నూతన డ్రైనేజీలు మంజూరు చేయాలని కమిషనర్‌కు కోరారు. ఈ మేరకు వాటర్ వర్క్స్ కమిషనర్ సానుకులంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు.

## నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్ అభిమానుల నిరసన



**ప్రజాపక్షం/తలకొండపల్లి:** తలకొండపల్లి మండల చౌరస్తాలో అంబేద్కర్ దిమ్మెను తొలగించడం పట్ల దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో శనివారం నిరసన వ్యక్తం చేశారు.తలకొండపల్లి ముఖ్య కూడలి నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు నాయకులు ర్యాలీ నిర్వహించి ఆందోళన వ్యక్తం చేశారు.అనంతరం అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసే వరకు ఆందోళన కార్యక్రమం చేపడతామని నాయకులు పేర్కొన్నారు.స్థానిక పోలీస్ స్టేషనులో దళిత,గిరిజన రెండు వర్గాలు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ పూలే జాతర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు జి సుధాకర్,మాజీ ఎంపీపీ లక్ష్మిదేవి రఘురాములు,దళిత బహుజన సీనియర్ నాయకులు పేరుమల్ల జ్యోతయ్య,డేవిడ్,శంకర్,కృష్ణ,కుమార్,సంపత్ తదితరులు ఉన్నారు.

## 12న 'సంక్రాంతి సాహిత్య, సాంస్కృతిక సంబరాలు'

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఈ నెల 12న హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో సంక్రాంతి సాహిత్య, సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నట్లు స్ఫూర్తి మ్యూజిక్, డాన్స్ అకాడమీ ఫౌండర్ ఇ.సూర్యతేజ సుభ్రాంత్ మాస్టర్ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కార్యక్రమ బ్రోచర్ ను లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్, తదితరులతో కలసి ఆయన ఆవిష్కరించారు. వివరాలకు, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 10లోపు 7893940600ను సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణారి శేషు, డా.కోటేశ్వర రావు, లయన్ ఉమా శంకర్ రెడ్డి(సి), ప్రతిభా రాజు గౌడ గీతాశ్రీ, పవన్ కుమార్ పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో గోవా మద్యం..



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** హైదరాబాద్‌లో గోవాకు చెందిన 117 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యాన్ని జోసెఫ్ అనే వ్యక్తి గోవా నుంచి హైదరాబాద్ కు వాస్కోడిగామా రైల్లో తీసుకువచ్చాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, సిఐ బిక్షారెడ్డి, ఎస్ ఐ బాలరాజు, కానిస్టేబుల్ యాదగిరి, శ్రీనివాస్, ప్రసన్న, కౌశిక్, అ నీఫ్, సాయిలు రైలులో తనిఖీలు నిర్వహించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జోసఫ్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్‌టిఎఫ్ బృం దం తదుపరి విచారణకు సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

## రైలు దుప్పట్ల కుంభకోణంపై సిబిఐ కేసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వేలో దుప్పట్ల కుంభకోణం జరిగింది. ఈ మేరకు సిబిఐ అధికారులు కేసు నమోదు చేశారు. 3.39 లక్షల కాటన్ దుప్పట్ల సరఫరాకు గతంలో దక్షిణ మధ్య రైల్వే టెండర్లు పిలిచింది. ఈ టెడర్లర్‌లో రూ.7.86 కోట్ల విలువైన దుప్పట్ల సరఫరా చేసేందుకు యుపికి చెందిన ఓ ప్రైవేటు సంస్థ దక్కించుకుంది. అయితే 1.4 లక్షల దుప్పట్లను సరఫరా చేయగా అవి నాణ్యమైనవిగా లేవని రైలు ప్రయాణికుల నుంచి ఫిర్యాదు వచ్చాయి. దీనిపై హైదరాబాద్ టెక్స్టైల్ కమిటీ పరిశీలించి నాణ్యత లేదని నివేదిక అందించింది. ఈ టెండర్లో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందని భావించిన సిబిఐ సరఫరాదారుతోపాటు బాధ్యులైన అధికారులపై సిబిఐ కేసు నమోదు చేసింది.

## అర్హులైన నిరుపేదల ఇండ్ల జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం



**ప్రజాపక్షం/యాచారం :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యే విధంగా అధికారులు కృషి చేస్తున్నారని ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ను యాపులో అప్లోడ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లో దారిద్ర రేఖకు దిగువన ఉండి ఇండ్లు లేని పేదలను గుర్తించి యాప్ ద్వారా ప్రభుత్వానికి నివేధికను పంపిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇతర ఇబ్బంది ఈ పనులలో నిమ్మనగమైనారని అన్నారు. అయా గ్రామాల ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గోన్నారు.

## ఉప్పల ట్రస్ట్ ఆర్థికసాయం



**ప్రజాపక్షం/తలకొం- డపల్లి:** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామపంచాయతీకి చెందిన సంగాయిపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ బంటు రాములమ్మ శుక్రవారం రాత్రి మరణించారు.గ్రామ యువ నాయకుడు పబ్బ సంపత్ కుమార్ ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత తలకొండపల్లి మాజీ జెడ్‌పిటిసి ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూ తి వ్యక్తం చేస్తూ వారికి తక్షణ సహాయంగా శనివారం మృతురాలి భర్త బంటు బాలకిష్టయ్యకు 3వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ వార్డ్ సభ్యులు ఉదయ్ శంకర్,అనురాధ తిరుపతి, నాయకులు పబ్బ శేఖర్,పబ్బ రమేష్,బంటు జగదీష్,బంటు గాలయ్య, గండి గళ్ళ కిట్టు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో నాలుగు రోజుల్లో 34 సైబర్ క్రైమ్ కేసులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నూతన సంవత్సరం వేడుకల నుంచి హైదరాబాద్ ప్రజలు కోలుకోక ముందే సైబర్ నేరగాళ్ల విరుచుకుపడ్డారు. బాధితు లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌కు క్యూ కడుతున్నారు. నాలుగు రోజుల్లో ఈ పోలీసు స్టేషన్‌లో 34 కేసులు నమోదుకావడం గమనా ర్హం. రాష్ట్రంలోని ఏ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్‌లో కూడా ఇంత ఎక్కువ నమోదైన కేసులు లేవు. నాలుగు రోజుల వ్యవధిలో ఇంత పెద్ద ఎత్తున కేసు లు నమోదైన పోలీసు స్టేషన్‌లు ఏవి లేవు. హైదరాబాద్‌లో సైబర్ బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరగడం ఆందోళన కలిగిస్తుంది. బాధితుల్లో షేక్ ఇమ్రాన్, వైష్ణవి, సత్యం రాజ్, సాదియా నిషాత్, జ్యోతి తదితరులు ఉన్నారు. ఇందులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వృద్ధులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైయివేటు ఉద్యోగులు కూడా మోసపోయిన వారిలో ఉన్నారు. ఒక పక్క ప్రభుత్వం, పోలీసు శాఖ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మరోపక్క నేరాలు మాత్రం తగ్గడం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న ఈ సైబర్ నేరాలపై వి ద్యావ్యవస్థలో ఇంటర్ స్థాయి నుంచే ప్రత్యేక సబ్జె క్ట్ పెట్టడం వల్ల ప్రతి ఏటా సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్న వేలాది కోట్ల రూపాయల ప్రజల డబ్బు ను కాపాడగలిగినవారమవుతామని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ని కలిసిన కొలను హన్మంత రెడ్డి



ప్రజాపక్షం/ నిజాంపేట్ : రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డిలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి కలిశారు. కొలను హన్మంత రెడ్డి ఇరువరిని శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు.

# మహానగరి

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గడ్డం రమేష్



ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని శామీర్‌పేట కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్, పొన్నాల్ మాజి ఉపసర్పంచ్ గడ్డం రమేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జెబిఎస్ నుంచి శామీర్‌పేటకు మెట్రోరైలు పొడిగించడంపై ధన్యవాదాలు తెలిపారు. అలాగే మూడు చింతలపల్లి మండలం కేశవరంకు చెందిన మైనార్టీ నాయకుడు మహ్మద్ యూసుఫ్ సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## పెండింగ్ పనులు తక్షణమే పూర్తి

### మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి

ప్రజాపక్షం/ నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం సాధారణంగా జరిగింది. కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 33 డివిజన్ల సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 33 డివిజన్‌లలో పెండింగ్ పనులన్నింటిని తక్షణమే పూర్తి చేయాలని అందుకు కావాల్సిన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నుండి విడుదలైన నిధులతో ఆయా డివిజన్‌లలో నెలకొన్న ప్రధానమైన సమస్యలను పూర్తి చేయాలని, సభ్యులు కావాల్సిన పనులను గురించి వివరించారని, వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబెర్ అలీ, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



## పదవ తరగతి విద్యార్థులకు ‘సూపర్ 100’ స్కాలర్‌షిప్

ప్రజాపక్షం/శామీర్‌పేట : పది తరగతి విద్యార్థులకు సూపర్ 100 స్కాలర్‌షిప్ అందిస్తామని జఠాధార ఎడ్యుకేషనల్ టెక్నాలజి సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టులో అర్హత సాధించిన వారికి ఏప్రిల్ 13న లిఖిత పరీక్ష నిర్వహిస్తారని ఎంపికైన 100మంది విద్యార్థులకు ఉచితంగా ఐఐటి, జెఇఇ, నీట్ ఆన్‌లైన్ కోచింగ్‌తో పాటు ఇంటర్ పూర్తయ్యేవరకు ప్రతినెల రూ.500లు స్కాలర్‌షిప్ అందిస్తారన్నారు. రిజిస్ట్రేషన్ రుసుం రూ.200చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కల విద్యార్థులు www.jetcs.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వాట్సాప్‌లో 7337285228 నంబర్‌కు పంపవచ్చన్నారు. దరఖాస్తుకు చివరి తేది 31/01/2025 ఈ అవకాశాన్ని 10వ తరగతి విద్యార్థులందరు వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.



## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

### రాచకొండ సిపి

ప్రజాపక్షం/చర్లపల్లి: పోలీసు వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతను పెంపొందించడానికి ఇటువంటి ఆకస్మిక తనిఖీలు కీలకమని రాచకొండ కమీషనర్ సుధీర్ బాబు అన్నారు. శనివారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌ను రాచకొండ కమీషనర్ సుధీర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు విభాగాలను సమీక్షించి కేసుల దర్యాప్తు పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు పనితీరును పర్యవేక్షించిన సిపి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బందికి లభిస్తున్న సౌకర్యాలపై కూడా సమీక్షించారు. ప్రజల విశ్వాసాన్ని నిలపెట్టడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రాచకొండ అడిషనల్ డిసిపి వెంకటరమణ,ఏసిపి మహేష్,సిఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

**పోలీసులు బాధ్యతగా విధులు నిర్వహించాలి**

సాయం కోసం వచ్చే వారిని స్నేహపూరితంగా మాట్లాడుతూ చట్ట పరిధిలో వారి సమస్యలకు పరిష్కరించాలని రాచకొండ కమీషనర్ జి.సుధీర్‌బాబు సూచించారు. శనివారం ఆయన కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. స్టేషన్‌లోని పలు విభాగాల ప్రగతిని సమీక్షించిన ఆయన కేసుల దర్యాప్తు పురోగతిపై వివరాలను అడిగి తెల్సుకొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించటంలో పోలీసులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ప్రజల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకొనేందుకు పారదర్శకత, బాధ్యతాధికతను పెంపొందించే లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తుందని ఆయన తెలిపారు.



## ‘వైకుంఠ ఏకాదశి’ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

### టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను విజయవంతం చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని శ్రీ విష్ణు శివాలయంలో ఈ నెల 10న నిర్వహించే వైకుంఠ ఏకాదశి ఉత్సవ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దెమర్రిలోని అతిపురాతణమైన అక్కన్న మాదన్నలు నిర్మించిన శ్రీ విష్ణు శివాలయంలో ఉత్తర ద్వార దర్శనంలో భాగంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆలయాభివృద్ధికి రూ.50లక్షలు మంజూరు చేశారన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఈ ఆలయానికి విచ్చేసి స్వామి వార్లను దర్శించుకుని తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ దోసకాయల వెంకటేష్, పట్టా బాల్‌నర్సింహా, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు విష్ణుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, సంగిశెట్టి అంజనేయులు, లైబ్రరిమెన్ అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్

ప్రజాపక్షం/అల్వాల్ : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని మున్సిపల్ సంఘం ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మచ్చబొల్లారం డివిజన్ యాదవ కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంటాక్ట్ యూనియన్ ఆధ్వర్యంలో అల్వాల్ మున్సిపల్ కార్మికుల జనరల్ బాడి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్రన్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని కార్మికులందరిని తక్షణమే పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.25లక్షల నష్టపరిహారం ఇవ్వాలని 60 సంవత్సరాలు పైబడి రిటైర్‌మెంట్ అయిన కార్మిక కుటుంబానికి రూ.5 లక్షలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అల్వాల్ సర్కిల్ మున్సిపల్ కార్మికులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డిఎన్ శేఖర్, సలహాదారులుగా మహేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




**కార్మికులను పర్మినెంట్ చేసేంతవరకూ పోరాటం: వనంపల్లి జైపాల్‌రెడ్డి**

తాండూరు: రాష్ట్రంలోని మున్సిపాలిటిలలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేసేంతవరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలంగాణ మున్సిపల్ కార్మిక సంఘం యూనియన్ రాష్ట్ర కార్యదర్శి



వనంపల్లి జైపాల్‌రెడి పిలుపునిచ్చారు. తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) వికారాబాద్ జిల్లా 6వ మహాసభలు శనివారం తాండూరు పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్లో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅథితులుగా మున్సిపల్ సంఘం యూనిన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఎఐటియుసి వికారాబాద్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిత్‌లు హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపాలిటిలలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న కార్మికులందరిని ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వెతనం రూ.26వేలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికి జాతీయ పండగ సెలవులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటిలలో కార్మికులకు 8గంటల పనిదినాన్ని అమలు చేయాలన్నారు. ఉదయం ఆరుగంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విధులు నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులందరికి మున్సిపల్ సంస్థ నుండి కాకుండా ప్రభుత్వమే నేరుగా బడ్జెట్ కెటాయించి ట్రేజరి ద్వారా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల అంత్యక్రియల ఖర్చు రూ.30వేలు అమలు చేయాలని, కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. కార్మికులకు పనిముట్లు, బట్టలు, పాదరక్షకులు, నూనే, కుట్టుకూల్లు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ మావేశంలో కార్మికులు పాల్గొన్నారు.

**వికారాబాద్ జిల్లా మున్సిపల్ సంఘం నూతన కౌన్సిల్ సమితి ఎన్నిక**

తాండూరులో జరిగిన జిల్లా మహాసభలో వికారాబాద్ జిల్లా మున్సిపల్ సంఘం నూతన కౌన్సిలర్ సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా జి అశోక్, ఎం. గోపాల్, అధ్యక్షులుగా పి. నర్సిములు, వర్కింగ్ ప్రసిడెంట్ కోటం రాజు, ఉపాధ్యక్షులుగా బాగ్యరి వెంకటప్ప, వీరమణి,, ప్రధాన కార్యదర్శిగా అంతారం లాలప్ప, డిప్యూటి జనరల్ సెక్రేటరిగా ఎ శ్రీనివాస్, కార్యదర్శులుగా జే.గోపాల్, గోసాయి నర్సింహా, కోశాధికారిగా విజయలక్ష్మి , జిల్లా కౌన్సిల్ సమితి సభ్యులుగా బి ప్రకాష్, ముసగళ్ల వెంకటయ్య, ఎం. దేవి, గోరెమ్మ, జె. వెంకటయ్య, భవనేష్, కే. విజయ్, ఎం. అంతప్ప, అరుణమ్మ, జయలక్ష్మి , బి.వీరేశం, మొగులమ్మ, మంజుల, సుధాకర్, టి జయమ్మ, పార్వతమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినట్లు ప్రకటించారు.

## రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేయాలి

### సిఎం రేవంత్‌ను కోరిన ఎఎంసి చైర్మన్ నర్సింహ్మాయాదవ్



ప్రజాపక్షం/శామీర్‌పేట: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయాలని, రైతులకు త్వరలోనే రైతుభరోసాతో పాటు వ్యవసా య పనిముట్లను సబ్సిడి రూపంలో అందజేయాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింహ్మా యాదవ్ అన్నారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడ్చల్ చుట్టు పక్కల మండలాల్లో వ్యవసాయంపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారని వారికి వ్యవసాయ పనిముట్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అలాగే రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## 6న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాపక్షం/తాండూరు:మండల కేంద్రమైన పెద్దేముల్‌లో ఈ నెల 6న ఎల్‌ఎన్‌ఆర్ యువసేన ఆద్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు యువసేన వ్యవస్థాపకులు, తాండూరు ఎ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లొంక నర్సిములు ఓ ప్రకటనలో తెలిపారు. ఇట్టి వైద్య శిభిరాన్ని ఎల్‌ఎన్ ఆర్ యువ సేన ఆద్వర్యాన శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో జిల్లా అందత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కంటి వైద్య శిభిరం మండ ల కేంద్రమైన పెద్దేముల్ ఈ నెల 6న ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఇప్పటికి మండలంలో 13 క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ముందుగా పరీక్షించిన చిట్టిలను తీసుకోనిరావాలని కోరారు. వైద్య శిబిరంలో పరిక్షించిన వారికి ఉచిత మందులు, అద్దాలు, అవసరమైన వారికి ఉచితంగానే కంటి ఆపరేషన్లు నిర్వ హిస్తారని తెలిపారు.

## ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్య నియంత్రణ

ప్రజాపక్షం/తాండూరు: శనివారం వికారాబాద్ జిల్లా తాండూరులో పర్యాటించిన ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తాండూరు పట్టణంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు శేఖపురం ఆంజనేయులు నూతనంగా ప్రారంభించిన ఎలక్ట్రిక్ వాహనాల షోరూం ఎంపి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఇక ముందు భవిష్యత్తు అంత ఎలక్ట్రిక్ వాహనాలదేనని అన్నారు. మనవంతుగా దేశాభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని, ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించి వాయుకాలుష్యం నియంత్రణలో ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి షోరూం నిర్వహకులు శేఖపురం ఆంజనేయులు ఘనంగా సత్కరించారు.

## పేదల అభివృద్ధికోసం అహర్నిశలు పనిచేస్తున్నాం

### స్పీకర్ ప్రసాద్‌కుమార్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:వికారాబాద్ ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో వికారాబాద్ పట్టణ, మండల, మర్పల్లి మండలానికి చెందిన 139 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి, చెక్కులను లబ్దిదారులకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తునే, ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు సభాపతి తెలిపారు. రైతుభరోసాలో భాగంగా పరిమితి లేకుండా సాగుచేసే ప్రతి భూమికి సంక్రాంత్రి తర్వత రైతు భరోసా వర్తింప చేయనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కార్డు ఉన్న లబ్దిదారులకు 12వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గనికి 12వేల ఇండ్లు మంజూరు అయ్యాయని , మరోవిడుతలో కూడా ఇండ్లు మంజురు అవుతాయని అన్నారు. అంతకు ముందు మార్కెట్ కమిటీ భవన అవరణలో 70లక్షల వ్యయంతో చేపట్టే పనులకు ప్రారంభోత్సవం గావించారు. వ్యవసాయ మార్కెట్ కమిటి భవన మరమ్మతులు, మార్కెట్ యార్డులో షెడ్‌లు, కార్యాలయానికి విద్యుద్ధీకరణ మరమ్మత్తు పనులు చేపట్టనున్నామన్నారు. స్పీకర్‌కు మార్కెట్ కమిటి సిబ్బంది సభాపతికి నాగలిని బహుకరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కిషన్‌నాయక్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల. సుధాకర్‌రెడ్డి మార్కెట్ జిల్లా అధికారి సారంగపాణి, ఆర్డిఓ వాసుచంద్ర తహసీల్దార్ లక్ష్మి నారాయణ, మార్కెట్ కమిటీ పర్సన్ ఇంచార్జ్ ఎండి రియాజ్ , కార్యదర్శి ఫసియోదిన్ తదితరులు పాల్గోన్నారు

పోలీసుల అమానుష ప్రవర్తనకు నిరసనగా

## సమగ్రశిక్షా ఉద్యోగుల శాంతియుత ర్యాలీ

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా కేంద్రంలో సమగ్రశిక్షాణ ఉద్యోగులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యవసాయ మార్కెట్‌లో కార్యక్రమం ముగించుకొని క్యాంపు కార్యాలయానికి వస్తున్న సందర్భంగా స్పీకర్‌ను అడ్డగించి సమస్య పరిష్కరంకోసం చొరవ తీసుకోవాలని స్పీకర్‌ను కోరడానికి మహిళ ఉద్యోగులు స్పీకర్‌కు అడ్డంగా ఉండి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులు డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, సిఐ , మహిళా ఉద్యోగుల పట్ల అమానుషంగా ప్రవర్తించి ఇష్టం వచ్చినట్లు నెట్టివేయడంతో చర్చనీయాంశంగా మరింది. కానీ పట్టువదులకుండా స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలసిన సర్వశిక్ష ఉద్యోగులు సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు.



## ధ్వజస్తంభానికి రూ.2లక్షలు విరాళం

ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మధురాగనర్ కాలనీలో నిర్మిస్తున్న అష్ట లక్ష్మి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ద్వజస్తంభ నిర్మాణానికి ఆదర్శ్ రూ. 2 లక్షలు విరాళం అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు ధన, వస్తు రూపేణా విరాళాలు అందజేయాలని కోరారు. వేంకటేశ్వరరావు, మహాలక్ష్మి ల కుమారుడు ఆదర్శ్ ఆలయ అభివృద్ధికి విరాళం అందజేయడంతో వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాంబాబు, మద్దయ్య, రామలక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ డిసిపి వెంకటరమణకు అభినందనలు



ప్రజాపక్షం/చర్లపల్లి: రాచకొండ అడిషనల్ డిసిపిగా వెంకటరమణ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను కమిషనరేట్ పరిధిలోని ఎసి పి కార్యాలయంలో ఎసిపి మహేష్, కుషాయి గూడ, చర్లపల్లి, జవహర్ నగర్, కీసర సిఐలు అంజయ్య, రవికుమా ర్, సైదయ్య, వెంకటయ్య, జవహర్ నగర్ క్రైమ్ సిఐ శ్రీనివాస్‌లు మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.



## సిఎం కప్-2024పోటీల్లో జిల్లాకు 117 మెడల్స్: కలెక్టర్ గౌతం

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: సిఎం కప్–2024 పేరిట నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మేడ్చల్ జిల్లాకు రికార్డుస్థాయిలో ఏకంగా 117 మెడల్స్ దక్కాయి. వివిధ క్రీడా పోటీలకు గాను 37 గోల్డ్ మెడల్స్, 42 సిల్వర్ మెడల్స్, 38 కాంస్య పతకాలు దక్కాయని, విజేతల్లో టీమ్ గేమ్‌లో గెలుపొందిన మొదటి విజేతకు లక్ష రూపాయలు, రెండవ విజేతకు 75వేల రూపాయలు, మూడవ విజేతకు 50 వేల రూపాయలు, వ్యక్తిగత క్రీడాంశంలో మొదటి విజేతకు 20 రూపాయలు, రెండవ విజేతకు 15 వేల రూపాయలు, మూడవ విజేతకు 10వేల రూపాయలు నగదు రూపంలో అందిస్తారని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించి వాటిలో గెలుపొందిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు ఇచ్చి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పంపించామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రజాపక్షం/చర్లపల్లి: రోడ్డు దాటుతుండగా ఓ వ్యక్తిని ఆటో ట్రాలీ ఢీ కొని మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎన్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం సెక్యూరిటీగా ఏఎస్ రావు నగర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎం. అంథోనిరాయ్(58) పిస్తా హౌస్ వద్ద రోడ్డును దాటుతుండగా టిఎస్ 08 యు 3277 నంబర్ గల ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో నడుపుతున్న ట్రాలీ వేగంగావచ్చి అతనిని ఢీ కొట్టింది. వెంటనే అతనిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని, మృత దేహన్ని రక్త సంబంధీకులకు అందచేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



## ఆహ్లాద భరితంగా థీమ్ పార్కు

ప్రజాపక్షం/నాచారం : వాకర్లకు, సందర్శకులకు ఆహ్లాదభరితంగా ఉండటంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే రీతిలో అత్యంత ఆధునిక హంగులతో మల్లాపూర్ డివిజన్‌లోని థీమ్ పార్కును తీర్చి దిద్దుతామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. రూ.4 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న సుందరీకరణ, అభివృద్ధి పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కల్సి శనివారం పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఈ పార్కును సంక్రాంతి తర్వాత ప్రారంభిస్తామన్నారు. త్వరితగతంగా పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఎఇ స్రవంతి, స్థానిక నేతలు తండా వాసుగౌడ్, ప్రసాద్, పద్మారెడ్డి, దయాకర్‌రెడ్డి, బుసాని రఘు తదితరులు పాల్గొన్నారు.

## చైనా కొత్త వైరస్ వ్యాప్తి నేపథ్యంలో అప్రమత్తతకు వైద్యారోగ్యశాఖ సూచనలు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: చైనాలో కొవిడ్ 19 తరహాలో హెచ్‌ఎంపివీ వైరస్ వ్యాప్తిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సూచనల మేరకు మేడ్చల్ వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. జలుబు, దగ్గు లక్షణాలున్నవారు సమూహాలకు దూరంగా ఉంటూ మరొకరికి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రజలకు పలు సూచనలిస్తున్నారు. కొత్త వైరస్ లక్షణాలు సైతం ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల తరహాలో ఉంటాయని, దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా ఉండటం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడటం, తదుపరి న్యుమోనియాకు దారితీయటంలాంటివి కనపడితే వైద్యులను సంప్రదించాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు మరింత జాగ్రత్త పడాల్సి ఉంటుందని సూచించారు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటిని కర్చీఫ్ కానీ టిష్యూ పేపర్‌తో కానీ మూసి ఉంచుకోవాలని, తరచూ చేతులను సానిటైజర్‌తో కానీ సబ్బుతో కానీ శుభ్రపరచుకోవాలని, పోషకాహారాలతో పాటు ఎక్కువ మోతాదులో నీటిని సేవించాలని, దగ్గు, జ్వరం, జలుబు ఉంటే బహిరంగ ప్రదేశాల్లో తిరగకుండా కోలుకొనే వరకు ఇంట్లోనే ఉండాలని, ఇతరులకు దూరం ఉండాలని, తాము వినియోగించే దుస్తులు, వస్తువులను ఇతరులతో పంచుకోకుండా ఉండటం వల్ల వైరస్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్త పడవచ్చని సూచిస్తున్నారు.

## ఉరేసుకుని బాలిక మృతి



ప్రజాపక్షం/శామీర్‌పేట : బాత్రుమ్‌లో బాలిక ఉరేసుకుని మృతి చెందిన సంఘ టన జినోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నాగవెంకటరమణ, లక్ష్మి దంపతులు గత 15 సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో ఉమా శంకర్ రైస్ మిల్లులో పని చేస్తూ జీవనం గడుపుతున్నారు. వారి కూతురు తేజస్వీని(16) అదే గ్రామం లోని విజేత టెక్నో స్కూల్లో పదవ తరగతి చదువుతుంది. శుక్రవారం తలనొప్పిగా ఉందని స్కూల్‌కు వెళ్లలేదు. అదేరోజు రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. మరుసటి రోజు శనివారం ఉదయం తేజస్విని తల్లి లక్ష్మి బాత్రుమ్‌కు వెళ్లగా తెజస్విని చీరతో ఉరేసుకుని మృతిచెంది కనిపించింది. జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని ఉందని నోట్‌బుక్‌లో రాసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

## దివ్యాంగుల సంక్షేమానికి బ్రెయిలి విశేష కృషి



ప్రజాపక్షం/నాచారం : దివ్యాంగుల సంక్షేమానికి లూయిస్ బ్రెయిలి విశేష కృషి చేశారని కాప్రా పట్టణ వికలాంగుల సమాఖ్య గౌరవాధ్యక్షులు అంకాలప్ప తెలిపారు. కాప్రా మున్సిపల్ సర్కిల్‌లో శనివారం నిర్వహించిన లూయిస్ బ్రెయిల్ జన్మదిన వేడుకల్లో పలువురు అంధ దివ్యాంగులు పాల్గొని కేక్ కట్ చేసారు. ఈ కార్యక్రమంలో వికలాంగులకు వీల్ చైర్లు, స్టిక్కులు, మూగ చెవిటి వారికి చెవిటి మిషన్లు అందించారు. కార్యక్రమంలో వికలాంగుల సమాఖ్యకు చెందిన బాబుజానా, చంద్రశేఖర్, పాండునాయక్, గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల అధ్యక్షులు నర్సింహ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

